
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:179 హైదరాబాద్, గురువారం, 16 జనవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

## ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం..

## సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి15: కాంగ్రెస్ పార్టీకి 140 ఏళ్ల చరిత్ర ఉందని.. ఆ పార్టీ ఏ స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంత ఘన చరిత్ర ఉన్న ఈ పార్టీ దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమంతోపాటు అభివృద్ధి కోసం పాటు పడిందని ఆయన గుర్తు చేశారు. ఇన్నేళ్లు దేశాన్ని నడిపిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోందన్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ అగ్రనేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు



అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. నిన్న కాకుండా మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాగే ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఇకపై ఈ కార్యాలయం వేదికగా ప్రణాళికలు రచించబోతున్నామని జోస్యం చెప్పారు

రాబోయే రోజుల్లో పేద ప్రజలందరికీ ఇక్కడి నుంచే దశ దిశ నిర్ధారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు విధి విధానాలు రూపొందిస్తామన్నారు. దేశ ప్రజలకు ఇది పండగ రోజు అని ఆయన అభివర్ణించారు. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు పలువురు కేంద్ర మంత్రుల అపాయింట్మెంట్ కోరామన్నారు. అపాయింట్‌మెంట్ వచ్చిన వెంటనే వారిని కలిసి.. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

## మళ్లీ నోటీసులు..

## విచారణకు రాలేనన్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 15: హుజురాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డికి మసాబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు హాజర కావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. అయితే ఈ నోటీసులపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తెలంగాణ భవన్‌లో బుధవారం స్పందించారు. తాను గురువారం కరీంనగర్ కోర్టుకు హాజరు కావాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో జనవరి 17వ తేదీన అంటే.. శుక్రవారం విచారణకు హాజరవుతానని మాసాబ్ ట్యాంక్ పోలీసులకు ఆయన వివరణ ఇచ్చారు.

తాను ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న సమయంలో కౌశిక్ రెడ్డి.. తనను అడ్డుకున్నారని చెప్పారు. దీంతో కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను ఎమ్మెల్యే సంజయ్ కోరారు.

కరీంనగర్ ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదుతో పాటు, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏలు కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352, 292 కేసులు నమోదు చేశారు. మరో ఫిర్యాదు కూడా నమోదు కావడంతో ఆయనపై 126 (2),115(2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.దీంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై మూడు వేర్వేరు కేసులు నమోదయ్యాయి.



ఈ నేపథ్యంలో కరీంనగర్ పోలీసులు కౌశిక్ రెడ్డి అరెస్ట్‌కు ఉపక్రమించారు. అదీకాక గత కొంత కాలంగా కౌశిక్ రెడ్డి వివాదాలకు కేరాఫ్ అడ్రన్?గా ఉంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు ఆయన సవాళ్లు విసురుతోన్నారు. ఆ క్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆయన సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై రాయదుర్గం పోలీసులు

గతంలో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులను అడ్డుకోవడంతోపాటు బెదిరింపులకు కౌశిక్ రెడ్డి పాల్పడ్డారు. దీంతో ఈ వ్యవహారంపై బంజారాహిల్స్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక ఈ కేసులో దర్యాప్తు అధికారిగా మసాబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌ను పోలీస్ ఉన్నతాధికారులు నియమించారు. అందులోభాగంగా విచారణకు హాజరు కావాలంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

%మరోవైపు జనవరి 12వ తేదీ.. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొన్నారు. ఆ క్రమంలో సంజయ్‌ను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి చేసిన కామెంట్ల కారణంగా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అది కాస్తా స్వల్ప ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు చేశారు. తనపై కౌశిక్‌రెడ్డి దుర్భాషలాడారని ఆ ఫిర్యాదులో సంజయ్ స్పష్టం చేశారు.

132, 351 (2) బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అలాగే ఈ ఏడాది జనవరి 10వ తేదీన 'గేమ్ చేంజర్' చిత్రం విడుదల సందర్భంగా టికెట్ ధరల పెంపు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇవి సంచలనంగా మారాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ త్రీ టౌన్ పీఎస్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై మరో కేసు నమోదయింది.

ఇక బుధవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ డబ్బులకు అమ్ముడు పోయిన ఓ బ్రోకర్ ఒక దొంగ అంటూ మండిపడ్డారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీ కార్యకర్తలు రాళ్లతో కొడతారని హెచ్చరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలంటూ గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారన్నారు. గతంలో జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్న సమయంలో ఇదే రేవంత్ రెడ్డి మైకు గుంజుకున్నాడని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఆ ఇద్దరికి సిగ్గులేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ఆయన క్యాబినెట్‌లో మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉన్నారని చెప్పారు.

## 40 మందితో బీజేపీ స్టార్

## క్యాంపెయినర్ల జాబితా

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేఎ ఎన్నికల ప్రచార బరిలోకి హేమాహేమీలను దింపుతోంది. పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా 40 మందితో కూడిన జాబితాను బుధవారంనాడు విడుదల చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హెూం మంత్రి అమిత్‌షా తదితరులు ఈజాబితాలో ఉన్నారు.





కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, నితిన్ గడ్కరి, మనోహర్‌లాల్ ఖట్టార్, ధర్మేంద్ర ప్రధాన్, సర్దార్ హర్దీప్ సింగ్ పురి, గిరిరాజ్ సింగ్, బీజేపీ రాష్ట్ర పాలిత ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవిస్, హిమంత బిశ్వ శర్మ, మోహన్ యాదవ్, పుష్కర్ సింగ్ ధామి, భజన్‌లాల్ శర్మ, నయబ్ సింగ్ సైని ఈ జాబితాలో చోటుచేసుకున్నారు. ఇతర ప్రచారకర్తల్లో వీరేంద్ర సచ్‌దేవ, బైజయంత్ జే పాండ, అతుల్ గార్గ్, డాక్టర్ అక్లా గుర్జార్, హర్ష్ మల్హోత్రా, కేశవ్ ప్రసాద్ మౌర్య, ప్రేమ్ చంద్ బైర్వా, సమ్రాట్ చౌదరి, డాక్టర్ హర్షవర్ధన్, హన్స్ రాజ్ హన్స్, మనోజ్ తివారి, రామ్‌వీర్ సింగ్ బిధూడీ, యోగేంద్ర చాందోలియా, కమల్‌జీత్ షెరావత్, ప్రవీణ్ ఖండేల్వాల్, బన్సూరి స్వరాజ్, స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకూర్, హేమమాలిని, రవి కిషన్, దినేష్ లాల్ యాదవ్, సర్దార్ రాజా ఇక్బాల్ సింగ్ ఉన్నారు.

త్రిముఖ పోటీ

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆప్, బీజేపీ, కాంగ్రెస్ ప్రచార హెూరు పెరుగుతోంది. ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి బుధవారంనాడు నామినేషన్ వేశారు. ఆయనపై బీజేపీ అభ్యర్థిగా పర్వేష్ వర్మ, కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ పోటీ పడుతున్నారు. 'ఆప్' ముందుగానే 70 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా, బీజేపీ 59 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. జనవరి 17వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుండగా, ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుంది. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## కేజ్రీవాల్‌కు 'ఖలిస్థానీ' ముప్పు.. ఇంటెలిజెన్స్ సమాచారం

న్యూఢిల్లీ: 'ఆప్' కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు ఉందని, ఖలిస్థాన్ సానుభూతిపరులు ఆయనపై దాడికి కుట్ర పన్నారని నిఘా వర్గాల సమాచారం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇటు ఢిల్లీలోనూ, అటు పంజాబ్‌లోనూ



శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, ప్రధానంగా కేజ్రీవాల్‌పై దాడి జరగవచ్చని అనుమానిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు ఖలిస్థానీ మద్దతుదారులు ఢిల్లీకి బయలుదేరినట్టు కూడా చెబుతున్నారు. దీని వెనుక పాక్ ఐఎస్ఐ హస్తం ఉందని కూడా అనుమానిస్తున్నారు.


న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేజ్రీవాల్ బుధవారంనాడు నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నిఘా వర్గాల హెచ్చరికలపై మీడియా ప్రశ్నకు స్పందిస్తూ.. "ఉపర్‌వాలా బచాయేగా.." అంటూ సమాధానమిచ్చారు. భగవంతుడి చూపు ఎవరి వైపు ఉందో వారిని ఎవరూ ఏమీ చేయలేరని, దైవం తనతో ఉందని చెప్పారు. ఎవరైనా ఆయుష్షు ఎంతుంటుందో అంతకాలమే బతుకుతారని, అది పూర్తి కాగానే దేవుడు పిలిపించుకుంటాడని అన్నారు.

కాగా, కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు ఉందంటూ ప్రాథమిక సమాచారం ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కేజ్రీవాల్ 'జడ్ ప్లస్' క్యాటగిరి భద్రతలో ఉన్నారు. పైలట్, ఎస్కార్ట్ టీమ్, క్లోజ్ ప్రొటెక్షన్ స్టాఫ్, సెర్చ్ అండ్ ఫ్రిస్క్ యూనిట్లతో సహా 63 మంది సిబ్బంది ఆయనకు రక్షణగా ఉన్నారు

## నిరాహార దీక్ష విరమించనున్న

## పీకే.. కీలక ప్రకటనకు సిద్ధం

పాట్నా: బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్‌సీ) పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపై 14 రోజులుగా నిరాహార దీక్ష సాగిస్తున్న జన్ సురాజ్ చీఫ్ ప్రశాంత్ కిషోర్ జనవరి 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు దీక్ష విరమించనున్నారు. గంగా పథ్ సమీపంలోని



జన్ సురాజ్ క్యాంప్‌లో ప్రశాంత్ కిషోర్ దీక్ష విరమించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

"యువత, జన్ సురాజ్ ఫ్యామిలీ విజ్ఞప్తిని గౌరవిస్తూ ప్రశాంత్ కిషోర్ తమ దీక్షను గురువారంనాడు విరమించనున్నారు. బీహార్‌లో విద్యావ్యవస్థ కుప్పకూలడం, పరీక్షల నిర్వహణలో అవినీతికి నిరసగా ఆయన దీక్ష చేపట్టారు. దీక్ష విరమణతో పాటు ఉద్యమం తదుపరి దశ గురించి ఆయన ప్రకటన చేస్తారు. ఈ చారిత్రక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, సత్యాగ్రహ ఉద్యమానికి బలం చేకూర్చాలని కోరుతున్నాం" అని జన్ సురాజ్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది.

దీనికి ముందు, ప్రశాంత్ కిషోర్ తమ దీక్షను విరమించాలని బీహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ కోరారు. సమస్య పరిష్కారం కోసం చర్చించేందుకు ఒక విద్యార్థి ప్రతినిధిని పంపాలని ఆయన కోరినట్టు తెలుస్తోంది. తనకున్న అధికారాన్ని వినియోగించిన సమస్య పరిశర్కానికి చేయగలిగినంత చేస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్టు విద్యార్థి నేతలు తెలిపారు.


మరోవైపు, ప్రశాంత్ కిషోర్ సహా పలువురికి బీపీఎస్‌సీ లీగల్ నోటీసులు పంపింది. రాష్ట్రంలో డిసెంబర్ 13న సీసీఈ నిర్వహించిన పరీక్షలపై కమిషన్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ నోటీసులు వెళ్లాయి. బీపీఎస్‌సీకి వ్యతిరేకంగా నిరాధార ఆరోపణలు చేసినందుకు పలువురు రాజకీయ నేతలు, కోచింగ్ సెంటర్స్‌తో అసోసియేషన్ ఉన్న వ్యక్తులకు నోటీసులు పంపామని, త్వరలో మరిన్ని నోటీసులు పంపుతామని బీపీఎస్‌సీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు,

భారత శక్తి
VOICE OF INDIAN

## అఖండ భారత్ అడుగులు....

ప్రపంచంలో కొత్త ట్రెండ్ మొదలయ్యింది. గత శతాబ్ధంలో పూర్వపు అవిభక్త రాజ్యాల పాలన కాదని ఎన్నో దేశాలు స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకున్నాయి. అయితే, ఇప్పుడు రష్యా, చైనా? చివరికి అమెరికా సామ్రాజ్యవాదం దిశగా అడుగులేస్తున్నాయి. రష్యా ఉక్రెయిన్‌ను సొంతం చేసుకోవాలని చూనస్తున్నా? చైనా తైవాన్‌ను ఆక్రమించాలనుకున్నా? అటు, కొరియాల గొడవైనా? ఇటు, మిడిల్ ఈస్ట్ యుద్ధమైనా? స్పష్టంగా సామ్రాజ్యాలను విస్తరించుకోవాలనే ఉద్దేశం గట్టిగానే ఉంది. చివరికి అమెరికా సైతం? కెనడా, మెక్సికో, పనామా, గ్రీన్ ల్యాండ్‌లను కలుపుకోడానికి ఆసక్తిగా ఉంది. ఇటీవల, దీనిపై అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక, ఇప్పుడు భారత్ కూడా ఇదే దిశగా అడుగులేస్తుందా అనే సందేహం కలుగుతుంద భారత వాతావరణ శాఖ 150 ఏళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'అవిభక్త భారతదేశం' సెమినార్‌లో పాల్గొనాలని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో పాటు ఇతర పొరుగు దేశాలను భారతదేశం ఆహ్వానించింది. విభేదాలను పక్కనపెట్టి, భారత ఉపఖండం ఉమ్మడి చరిత్రను ఐక్యంగా జరుపుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన తొలి ప్రయత్నం ఇది. ఇందులో భాగంగా? పొరుగున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్‌లకు ఆహ్వానాలు పంపారు. ఉపఖండంతో పాటు, మధ్యప్రాచ్యం, మధ్య-నైరుతి ఆసియా దేశాలకు కూడా ఆహ్వానాలు పంపించారు. అయితే, పాకిస్తాన్ ఇప్పటికే తాము పాల్గొంటామని ధృవీకరించింది. ఇక, బంగ్లాదేశ్ నుండి ధృవీకరణ కోసం భారత్ వేచి ఉంది. బంగ్లాదేశ్ ఓకే అంటే మాత్రం? ఈ సమావేశం ఒక చారిత్రాత్మక క్షణంగా మిగిలిపోతుంది. భారత వాతావరణ సంస్థ స్థాపన సమయంలో అవిభక్త భారతదేశంలో భాగమైన అన్ని దేశాల అధికారులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నట్లు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఇక, ఈ ప్రత్యేక సందర్భాన్ని గుర్తుచేసుకోడానికి భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ.150 రూపాయల స్మారక నాణెం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు.ఒకసారి, భారత వాతావరణ శాఖ చరిత్ర చూస్తే? ఈ శాఖ, జనవరి 15, 1875న స్థాపించబడింది. అయితే, దీని కంటే చాలా కాలం ముందుగానే వాతావరణ అబ్జర్వేటరీలు ఏర్పాటయ్యాయి. మొదటి వాతావరణ అబ్జర్వేటరీలను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించగా? కలకత్తా అబ్జర్వేటరీ 1785లో, మద్రాస్ అబ్జర్వేటరీ 1796లో, బాంబే అబ్జర్వేటరీ 1826లో ప్రారంభమైంది. ఇక, 19వ శతాబ్దం ప్రారంభంలో అనేక అబ్జర్వేటరీలను స్థాపించారు. ఇప్పుడు, ఇవి భారత ఉపఖండం అంతటా విస్తరించాయి. 1864లో వచ్చిన తుఫాను కలకత్తాను నాశనం చేసిన తర్వాత? 1866, 1871లో రెండు ఘోరమైన రుతుపవనాల వైఫల్యాల వల్ల బెంగాల్ అంతటా కరువు ఏర్పడింది. దాని తర్వాత 1875లో భారత వాతావరణ శాఖ ఉనికిలోకి వచ్చిందిబ్రిటిష్ పాలనలో అడ్మినిస్ట్రేటీవ్ రికార్డుల నిర్వహణ, డేటా విశ్లేషణ అవసరమని నిర్ణయించిన తర్వాత భారత వాతావరణ శాఖ ఏర్పాటయ్యింది. కాబట్టి, వాతావరణ పరిశీలనల సేకరణ, విశ్లేషణ ఒకే భవనంలో ప్రారంభమయ్యాయి. భారత వాతావరణ శాఖ అనే సంస్థగా దీన్ని పేర్కొన్నారు. ఇక, 1875లో ప్రారంభమైనప్పటి నుండి, ఐఎండి ప్రధాన కార్యాలయం కలకత్తాలోనే ఉంది. 1905లో దీనిని సిమ్లాకు, తర్వాత 1928లో పూణేకు? చివరికి 1944లో న్యూఢిల్లీకి తరలించారు. అప్పటి నుండి అది అక్కడే ఉంది. అయితే, సంవత్సరాలుగా ఐఎండి ఒక సాధారణ స్థాయి నుండి ఆసియాకు ప్రముఖ వాతావరణ సూచన సంస్థగా మారింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ఐఎండి వాతావరణ శాస్త్రాలు, కమ్యూనికేషన్, శాస్త్రీయ ఆవిష్కరణలలో గణనీయమైన పురోగతిని సాధించింది. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో స్థాపించబడినప్పుడు, దానితో సహకరించిన మొదటి వాటిలో వాతావరణ శాఖ ఒకటి. 24 గంటల వాతావరణ పర్యవేక్షణ మరియు తుఫాను హెచ్చరికల కోసం తన సొంత భూస్థిర ఉపగ్రహం ఎఔాయను ప్రయోగించిన మొదటి అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం నిలిచింది. కాబట్టే భారత వాతావరణ శాఖ 150వ వార్షికోత్సవాన్ని అఖండ భారత్ ఆశకు వేదిక చేసినట్లు కనిపిస్తోంది. ఇటీవల? ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో కూడా అఖండ భారత్ అంశం చర్చకు దారి తీసింది. కొత్త పార్లమెంట్ భవనంలోని ఓ గోడపై ఉన్న మ్యాప్ శతాబ్దాలకు ముందు ఉన్న భారతదేశాన్ని సూచించే విధంగా రూపొందించారు. అందులో ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న తక్షశిల, మరికొన్ని రాజ్యాలు కూడా ఉన్నాయి. ఈ మ్యాప్‌ని ట్విట్టర్‌లో షేర్ చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి.. 'సంకల్పం సుస్పష్టం.. అఖండ భారత్' అంటూ ట్వీట్ చేశారు. ప్రాచీన యుగాలలో భారతీయ ప్రభావాన్ని చిత్రించాలనే ఉద్దేశంతో? వాయువ్య ప్రాంతంలోని ప్రస్తుత అఫ్గనిస్థాన్ నుంచి ఆగ్నేయ ఆసియా వరకు విస్తరించిని అఖండ భారత్ చిత్రాన్ని చెక్కారు.

# రాయలసీమలో ఫ్యాన్ గాలీ...



కర్నూలు, జనవరి 15, ( రాయలసీమలో మళ్లీ ఫ్యాన్ గాలి వీస్తుంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో క్రమంగా వైసీపీ బలపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. కూటమి సర్కార్ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు సీమ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదన్న భావన ఆ ప్రాంత ప్రజల్లో బలపడుతున్నట్లు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీనికి తోడు కూటమి నేతల మధ్య అనైక్యత కూడా వైసీపీ బలం పుంజుకోవడానికి కారణంగా చెబుతున్నారు. అభివృద్ధి విషయాన్ని పక్కన పెడితే వైసీపీకి, కూటమి ప్రభుత్వానికి పెద్దగా తేడా ఏమీ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే వెల్ ఫేర్ స్కీమ్ అమలులో మాత్రం కూటమి సర్కార్ వెనుకంజలోనే ఉంది. . గత ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో 14 సీట్లు ఉండగా కూటమి పార్టీలకు పన్నెండు స్థానాలు, వైసీపీకి కేవలం రెండు స్థానాలు మాత్రమే లభించాయి. అలాగే అనంతపురం జిల్లాలోని పథ్నాలుగు నియోజకవర్గాలకు గాను పథ్నాలుగు స్థానాల్లోనూ కూటమి పార్టీలు విజయం సాధించాయి. వైసీపీకి జీరో స్థానాలు దక్కాయి. కడప నియోజకవర్గంలో ఉన్న పది స్థానాల్లో కూటమికి ఏడు, వైసీపీకి మూడు స్థానాలు దక్కాయి. చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు స్థానాలకు పన్నెండు నియోజకవర్గాల్లో కూటమి, రెండు స్థానాల్లో వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు కూటమి పార్టీల నేతల మధ్య ఈ జిల్లాల్లో ఎక్కడా సమన్వయం లేదు. ఒకరిపై ఒకరు పైచేయి సాధించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాయలసీమలోని యాభై రెండు నియోజకవర్గాల్లో ఏడు స్థానాలను మాత్రమే వైసీపీ దక్కించుకుంది.మిగిలనవన్నీ కూటమి గెలుచుకుంది. అనంతపురం, కర్నూలు జిల్లాలో కూటమి నేతల మధ్య విభేదాలు బాహాటంగానే కనపడుతుండటంతో క్యాడర్ లో అయోమయం నెలకొంది. మరొక వైపు మంత్రి వర్గంలో పదవులు లభించలేదని సీనియర్ నేతలు సయితం పెద్దగా పట్టించుకోవడం లేదు. అనేక నియోజకవర్గాల్లో కూటమి నేతలు నియోజకవర్గంపై పట్టు సాదించుకునేందుకు ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదోని, మంత్రాలయం, నందికొట్కూరు, నంద్యాల, అనంతపురం, పుట్టపర్తి, కల్యాణదుర్గం, ప్రొద్దుటూరు వంటి నియోజకవర్గాల్లో కూటమి పార్టీ నేతలు ఒకరికొకరు దూషించుకుని, తమ గ్రూపును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కూటమి పార్టీలు బలహీనమయ్యాయన్న టాక్ బలంగా వినపడుతుంది. మరొకవైపు తాడిపత్రి నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలు కూడా సీమపై ప్రభావం చూపుతున్నాయి. ఒకరంటే ఒకరికి పొసగడం లేదు. అధినాయకత్వం కూడా కూటమి నేతల మధ్య రాజీ కుదర్చలేని పరిస్థితుల్లో ఉంది. ఇసుక పాలసీ, మద్యం పాలసీని ఎవరికి వారు సొమ్ము చేసుకునే ప్రయత్నంలో భాగంగా తమ అనుచరులకు కట్టబెట్టాలన్న ప్రయత్నంలో విభేదాలు తలెత్తుతున్నాయని తెలిసింది. ఈ నేపథ్యంలోనే కూటమి నేతలు ఇచ్చిన అవకాశాలే వైసీపీ తన విజయావకాశాలుగా మలచుకునే ఛాన్స్ కనపడుతుంది. మరొక వైపు ఈ నెల మూడో వారం నుంచి జగన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనచేస్తుండటం కూడా వైసీపీకి రాయలసీమలో కొంత సానుకూల వాతావరణం ఏర్పడే అవకాశముందన్నది విశ్లేషకుల అంచనా. మరి కూటమి నేతలు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను తెలుసుకుని సరిదిద్దుకోగలిగితే కొంత తేరుకునే అవకాశాలు లేకపోలేదు.

# డిప్యూటీ సీఎంగా లోకేష్....



తిరుపతి, జనవరి 15, సంక్రాంతి సంబరాల్లో ఏపీ ప్రజలు ఉండగా, కూటమిలో కొత్త నినాదం వినిపిస్తోంది. ప్రస్తుతం ఏపీ కేబినెట్ లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నారా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న నినాదం ఊపందుకుంది. ఈ డిమాండ్ చేసింది కూడా ఎవరో కాదు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో గల మహాసేన రాజేష్. ఇది తానొక్కడి నిర్ణయం కాదని, టీడీపీ క్యాడర్ అంతా కోరుకుంటున్నట్లు మహాసేన రాజేష్ చెప్పడం విశేషం.తెలుగుదేశం పార్టీలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో కొనసాగుతున్నారు మహాసేన రాజేష్. ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరిన మహాసేన రాజేష్, పలుమార్లు వివాదాస్పద కామెంట్లు చేసి సైతం వార్తల్లో నిలిచారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నేరుగా మాజీ సీఎం జగన్ కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసి సంచలనం సృష్టించారు. అటువంటి మహాసేన రాజేష్ తెలుగుదేశం పార్టీలో ప్రస్తుతం కీలక పదవిలో ఉన్నారని చెప్పవచ్చు. తాజాగా మహాసేన రాజేష్ చేసిన కామెంట్స్ ఏపీలో హాట్ టాపిక్ గా నిలిచాయి. అది కూడా తాను చెప్పిన విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు పునరాలోచించాలని కూడా కోరారుమహాసేన రాజేష్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్ర నిర్వహించిన మంత్రి నారా లోకేష్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఉన్నత చదువులు చదివిన రాజకీయ నాయకుడిగా పేరుగాంచిన నారా లోకేష్ కు ప్రభుత్వంలో సరైన ప్రాధాన్యత లేదని మహాసేన రాజేష్ అభిప్రాయపడ్డారు. ఏపీ కేబినెట్ లో చోటు ఉన్నప్పటికీ డిప్యూటీ సీఎం అయ్యే అన్ని అర్హతలు నారా లోకేష్ కు ఉన్నాయన్నారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న నారా లోకేష్ పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని, అందుకే 134 ఎమ్మెల్యే సీట్లు వచ్చాయంటూ రాజేష్ పేర్కొన్నారు.ఏదైనా సమావేశాలు జరిగిన సమయంలో నారా లోకేష్ ప్రాధాన్యత లేకుండా సభావేదికపై దూరంగా కూర్చోవడం తమను ఎంతో బాధిస్తుందని, డిప్యూటీ సీఎం హోదా ఇచ్చిన ఎడల తమ కోరిక నెరవేరినట్లుగా భావిస్తామంటూ కుండబద్దలు కొట్టారు మహాసేన రాజేష్. ఎవరో ఏదో అనుకుంటారని, ఏవో రాజకీయ సమీకరణాలు అంటూ నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వకపోవడం తగదని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు గుర్తించాలని రాజేష్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గల టీడీపీ క్యాడర్ మొత్తం లోకేష్ డిప్యూటీ సీఎం కావాలని ఆకాంక్షతో ఉన్నట్లు, తమ కోరిక నెరవేర్చాలని రాజేష్ డిమాండ్ చేశారు. ఇక ఈ డిమాండ్ కు కూటమి ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

## శ్రీశైలం ఆలయం ...ఇంటి దొంగల చేతివాటం..

## 8 మంది సిబ్బంది పై సస్పెన్షన్ వేటు

నంద్యాల జనవరి 15,

శ్రీశైలం మహా క్షేత్రంలో టోల్గేట్‌లో అవకతవకలకు పాల్పడిన ఉద్యోగులపై వేటు పడింది. శ్రీశైలం టోల్గేట్ విధులు నిర్వహిస్తున్న 8 మంది సిబ్బందిని అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. టోల్ గేట్ లో ఉండాల్సిన డబ్బు కంటే అధికంగా డబ్బు ఉన్నట్లు అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీశైలంకు వచ్చే ప్రతి వాహనం నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన టోల్గేట్ వద్ద వాహనదారుల నుంచి రుసుము వసూలు చేస్తారు. అయితే దేవస్థానం అధికారులు ఈనెల 5 తేదీన ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా సిబ్బంది దగ్గర ఉండాల్సిన డబ్బు కంటే అధికంగా డబ్బు ఉన్నట్లు గుర్తించారు.టోల్‌గేట్ సిబ్బంది వద్ద అదనంగా రుసుము ఉండడంతో విచారణ చేపట్టారు.టోల్గేట్ లో విధులు నిర్వహిన్తున్న రెగ్యులర్ ఉద్యోగి ఎం రామకృష్ణుడుతోపాటు కాంట్రాక్టు సిబ్బంది బి నాగ పరమేశ్వరుడు, జి మల్లికార్జున రెడ్డి,ఎన్ గోవిందు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మల్లికార్జున రెడ్డి, బీఆర్ మల్లేశ్వర్ రెడ్డి, డైలీ వేజ్ సిబ్బంది టోల్గేట్ ఇంచార్జ్ అధికారి శ్రీనివాసరావులపై నివేదిక తయారుచేసిన అధికారులు.. దానిని ఆలయ ఈవో శ్రీనివాసరావుకు అందజేశారు. ఈవో శ్రీనివాసరావు నివేదికను పరిశీలించి 8 మందిని వీధుల నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశా. వారి స్థానంలో ఇతర సిబ్బందిని టోల్గేట్‌లో నియమించారు.

## ఉత్తర భారతదేశంలో పెరిగిన చలి తీవ్రత

**చలి పెరగడంతో ఆయా ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు**

**దేశ రాజధాని ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు**

న్యూ ఢిల్లీ జనవరి 15

;ఉత్తర భారతదేశంలో చలి తీవ్రత పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీ సహా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, బీహార్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలి పెరగడంతో ఆయా ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది.దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఢిల్లీ ? ఎన్సీఆర్ ప్రాంతాల్లో దృశ్యమానత అధ్వానస్థితికి చేరింది. పలు ఏరియాల్లో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. రోడ్డుపై ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. పొగమంచు కారణంగాఢిల్లీలో విమాన, రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం 6 గంటలకు విజిబిలిటీ 100 మీటర్లుగా నమోదైంది. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే దాదాపు 200కిపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించారు. విమాన సర్వీసులు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా సహా పలు విమాన సంస్థలు తమ ప్రయాణికులకు ముందుగానే పలు సూచనలు చేశారు.పొగమంచు కారణంగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని.. ఫ్లైట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. మరోవైపు దట్టమైన పొగమంచు కారణంగా కనీసం 26 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. బుధవారం ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం?శం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఇదిలా ఉండగా.. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. 8 గంటల సమయంలో ఢిల్లీలో ఏక్యూఐ లెవల్స్ 332గా నమోదయ్యాయి.

# ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్

విజయవాడ, జనవరి 15,విజన్ ఉన్నవారికి దూరదృష్టి ఎక్కువ. భావితరాల గురించి ఆలోచన చేస్తారు. సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. పనులు త్వరగా జరిగేలా చేస్తారు. వ్యయ ప్రయాసలు లేకుండా చూస్తారు. ఉపాధి కల్పనపై దృష్టి పెడతారు.విజన్ ఉంటే.. ఎంత కష్టమైన పని అయినా సులభం అవుతుంది. భావి సమస్యలను పరిష్కరిస్తుంది. ఆటంకాలను తొలగిస్తుంది. అవసరాలను తీరుస్తుంది. వ్యయ ప్రయాసలు లేకుండా చేస్తుంది. రాజకీయాల్లో మంచి విజన్ ఉన్న నేతగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు గుర్తింపు ఉంది. టెక్నాలజీని విరివిగా వినియోగించడంలో ఆయన దిట్ట. తెలంగాణ రాజధాని అభివృద్ధికి ఆయన విజనేకారణం. ఇప్పుడు ఏసీ సీఎంగా మరో సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకురాబోతున్నారు.ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రారంభించబోతున్న వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం ఉండదు. ఇంట్లో నుంచే సేవలను పొందవచ్చు. డేట్ ఆఫ్ బర్త్, కులం, నివాసం, ఆదాయం వంటి 150 సర్వీస్‌లు ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ప్రజల సమస్యలు, ఇబ్బందలు తొలగించేందుకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నారు. సమయం వృథా కాకుండా ఉండడమే కాకుండా డబ్బులు ఆదా అవుతాయని అధికారులు పేర్కొంటున్నారుదేశంలో 64 లక్షల పెన్షన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పెన్షన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ప్రజలకు ఇస్తుంది. హెల్దీ, వెల్దీ, హ్యాపీ సొసైటీ అనే లక్ష్యాలతో ప్రభుత్వం నూతన సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టబోతోంది. పేదరికం, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటోంది. చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక పెన్షన్లు రెట్టింపు చేశారు. దీంతో పేదల ఆదాయం పెరిగింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 199 అన్న క్యాంటీన్లద్వారా పేదల ఆకలి తీరుస్తున్నారు. ఇక పైపులైన్ ద్వారా వంటగాయస్ సరఫరాకు చర్యలు చేపడుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని వివిధ వర్గాలకు పెండింగ్‌లో ఉన్న రూ,6,700 కోట్లు విడుదల చేశారు. ఈ ఏడాది పల్లెలకు పండుగ కళ వచ్చిందని సీఎం తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ప్రజలు పండుగలు కూడా ప్రశాంతంగా జరుపుకోలేకపోయారని తెలిపారు. ప్రతీపల్లె, ప్రతీ ఇల్లు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకే స్వర్ణాంధ్ర విజన్ ?2047 కు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ప్రజల తలసరి ఆదాయం, ఆరోగ్యం పెరగాలని ఆకాంక్షించారు. ఇక సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ఎట్టకేలకు తీవ్ర ప్రతిఘటనల మధ్య దక్షిణ కొరియా అధ్యక్షుడు అరెస్టు

సియోల్ జనవరి 15

అభిశంసనకు గురైన దక్షిణ కొరియాఅధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు. అంతకుముందు బుధవారం తెల్లవారుజామున సియోల్‌లోని అధ్యక్ష భవనం వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. యోల్‌ను అరెస్టు చేసేందుకు 3 వేల మందికిపైగా పోలీసులతో యాంటీ కరెప్షన్ ఇన్వెస్టిగేటర్లు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అయితే వారిని అధికార పార్టీకి చెందిన నాయకులు, యోల్ మద్దతుదారులు, వ్యక్తిగత సిబ్బంది,సైన్యం పోలీసులతోపాటు విచారణ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తీవ్ర ప్రతిఘటనల నడుమ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించిన అధికారులు యోల్‌ను అరెస్టు చేశారు. ఓ ఎరుపు రంగు బస్సులో ఆయనను అక్కడి నుంచి తరలించారు. ఆయన్ని ఎక్కడి తీసుకెళ్లారనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. అయితే యోల్‌ను గవాచియాన్‌లోని కరప్షన్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(అమో) కార్యాలయానికి తరలించే అవకాశం ఉన్నది. అక్కడ మార్షల్ లా విధింపు కేసులో విచారణ జరుపనున్నారు. అరెస్టు వారెంట్ నేపథ్యంలో 48 గంటలపాటు ఆయన్ని అదుపులో ఉంచుకునే అధికారం సీఐవోకు ఉంటుంది.సెంబర్ 3న దేశంలో ఎమర్జెన్సీ మార్షల్ లా విధించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై నేషనల్ అసెంబ్లీ 204-85 ఓట్లతో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. మార్షల్ లాను ప్రకటించిన కేసులో విచారణకు సహకరించకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంటు జారీ అయింది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు ఈ నెల 3 విఫల యత్నం చేశారు. తెల్లవారుజామునే అధ్యక్ష భవనానికి చేరుకున్న అధికారులను సైన్యంతోపాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. సుమారు ఆరు గంటల పాటు.. అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. చివరకు అరెస్టును వాయిదా వేసుకున్నపోలీసులు వెనక్కి మళ్లారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని రైతు కూలీలందరికీ అమలు చేయాలి.
## మాజీ మంత్రి హరీష్ రావు

మెదక్ జనవరి 15

ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలోన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు వర్చువల్ గా పాల్గొన్నారు.

హరీష్ రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలి. రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారు. వీరంతా కూలి పనికి వెళ్లే నిరుపేదలు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారు. రాష్ట్రంలో కోటి 2 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఈ కార్డుల ద్వారా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరం. ఒక్క సెంటు భూమి ఉన్నా కూలి కాదు అని చెబుతున్నదని అన్నారు.

ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలిగా గుర్తింపు అనే నిబంధన కూడా సరైనది కాదు.

అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ పనికి వెళ్ళని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించరు అని ప్రభుత్వం చెప్తున్నది. ఈ నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం మార్చి రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి. ఐదు గుంటలు ఉన్న రైతుకు సంవత్సరానికి రైతు భరోసా కింద 1500 మాత్రమే వస్తాయి. ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద 12000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు.. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తాయి. 5 గుంటలో పంట పండింది లేదు, వారు బతికింది లేదు. 5 గుంటలు ఉన్నందుకు 12 వేల రూపాయలు ఇవ్వం అని ప్రభుత్వం చెప్పడం శోచనీయమని అన్నారు.

రైతు భరోసా కింద మీరు ఇస్తున్నది 1500 అయితే ఎగ్గొట్టేది 12 వేల రూపాయలు. రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 24 లక్షల 57,000 మంది ఉన్నారు. గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతు భరోసా తీసుకోవడం వల్ల రైతు కూలీలకు ఇచ్చే 12,000 నష్టపోతారు కాబట్టి. ఇలాంటి రైతులకు రైతు భరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలి. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 సంవత్సరాల వయసు దాటితే కార్డు కోల్పోతారు. కాబట్టి ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలి. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసినట్టు ప్రభుత్వం చెప్పింది. కానీ లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు విడుదల చేయలేదు. సిద్దిపేట జిల్లాలో 68 వేల దరఖాస్తులు వచ్చాయి. డోర్ టు డోర్ సర్వేలో మిగిలిన ఇళ్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి ఫైనల్ చేస్తారు అని పత్రికల్లో వార్తలు వచ్చాయి.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ సభలు పెట్టి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేది. అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే గ్రామసభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలి.

గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరై అయిన వారు కొంత నిర్మించుకొని ఉన్నారు. ఇలాంటి ఇళ్లను పూర్తి చేసుకోడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. అందరూ పేదవారే కాబట్టి వెంటనే నిధులు విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని అన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ అరవింద్ కేజ్రీవాల్ కు కేంద్రం షాక్
## మనీలాండరింగ్ కేసు లో విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అనుమతి

న్యూ డిల్లీ జనవరి 15

;ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు కేంద్రం షాకిచ్చింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు ( )లో ఆయన్నివిచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతులు మంజూరు చేసింది.కాగా, ప్రజాప్రతినిధుల్ని విచారించాలంటే ఈడీ ముందుగా అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు గతేడాది నవంబర్‌లో ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీ గత నెల లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ను అనుమతి కోరింది. ఈడీ అభ్యర్థనకు ఎల్జీ ఆమోదం తెలిపారు. దీంతో ఈ విషయాన్ని ఈడీ అధికారులు కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లగా.. కేజ్రీని విచారించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక కేజ్రీవాల్‌తోపాటు ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ను కూడా విచారించేందుకు కేంద్ర హోం శాఖ అనుమతి ఇచ్చింది.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గతేడాది మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది.

# ఈజీ మనీ కోసం పరకామణిలో చోరీ

తిరుమల, జనవరి 15, కలియుగ దైవం శ్రీవేకంటేశ్వరస్వామి కొలువుదీరిన క్షేత్రం తిరుమల. ప్రపంచంలో ఎక్కువ మంది భక్తులు దర్శించుకునే ? త్రం కూడా తిరుమలే. ఇక ఆ ఏడుకొండలవాడు ప్రపంచంలోరె రెండో అత్యంత సంసన్నుడు. నిత్యం కోట్ల రూపాయల ఆదాయం స్వామివారికి వస్తుంది. ఇక ఆయన దర్శనం కోసం లక్షల మంది నిత్యం వస్తుంటారు. కోరిన కోరికలు తీర్చే కొండంత దేవుడిగా కొలిచే తిరుమల వేంకటేశ్వరస్వామికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశీ భక్తులు కూడా తిరుమలకు వస్తుంటారు. అయితే తిరుమల ఆరు నెలలుగా తరచూ వార్తల్లో నిలుస్తోంది. రెండు నెలల క్రితం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంశం సంచలనంగా మారింది. తర్వాత వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించారు. ఈ ఘటన మరువక ముందే.. తిరుమల ఆలయం పరకామణిలో చోరీ జరిగింది.తిరుమలలో స్వామివారి కానుకలు నిల్వ ఉంచే పరకామణిలో ఉద్యోగే కన్నం వేశాడు. బంగారం చోరీ చేసిన గంటలోపే విజిలెన్స్ అధికారులు గుర్తించి నిందితుడిని పట్టుకున్నారు. పెంచలయ్య అనే బ్యాంకు కాంట్రాక్టు ఉద్యోగి పరకామణి మండపంలోని 100 గ్రాముల బంగారం బిస్కెట్ దొంగిలించి వ్యర్థాలు బయటకు తీసుకెళ్లే ట్రాలీలో ఉంచాడు. బయటకు వచ్చిన ట్రాలీలను టీటీడీ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ట్రాలీ కిందకు వంచినప్పుడు బంగారం బిస్కెట్ బయటపడింది. సీసీ కెమరాలను విజిలెన్స్ అధికారులు పంరిశీలించారు. ఈ బంగారం బిస్కెట్‌ను పెంచలయ్య చోరీ చేసిట్లు నిర్ధారించారు.బంగారం బిస్కెట్ చోరీ కేసు కీలక మలుపు తిరిగింది. దొంగనం చేసి దొరికిపోయిన పెంచలయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఆయన చెప్పిన విషయాలు విని



పోలీసులే విస్తుపోయారు. తిరుపతికి చెందిన వీరిశెట్టి పుంచలయ్య అగ్రిగోస్ కంపెనీ ద్వారా కాంట్రాక్టు ఉద్యోగిగా రెండేళ్లుగా శ్రీవారి పరకామణిలో పనిచేస్తున్నాడు. ఈజీగా డబ్బులు సంపాదించాలని పరకామణిలో గోల్డ్ స్టోరేజ్ గదిలో ఉంచే బంగారు వస్తువులు అపహరించడం మొదలు పెట్టాడు. పెంచలయ్య వ్యవహారంపై అనుమానం రావడంతో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అతనిపై నిఘా పెట్టారు. జనవరి 11న మధ్యాహ్నం గెల్డ్ స్టోరేజీ గదిలో ఉన్న 100 గ్రాముల బిస్కెట్ దొంగిలించి ట్రాలీకి ఉన్న పైపులో దాచాడు. తనిఖీ సమయంలో భద్రతా సిబ్బంది గుర్తించారు. దీంతో పెంచలయ్య పారిపోయాడు.

విచారణలో పెంచలయ్య నుంచి పోలీసులు 555 గ్రాముల బంగారు బిక్కెట్లు, 100 గ్రాముల ఆభరణాలు, 157 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.46 లక్షలు ఉంటుందని అంచనా. రెండేళ్లలోనే ఈ చోరీలకు పాల్పడినట్లు నిర్ధారించారు. ఈజీగా ఎక్కువ డబ్బు సంపాదించాలని ఇలా చేశారని విచారణలో పెంచలయ్య అంగీకరించాడు.

# విశాఖ ఎయిర్‌పోర్టులో నూతన సేవలు.

విశాఖపట్టణం, జనవరి 15, ( అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా తీర్చిదిద్దుతున్న ఏపీ ప్రభుత్వం.. విశాఖపట్నం అభివృద్ధిపైనా దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే చాలా సార్లు ప్రకటించారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా మారిందో.. అదే తరహాలో ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖను మారుస్తామని చంద్రబాబు ఇటీవలే మరోసారి స్పష్టం చేశారు. ఆ దిశగానే విశాఖపట్నంలో గూగుల్, లులూ వంటి అంతర్జాతీయ సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వం ఒప్పించింది. తాజాగా విశాఖపట్నం పారిశ్రామిక అభివృద్ధిలో కీలక అడుగు పడింది. విశాఖపట్నం నుంచి దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ఫార్మా ఉత్పత్తుల రవాణాకు త్వరలోనే మార్గం సుగమం కానుంది2019-20 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సుమారుగా 470 టన్నుల అంతర్జాతీయ కార్గో రవాణా జరిగినట్లు లెక్కలు చెప్తున్నాయి. అయితే ఆ తర్వాతి కాలంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు నిలిచిపోయాయి. వీటికి కూడా పలు కారణాలు ఉన్నాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నిబంధనల ఉల్లంఘన కారణంతో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు నిలిచిపోయాయి. దీంతో ఏదైనా సరుకును ఎగుమతి చేయాలంటే ఇక్కడి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరుకును ఎగుమతి చేయాలంటే చెన్నై,




హైదరాబాద్, బెంగళూరు వంటిచోట్లకు రోడ్డు మార్గంలో తీసుకెళు తున్నారు. అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తు?న్నారు.అయితే ఈ సమస్యలకు చెక్ పెట్టే దిశగా కీలక అడుగు పడింది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు మొదలుపెట్టనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది, రెండేళ్లపాటుకార్గో నిర్వహణ చేపట్టేందుకు ముందుకొచ్చింది. సరుకు తనిఖీల దగ్గర నుంచి లోడింగ్, అన్ లోడింగ్ వరూ అన్నింటి ఖర్చులను ఏపీటీపీసీ భరిస్తుంది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ నుంచి అనుమతులు తీసుకుని.. మూడు వారాల్లో సేవలు ప్రారంభించనున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కోడి మాంసానికి భలే..భలే

ఏలూరు, జనవరి 15, కోళ్లు కత్తులు దూస్తున్నాయి. కోట్లు చేతులు మారుతున్నాయి. సంక్రాంతి పండుగ వేళ పందెం కోడి.. తొడకొట్టి బరిలోకి దిగింది. ప్రత్యర్థితో హోరా హోరీగా పోరాడింది. మినీ స్టేడియాల రీతిలో ఏర్పాట్లు.. వేల మంది వీక్షకులు.. అరుపులు, కేకలు, పందెం రాయుళ్ల జోరు.. వ్యాఖ్యాతల హోరు.. గోదారి జిల్లాలలో నందడి ఇది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పగలూ, రేయి అనే తేడా లేకుండా కోడిపందేలు భారీగా జరుగుతున్నాయి. వేల నుంచి లక్షల వరకూ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ఇక పందేల కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారు. డబ్బులు చేతిలోనే ఉండాల్సిన పనిలేదు. ఇక్కడ కూడా డిజిటల్ ఇండియా వచ్చేసింది. యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే వెంటనే నగదు ఇచ్చేలా ప్రైవేట్ బ్యాంకులు స్టాళ్లు కూడా ఏర్పాటు చేశాయంటే మీరు అర్థం చేసుకోవచ్చు.కోడి పందేలలో గెలిచి డబ్బులు గెలుచుకోవటం ఒకటైతే.. పందెం గెలిచిన కోడి యజమానికి ఇస్తున్న బహుమతులు మరొకటి. ఇలా పందెం గెలిచిన కోడి యజమానులకు ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. కరపలో ఏకంగా మహీంద్రా థార్ కారు బహుమతిగా ప్రకటించారు. 60 కోడి పందేలలో ఎవరెక్కువ గెలిస్తే వారికి థార్ కారు బహుమతిగా ఇవ్వనున్నారు. హోండా యాక్టివాలు, రాయల్ ఎన్ ఫీల్డ్ బైకులు ఇలా అబ్బో లిస్టు పెద్దగానే ఉంది లెండి. అయితే కోడి పందేలు గెలిచినవారు, పందెం కోళ్ల యజమానుల సంగతి పక్కనబెడితే.. పందెంలో ఓడిపోయిన కోళ్లకు కూడా భారీగా డిమాండ్ ఉంది.కోడిపందేల్లో చనిపోయిన కోడిపుంజు మాంసాన్ని కోస మాంసం అని పిలుస్తుంటారు. కృష్ణా, గోదావరి జిల్లాలలో ఈ కోస మాంసానికి ఇప్పుడు భారీగా డిమాండ్ ఉంది సంక్రాంతి పండుగ మూడురోజులలో ఒక్కసారైనా ఈ కోస మాంసం రుచి చూడాలనేది ఇక్కడి ప్రజల నమ్మకం. అందుకే కోస మాంసం కోసం భారీ డిమాండ్ ఉంది. కొంతమంది దూరంగా ఉన్న తమ బంధుమిత్రులకు, రాజకీయ నేతలకు కూడా ఈ కోస మాంసం పంపిస్తున్నారంటే దీనికి ఎంత డిమాండ్ ఉందనేదీ అర్థం చేసుకోవచ్చు. ఈ కోస మాంసాన్ని రూ.2000 నుంచి రూ.3000 పెట్టి మరీ కొంటున్నారు. కనుమ పండుగ రావటంతో ఈ రేటు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో కొంతమంది ఇంట్లో పెంచిన కోడిపుంజులకు గాట్లు పెట్టి అమ్ముతున్నట్లు తెలిసింది. పెరటి కోడిపుంజులను తక్కువ రేటుకు కొనుగోలు చేసి.. బ్లేడ్లతో గాట్లు పెట్టి కాల్చి.. కోస మాంసంగా అమ్ముతున్న ఘటనలు



చోటుచేసుకుంటున్నాయి

# అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట కార్యాచరణ

మంథని

అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం మంథని పట్టణంలోని శ్రీ లక్ష్మి భారతి ఫంక్షన్ హాల్ లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ, తదితర అంశాలపై నిర్వహించిన మంథని నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్డి.వేణు తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయబోతున్న 4 నూతన పథకాలకు అర్హులైన లబ్ధిదారులను, అనర్హులను

ఎంపిక చేసి గ్రామ సభ ల ద్వారా ఆ జాబితాను ఆమోదింప చేసుకోవాలని అన్నారు. గ్రామ సభ ల ద్వారా ఆమోదింప చేసుకున్న జాబితా జనవరి 25 లోపు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.

రైతు భరోసాపథకానికి సంబంధించి ప్రతి మండలంలోని తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్లు, మైనింగ్ , సంబంధిత అధికారులు సంయుక్తంగా పని చేసి పట్టా దార్ పాస్ పుస్తకాల డేటా, గూగల్ మ్యాప్ , రెవెన్యూ మ్యాప్ వారీగా పరిశీలిస్తూ భూ భారతి (ధరణి) నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి సదరు లబ్దిదారులను తొలగించాలని అన్నారు.

రాళ్లు రప్పలు ఉన్న భూములు, సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ చేసిన భూములు, పరిశ్రమల భూములు (రైస్ మిల్ పెట్రోల్ బంక్, ఆహార శుద్ధి పరిశ్రమ....), నాలా కన్వర్షన్ జరిగిన భూములు, లేఔట్ ఉన్న భూములు, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తు భూములు, రోడ్ల భూములు, భవనాలు నిర్మించుకున్న భూముల, మైనింగ్ జరుగుతున్న భూముల వివరాలు రైతు భరోసా నుంచి తొలగించాలని అన్నారు.

భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్నిప్రారంభించిందని, 2023-24 సంవత్సరానికి 20 రోజులు పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ పథకం కుటుంబం యూనిట్ గా అందించడం జరుగుతుందని,వ్యక్తిగతంగా అందించే పథకం కాదని అన్నారు.ప్రతి రెవెన్యూ గ్రామాన్ని జీపి వారిగా మ్యాప్ చేయాలని అన్నారు. జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలుగా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలో ఎంపిక చేసిన జాబితా పై ఏవైనా అభ్యంతరాలు వస్తే సంబంధిత ఎంపీడీఓ 10 రోజుల లోగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సామాజిక ఆర్థిక సర్వే కింద మన పెద్దపల్లి జిల్లాలో తేలిన ఆహార భద్రత కార్డులు లేని కుటుంబాలకు మండలాలలో ఎంపీడీవోలు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్ లు నూతన రేషన్ కార్డుల జారీ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ లేదా వార్డు సభల ద్వారా అర్హులైన జాబితాన్ని ఆమోదింప చేసుకొని రేషన్ కార్డులను 75 గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల ప్రోసిడింగ్స్ పంపిణీ చేయాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్వహించిన సర్వేలో భూములు ఉన్న అత్యంత పేదలకు మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో స్క్రూటినీ నిర్వహించి 13.93 లక్షల దరఖాస్తులను మొదటి విడతలో పరిశీలనకు జిల్లాలకు అందిస్తున్నారని, మనకు వచ్చిన దరఖాస్తులను మరొకసారి చెక్ చేసుకోని, గ్రామాల వారీగా అర్హులను ఎంపిక చేసుకొవాలని, ఎటువంటి ఒత్తిడులకు గురికాకుండా అత్యంత పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు.గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న 4 కార్యక్రమాల మార్గదర్శకాలు, ఉద్దేశం ప్రజలకు వివరిస్తూ పథకాల అర్హుల జాబితాను ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత తుది జాబితా తయారు చేయాలని అన్నారు.జనవరి 23 లోపు గ్రామ సభల నిర్వహణ పూర్తి చేయాలని, గ్రామ సభ ఆమోదించిన తరువాత తుది జాబితా ఆన్ లైన్ లో జనవరి 25 సాయంత్రం లోపు నమోదు చేయాలని, జనవరి 26 నుంచి 4 పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ అన్నారు.

# మూడు ఇండస్ట్రియల్ సిటీలు

తిరుపతి, జనవరి 15, కేంద్రంలోనూ ఎన్డీఏ సర్కారు ఉండటంతో.. కీలక ప్రాజెక్టులు దక్కుతున్నాయి. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఇండస్ట్రియల్ సిటీలు ఏర్పాటు కానున్నాయి. దేశవ్యాప్తంగా 20 ఇండస్ట్రియల్ సిటీలను కేంద్రం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మూడు ఏపీలోనే ఏర్పాటు కానుండటం విశేషం. తిరుపతి జిల్లాలో కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ ( క్రిస్ సిటీ) ఏర్పాటుకానుంది. చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో క్రిస్ సిటీ ఏర్పాటు కానుంది. అలాగే కర్నూలు జిల్లాలో ఓర్వకల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటవుతోంది. హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. మరొకటి కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు కానుంది. విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ నిర్మాణం జరగనుంది.వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రం గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే రూ.2,786 కోట్ల వ్యయంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ, రూ.2,137 కోట్లతో కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు విమానాశ్రయానికి 12 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో నాన్ మెటాలిక్ మినరల్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. అలాగే కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ 2596 ఎకరాలలో అభివృద్ధి చేయనున్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ ద్వారా 54,500 మందికి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ 45 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు తిరుపతి జిల్లా క్రిస్ సిటీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే శంకుస్థాపన చేశారు. కృష్ణపట్నం పోర్టు, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ల ఆధారంగా క్రిస్ సిటీ ఏర్పాటవుతోంది. 10 వేల ఎకరాల్లో మూడు దశల్లో క్రిస్ సిటీ నిర్మాణం జరగనుంది. క్రిస్ సిటీ ద్వారా రూ.37,500 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 4.67 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఎట్టకేలకు తీరిన పసుపుబోర్డు కల

నిజామాబాద్, జనవరి 15,

నిజామాబాద్ పసుపు రైతులు చిరకాల ఆకాంక్ష నెరవేరింది. వారి పోరాటానికి ఫలితం దక్కింది. తతాము పండించే పంటకు మద్దతు ధర దక్కాలంటే.. పసుపు బోర్డు కావాలని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బోర్డు ప్రకటించిన కేంద్రం సంక్రాంతి రోజు రైతుల కల నెరవేర్చింది.నిజామాబాద్ అంటే తెలుగు రాష్ట్రాల రైతులకు గుర్తుకు వచ్చేది పచ్చ బంగారం(పసుపు పంట). మద్దతు ధర కోసం నిజాబాబాద్ పసుపు రైతులు దశాబ్దాలుగా పోరాటం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుచేస్తే తమ కష్టాలు తీరుతాయని ఉద్యమించారు. ఈ అంశం ఎన్నికల హామీగా కూడా మారిపోయింది. తెలంగాణ మాజీ సీఎం కల్వకుంట్ల కవితను ఒకసారి ఎంపీగా గెలిపించింది పసుపు రైతులే. తర్వాత ఓడిపోవడానికి కారణం కూడా పసుపు రైతులే. తనను గెలిపిస్తే పసుపు బోర్డు తెస్తానని బాండ్ రాసి ఇచ్చిన ధర్మపురి అరవింద్ ఆలస్యంగా అయినా సాధించారు. దీంతో మరోసారి అదే రైతులు ఎంపీగా గెలిపించారు. దీంతో గెలిచినా ఆరు నెలలల్లోనే పసుపు బోర్డును ఏర్పాటు చేయించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని 2025, జనవరి 14న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పసుపు బోర్డును ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీ ధర్మపురి అరవింద్ కూడా ఉన్నారు. మోదీ ఆశీర్వాదంతో నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటైందని తెలిపారు.ఇక పసుపు బోర్డు తొలి జైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు కేంద్రం జనవరి 13న ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. గంగారెడ్డి నిజామాబాద్ జిల్లా అంకాపూర్ రైతు. బోర్డు ఏర్పాటు చేసిన జిల్లా రైతుకే కేంద్రం తొలి చైర్మన్‌గా అవకాశం కల్పించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న గంగారెడ్డి తొలుత ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. 1991 నుంచి 1993 వరకు అంకాపూర్ గ్రామకమిటీ అధ్యక్షుడిగా, 1993 నుంచి 1997 వరకు బీజేపీ ఆర్మూర్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. బీజేపీ నిజాబాబాద్ జిల్లా కార్యదర్శిగా, రెండుసార్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2020 నుంచి బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.ఇదిలా ఉంటే పసుపు బోర్డును 2023 అక్టోబర్ 1న మహబూబ్‌నగర్ బహిరంగ సభలో ప్రధాని మోదీప్రకటించారు. అక్టోబర్ 4న కేంద్ర వాణిజ్య శాఖ గెజిట్ జారీ చేసింది. అయితే ప్రధాన బోర్డు కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేసేది పేర్కొనలేదు. తాజాగా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. రైతుల కల నెరవేర్చింది. ఈ బోర్డు కోసం 2019 లోక్‌సభ ఎన్నికల్లో 176 మంది రైతులు నామినేషన్లు వేసి దేశం దృష్టిని ఆకర్షించారు. దీంతో ఆ ఎన్నికల్లో ఈసీ ఒక్కో పోలింగ్ బూత్‌లో 12 ఈవీఎంలు ఉపయోగించింది. ఇక ప్రధాని మోదీ పోటీచేసిన వారణాసిలో కూడా 30 మంది పసుపు రైతులు నామినేషన్ వేశారు.

# వైసీపీ టార్గెట్ పవన్...

విజయవాడ, జనవరి 15, : తిరుపతిలో వైకుంఠ దర్శనం టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతోంది. అయితే ఘటన జరిగిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వైసీపీ అధినేత జగన్ తో పాటు పలువురు రాజకీయ నేతలు, మంత్రులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించడంతో పాటు ఆస్పత్రులకు వెళ్లి బాధితుల్ని పరామర్శించారు. మిగతా వారి సంగతి ఎలా ఉన్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేర్వేరుగా తిరుపతిలో పర్యటించడం చర్చనీయాంశమైంది. ఇక వైసీపీ నేతలు ఈ ఘటనకు సంబంధించి పవన్‌కళ్యాణ్‌ను టార్గెట్ చేస్తుండటం




హాట్ టాపిక్‌గా మారింది.తిరుమల చరిత్రలోనే తీవ్ర విషాదం చోటు చేసుకుంది.. రద్దీ సమయాల్లో తొక్కిసలాటలు జరగడం సాధారణమే అయినప్పటికీ.. తొలిసారిగా, ఆ దశ దాటి భక్తుల మరణాలూ సంభవించాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్న నేపథ్యంలో.. తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్లే మృత్యు వేదికలయ్యాయి. సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు.. తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏకంగా 90 టోకెన్ జారీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఇలా గేట్లు తెరవగానే అలా భక్తులు ఒక్కసారిగా దూసుకురావడంతో? పలుచోట్ల తొక్కిసలాట జరిగింది.. బైరాగిపట్టెడ కేంద్రం వద్ద పరిస్థితి మరింత విషమించింది. రద్దీలో ఇరుక్కుపోయిన భక్తులు ఊపిరాడక అల్లాడిపోయారు. మహిళలు మరింత విలవిలలాడారు. ఈ విషాదంలో ఆరుగురు మరణించగా.. వారిలో ఐదుగురు మహిళలే. తొక్కిసలాటలో పెద్దసంఖ్యలో భక్తులు గాయపడ్డారు. వారికి తిరుపతిలోని స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటల్లో గాయపడటం వంటి ఘటనలు జరిగినప్పటికీ.. మరణాలు సంభవించడం ఇదే మొదటిసారి అంటున్నారుఈ ఘటనపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పని చేశారని .. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్ రెడ్డిని సస్పెండ్ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్ వో శ్రీధర్ ను తక్షణమే బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగేఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం.టీటీడీ ద్వారా మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మరణించిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగమిస్తామని.. తీవ్ర గాయాలైన తిమ్మక్క, ఈశ్వరమ్మలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బాధలో ఉన్నప్పటికి స్వామి వారి దర్శనం చేసుకోవాలనుకున్న భక్తులు 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నష్ట పరిహారం, బాధ్యులపై చర్యలతో పాటు .. ప్రభుత్వం మీద పడిన నిందను తుడిచే ప్రయత్నం చేసినట్లు కనిపించారు. అదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రభుత్వం ఈ ఘటనపై ఎంత ఆవేదన చెందుతుందో అన్నట్లు భావోద్వేగంతో మాట్లాడారు. జరిగిన విషాదంపై వేదనతో పాటు.. అధికారుల నిర్లక్ష్యం.. అలక్ష్యంతో పాటు.. ప్రణాళిక లోపాల్ని ఎత్తి చూపారుఅదే సమయంలో డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రభుత్వం తరపున భక్తులందరికీ క్షమాపణలు చెప్పారు. తప్పు జరిగింది.. బాధ్యత తీసుకుంటామన్నారు. క్షతగాత్రులు, రాష్ట్ర ప్రజలు, వేంకటేశ్వరస్వామి భక్తులు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరినీ క్షమించమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోందన్నారుఈ ఘటన జరగకుండా ఉండాల్సిందని, . పోలీసులు ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వీఐపీలపై కాదు.. సామాన్యులపైనా తితిదే దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల వద్దకు టీటీడీ సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలని ఆదేశించారు. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఈవో, ఏఈవో బాధ్యత తీసుకోవాలన్నారు.అధికారులు చేసిన తప్పులకు తాము తిట్లు తింటున్నామని.. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలన్న దానిపై ప్రణాళిక లేదని పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయని. భవిష్యత్తులో దుర్ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని.. పోలీసుల్లో కొందరు కావాలని చేశారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయని. ఈ అనుమానాలన్నింటిపై విచారణ జరగాల్సి ఉందన్నారు. తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 8-9 గంటలు ఎదురు చూసే పరిస్థితి మారాలని సాధ్యమైతే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారుసనాతన ధర్మాన్ని పాటిస్తూ.. దానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించిన తీరు .. ఆ ధర్మానికి ఆయనెంత విలువిస్తారో మరో సారి స్పష్టం చేసింది. సీఎం, డిప్యూటీ సీఎంలు ఘటనకు సంబంధించి వెంటనే స్పందించినా విపక్షాలు మాత్రం విమర్శలు ఎక్కుపెడుతూనే ఉన్నాయి. హుటాహుటిన కొండ మీదకు చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ దీనికి చంద్రబాబే కారణమని విమర్శించారు.వాస్తవానికి తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్లు ఇవ్వటం గతంలో లేని సంప్రదాయం. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచారు. ఎందుకు పెంచారో తెలియదని, మొదట్నించి ఉన్న సంప్రదాయాన్ని మార్చటం మంచిది కాదని.. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారి పాలక మండళ్లు ఈ నిర్ణయాలు తీసుకున్నాయి. ఇప్పుడు ఇప్పుడు తన మందీమార్బలంతో కొండ మీదకొచ్చిన జగన్ యథావిధిగా తనదైన శైలిలో స్పందించి వెళ్లి పోయారు. ఇక మిగిలిన వైసీపీ నేతలు చంద్రబాబుతో పాటు పవన్‌కళ్యాణ్‌ను టార్గెట్ చేయడం మొదలుపెట్టారిప్పుడు.

# పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాదం

తిరుపతి జనవరి 15,

సంక్రాంతి పండుగ వేళ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలురు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది.

వివరాల్లోకి వెళితే.. చంద్రగిరి పట్టణం బీడీ కాలనీకి చెందిన సమీర్ అనే బాలుడు మరో స్నేహితుడితో కలిసి గాలిపటం ఎగురవేస్తుండగా, ప్రమాదవశాత్తు బాలుడు కిందపడటంతో గాయపడ్డాడు. దీంతో గాయపడిన ఆ బాలుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో గాయపడిన బాలుడి పక్కనే ఉన్న సమీర్ను మేనమామ కోపంతో గదిలో పెట్టి గొళ్లెం వేశాడు. మళ్లీ తిరిగి వచ్చిన తర్వాత కొడతాడన్న భయంతో సమీర్(12) గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అన్నమయ్య జిల్లామదనపల్లె గ్రామంలో ఓ బాలుడు గాలిపటం ఎగురవేస్తున్న క్రమంలో కరెంటు షాక్ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటనలతో పండుగ పూట ఆ బాలుర కుటుంబాల్లో విషాదం నెలకొంది.

# బృందావన్ లో బస్సు దగ్ధం నిర్మల్ వాసి సజీవ దహనం

నిర్మల్ జనవరి 15,

ఉత్తర్ ప్రదేశ్ బృందావన్ లో జరిగిన బస్సు ప్రమాదం ఘటనలో నిర్మల్ జిల్లావాసి సజీవ దహనం అయ్యాడు. ఆగివున్న బస్సులో మంటలు చెలరేగడంతో కుబీర్ మండలం పల్సికి చెందిన శీలం దుర్పతి(70) అనే వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. ఈనెల 1న తీర్థయాత్రలకు భైంసా నుంచి 50మంది ప్రయాణికులు బయలుదేరాడు. బృందావన్ లో దర్శనానికి భక్తులు వెళ్లిన తరువాత అగ్నిప్రమాదం జరిగింది. వృద్ధుడు అనారోగ్యంతో బస్సులోనే ఉండిపోయాడు. మృతుని భార్య మిగతా భక్తులతో దర్శనం కోసం ఆలయానికి వెళ్లింది. ఘటనలో సహా ప్రయాణికుల సామగ్రి, డబ్బులు, బట్టలు, బ్యాగులు కాలి బూడిదయింది. దాంతో యాత్రికులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. యాత్రికులకు దుప్పట్లు, ఆహారం, వసతి, ట్రాన్స్పోర్ట్ లను ఆర్.ఎస్.ఎస్, యూపీ పోలీసులు ఏర్పాటు చేసారు.

# జాతీయ రహదారి పై అలుముకున్న పొగమంచు

వాహనదారులకు ఇక్కట్లు

నల్గోండ జనవరి 15,

నల్లగొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గం పరిధిలో హైదారాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీగా పొగ మంచు కప్పుకుంది. ఉదయం 6 గంటల నుంచి పొగ మంచు దట్టంగా జాతీయ రహదారిపై ఉండటంతో వాహనదారులు చాలా ఇబ్బంది పెడుతున్నారు. ఈ క్రమంలోప్రమాదాలు జరగకుండా వాహనాల హెడ్ లైట్లను, ఇండికేటర్లను వేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. చిన్న వాహనదారులు మంచులో ముందుకు కదల్లేక.. రోడ్లకు ఇరుపక్కల పార్కింగ్ చేసుకున్నారు. పొగ మంచుతో.. ముందు వెళ్తున్న వాహనం కనపడకపోవడంతో.. వాహనదారులు ఇబ్బందికి గురిఅవుతున్నారు.

# కలియుగ భీముడు మన కోడి రామ్మూర్తి నాయుడు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

గుండె మీద ఒకటిన్నర టన్ను బరువును మోపితే చిరునవ్వుతో మోసేవారు. ఉక్కు సంకెళ్లతో ఒంటిని బంధిస్తే ఊపిరితిత్తుల నిండా గాలి బిగించి రెండు క్షణాల్లో తెంపేసేవారు. ఏనుగు ఛాతీ మీదకు ఎక్కితే ఐదు నిమిషాల పాటు ఆ బరువును మోయగలిగేవారు. ఆయన పేరు కోడి రామ్మూర్తి నాయుడు. సిక్కోలు తొలితరం నిజమైన కథానాయకుడు. వెండితెరపై వెలిగిపోయిన బాహుబలికి బాబు లాంటి వారు. వందేళ్ల కిందట ఆయన చేసిన విన్యాసాలను ఈ తరం దాదాపు మర్చి పోయింది. సిక్కోలు కీర్తి బావుటాను దేశవిదేశాల్లో సగర్వంగా ఆయన ఎగరేసిన గాథలను పిల్లలకు చెప్పే కథల్లో కలపడం మర్చిపోయింది. విజయనగరాధీశులు గర్వంగా చెప్పుకునే పంచరత్నాల్లో ఒకరైన సిక్కోలు ముద్దుబిడ్డ కోడి రామ్మూర్తి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ఆ మహానుభావుడి స్మరణలో..

బహుముఖ ప్రజ్ఞాశాలి..


రామ్మూర్తి నాయుడు వ్యాయామ విద్యను బోధిస్తూనే వాయు స్తంభన, జల స్తంభన విద్యను ప్రదర్శించేవారు. ఇలా వ్యాయామ, దేహ దారుఢ్యం, యోగ విద్యలను అలవోకగా చేసేవారు. ఇన్ని విద్యలు తెలిసిన రామ్మూర్తి అలానే ఉంటే ఆయన చరిత్ర ఇన్ని మలుపులు తిరిగి ఉండేది కాదు. ఆయన తర్వాత కాలంలో విజయనగరంలో ఒక సర్కస్ కంపెనీ స్థాపించారు. ఇది ఆయన పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.

20 ఏళ్ల వయస్సులోనే.

రామ్మూర్తి తన 20 ఏళ్ల వయసులోనే గుండెల మీద ఒకటిన్నర టన్ను బరువును మోసి చూపించేవారు. సర్కస్‌లో విన్యాసాలు మరింత కఠినమైనవి. ఆయనను ఉక్కు గొలు సులతో బంధించేవారు. ఊపిరితిత్తుల నిండా గాలి పూరించి, ఆ గొలుసులను తెంచేవారు. రెండు కార్లకు గొలుసులు కట్టి, వాటిని తన భుజాలకు తగిలించుకునేవారు. కార్లను వేగంగా నడిపించేవారు. అయినప్పటికీ అవి కదిలేవి కావు. ఏనుగును ఛాతీ మీద ఎక్కించి దాదాపు ఐదు నిమిషాలు నిలిపేవారు. అందుకే ఆయన సర్కస్‌కు విశేషమైన ఆదరణ ఉండేది. ఆసియాలోని జపాన్, చైనా, బర్మా దేశాల్లో కూడా రామ్మూర్తి నాయుడు ప్రదర్శనలు ఇచ్చి భారతదేశ కీర్తిని చాటిచెప్పారు. బర్మాలో ఆయనపై హత్యాయత్నం జరగడంతో విదేశీ ప్రదర్శనలను నిలిపివేసి స్వదేశంలోనే స్థిరపడ్డారు.

బ్రహ్మచారి...

కండల వీరుడు కోడి రామ్మూర్తినాయుడు నిత్య బ్రహ్మచారి. స్వచ్ఛమైన శాకాహారి అయిన ఈయన ఆంజనేయస్వామి భక్తుడు. చిన్నతనంలో వీరఘట్టం సమీపంలోని రాజచెరువు వద్ద వ్యాయామం చేస్తున్న సమయంలో ఓ సాధువు ఆయనను చూసి, రామ్మూర్తిని పిలిచి మంత్రోపదేశం చేశాడట. అప్పటి నుంచి రామ్మూర్తికి దైవచింతన కలిగిందట.




అనేక అవార్డులు...

?అప్పట పూనాలో లోకమాన్య తిలక్ కోరిక మేరకు ప్రదర్శనలిచ్చారు. దీంతో తిలక్ రామ్మూర్తికి మల్లమార్తాండ, మల్లరాజ తిలక్ బిరుదులిచ్చారు. విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వాలని ప్రోత్సహించారు.

?హైదరాబాద్‌లో ఆంధ్రభాషా నిలయం పెద్దలు ఘనసత్కారం చేసి జగదేకవీర బిరుదునిచ్చారు.

?అప్పటి వైస్రాయి లార్డ్ మింటో రామ్మూర్తి ప్రదర్శనలు చూడాలని వచ్చి తనే కారును నడుపుతూ ఆ కారును రామ్మూర్తి ఆపేయడం చూసి ముగ్ధుడైపోయాడు.

?అలహాబాదులో అఖిల భారత కాంగ్రెస్ సభ జరిగింది. రామ్మూర్తి సర్కస్ అక్కడ ప్రదర్శనలిచ్చింది. జాతీయ నాయకులెందరో చూసి అభినందించారు. పండిత మదనమోహన మాలవ్యా ఎంతగానో మెచ్చుకున్నారు.

?లండన్‌లో రాజదంపతులు జార్జిరాజు, రాణి మేరి రామ్మూర్తి ప్రదర్శనలకు అభిమానులైపోయారు. వారే తమ రాజభవనానికి ఆహ్వానించి 'ఇండియన్ హెర్క్యులస్' బిరుదునిచ్చారు.

? స్పెయిన్‌లోని బుల్ ఫైట్‌లో రామ్మూర్తి పంతులు పాల్గొన్న తీరును వేలాది మంది ప్రేక్షకులు మెచ్చుకున్నారు.

?జపాన్, చైనా, బర్మాలలో రామ్మూర్తి ప్రదర్శనలు ఎంతో వైభవంగా సాగాయి.

ఇలా బయటపడింది..

ఓ పుస్తక కథనం ప్రకారం కోడి రామ్మూర్తిలో ప్రతిభాపాటవాలు బయటపడడానికి ఓ సంఘటన దోహదపడింది. అప్పట్లో ఆయన విజయనగరంలో ఉండేటప్పుడు.. అదే నగరానికి చెందిన పేర్ల రామ్మూర్తి శెట్టి ఇంటి ముందట కాలువలో ఓ ఎద్దు పడిపోయింది. ఆ జమిందారు 20 మంది బలవంతులను రప్పించి ఎద్దును బయటకు లాగడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సరిగ్గా అదే సమయానికి అటుగా వస్తున్న రామ్మూర్తిని చూసి జమిందారు హాస్యంగా 'అదిగో మన శాండోగారు వస్తున్నారు. మీరంతా తప్పుకోండి. తను ఒక్కరే ఆ ఎద్దును బయటపడేయగలడు' అని అన్నారు. దీంతో రామ్మూర్తి ఆ ఎద్దు పరిస్థితిని గమనించి దాని వద్దకు వెళ్లి మెడను, వెనుక కాళ్లను, తోకను గట్టిగా పట్టుకుని ఒకే ఉదుటన బయ ట పడేశారు. దీంతో రామ్మూర్తిలోని అసలు బలం అందరికీ ఆ ఘటనతోనే తెలియవచ్చింది.

అల్లరి పిల్లాడి నుంచి చిచ్చర పిడుగులా...

ఇండియన్ హెర్క్యులస్. కలియుగ భీముడు. మ ల్ల మార్తాండ.. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో బిరుదులు గడించి ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన బా హుబలి కోడి రామ్మూర్తి నాయుడు. వీరఘట్టం ఈయన స్వస్థలం అని చెప్పుకోవడం జిల్లా వా సులకు ఎప్పటికీ గర్వకారణం. వీరఘట్టంలోని తెలగవీధికి చెందిన కోడి వెంకన్ననాయుడు, అప్పలకొండ దంపతులకు 1883 నవంబర్ 3న రామ్మూర్తి నాయుడు జన్మించారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన రామ్మూర్తి నాయుడు తండ్రి సంరక్షణలో గారాబంగా పెరిగారు. బా ల్యంలో బడికి వెళ్లకుండా వీరఘట్టానికి సమీపంలో ఉన్న రాజ చెరువు వద్దకు రోజూ వెళ్లి వ్యాయామం చేస్తుండేవారు. దీంతో తండ్రి వెంకన్న బాల్యంలోనే కొడుకుని చదువు కోసం వీరఘట్టం నుంచి విజయనగరంలో ఉన్న అతని త మ్ముడు నారాయణస్వామి(రామ్మూర్తి పిన తండ్రి) ఇంటికి పంపించారు. అక్కడ కూడా రామ్మూర్తికి చదువు అబ్బలేదు. విద్య కంటే వ్యాయామంపైనే ఎక్కు వ ఆసక్తి చూపుతూ పలు మల్లయుద్ధం పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. ఇక రామ్మూర్తికి చదువు వంటపట్టదని గ్రహించిన పిన తండ్రి అతడిని మద్రాసు పంపించి వ్యా యామ కళాశాలలో చేరి?పంచారు. తర్వాత అక్కడే పీడీగా పనిచేశారు.

ఆఖరులో...

ఒకసారి బర్మాలో హత్యాయత్నం జరిగాక ఆయన ప్రదర్శనలకు అడ్డు పడింది. ఎంత డబ్బు గడించారో అంత కంటే గొప్పగా దానాలు కూడా చేశారాయన. ఆఖరి రోజుల్లో ఆయన కాలిపై రాచపుండు వచ్చి కాలే తీసేయాల్సి వచ్చింది. శస్త్ర చికిత్స జరిగినప్పుడు ఎలాటి మత్తుమందును (క్లోరోఫామ్) తీసుకోలేదని ఓ పుస్తకంలో పేర్కొని ఉంది. ప్రాణాయామం చేసి నిబ్బరంగా ఉండిపోయారట. చివరిరోజులు బలంఘర్, పాటా?నలో కలహండి (ఒడిశా) పరగణా ప్రభువు పోషణలో ఉంటూ 1942 జనవరి 16న కన్ను మూశారు

# జక్కంపూడి అయ్యప్పస్వామి మకర జ్యోతి దర్శనం

అమరావతిఆంధ్రా శబరిమల గా పేరు గాంచిన జక్కంపూడి అయప్ప ఆలయంలో విశేష పూజలు జరిగాయి. మకర జ్యోతి దర్శనం కోసం భక్తులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. దేశంలో ఒక్క కేరళ లో శబరిమలై మాత్రమే జ్యోతి దర్శనము జరుగుతుంది. కానీ ఆంధ్రప్రదేశ్ లో ఉమ్మడి కృష్ణా జిల్లా జక్కంపూడి లో వెలసిన అయ్యప్పస్వామి మకర జ్యోతి దర్శనం ను దర్శించడానికి భక్తులు వచ్చారు. వివిధ రకాల పుష్పాల తో అయ్యప్ప కు అభిషేకం నిర్వహించారు. ఆలయానికి అభిముఖంగా ఉన్న కొండ పై నుంచి జ్యోతి దర్శనం జరిగింది. మకర జ్యోతి దర్శనం సమయంలో భక్తుల అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. శబరిమల ఆలయ నమూనా, కొలతలతో జక్కంపూడి అయ్యప్ప ఆలయం నిర్మాణం జరిగింది. మకర జ్యోతి దర్శనం కూడా శబరిమలలో తరహాలో ఇక్కడా కొండ పై నుంచి జ్యోతి దర్శనం ఇక్కడ ప్రత్యేకత

# కేంద్ర మాజీ మంత్రి, అత్యుత్తమ పార్లమెంటేరియన్ ఎస్ జైపాల్ రెడ్డి -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

సూదిని జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడుగులలో 1942, జనవరి 16న జన్మించారు. 18 నెలల వయసులో పోలియో కారణంగా వైకల్యానికి గురయ్యారు. జైపాల్ రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఎ. పట్టా పొందాడు.

ఈయన కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గం నుండి 1969,



1984 మధ్య నాలుగు సార్లు ఆంధ్ర ప్రదేశ్ శాసన సభకు ఎన్నికయ్యాడు. ముందుగా కాంగ్రెసు పార్టీ సభ్యునిగా ఉన్నా, అత్యవసర పరిస్థితి నివ్యతిరేకిస్తూ 1977లో జనతా పార్టీలో చేరాడు. ఆ పార్టీలో 1985 నుండి 1988 వరకు జనరల్ సెక్రటరీగా వ్యవహరించాడు. ఇతను భారత పార్లమెంటుకు మొదటిసారిగా 1984లో మహబూబ్‌నగర్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. తరువాత భారత పార్లమెంటుకు మిర్యాలగూడ లోకసభ నియోజకవర్గం నుండి భారత జాతీయ కాంగ్రెసు అభ్యర్థిగా 1999, 2004లలో రెండు సార్లు ఎన్నికయ్యాడు. రాజ్యసభ సభ్యునిగా 1990, 1996 లలో రెండు సార్లు ఎన్నుకోబడ్డాడు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా 1991-1992 లో ఉన్నాడు. రెండు సార్లు సమాచార, ప్రసార శాఖా మంత్రిగా పనిచేశాడు. జైపాల్ రెడ్డి చట్ట సభలలో చేసిన డిబేట్లు అత్యంత కీలకమైనవిగా ఉంటాయి. ఇతను అత్యుత్తమ పార్లమెంటేరియన్ గా 1998లో ఎన్నుకోబడ్డాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కష్టపడి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ప్రభావితం చేసి సోనియాగాంధీ ని ఒప్పించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేసేలా కృషి చేశారు.

జైపాల్ రెడ్డి హైదరాబాదు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీలో చికిత్స పొందుతూ 2019, జూలై 28 తెల్లవారుజామున గం. 1.28 ని.లకు మరణించారు.

# సంక్రాంతి ముసుగులో కేసినోల హల్ చల్

భీమవరం జనవరి 15, (

భీమవరంలో కేసినో నిర్వహణ చర్చనీయాంశమయింది.

భీమవరంలో విచ్చలవిడిగా కేసినోలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల ముసుగులో భారీ స్థాయిలో జూదం. అసోం, మేఘాలయ తదితర ఈశాన్య రాష్ట్రాల యువతీ, యువకులను తీసుకు వచ్చి కేసినోలను నిర్వహిచారు. పాలక పక్ష పార్టీ నేతలే వీటిని నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపణ.

# పండగకు ఊరెళ్తూ డోర్పై ఇంటి యజమాని నోట్.. నెట్టింట్లో వైరల్!

హైదరాబాద్

మేము సంక్రాంతికి ఊరికి పోతున్నాం.. డబ్బు, నగలూ తీసుకుని వెళ్తున్నాం. మా ఇంటికి రాకండి.- ఇట్లు మీ శ్రేయోభిలాషి" అంటూ పేపర్పై రాసి ఓ ఇంటి యజమాని డోర్కు అంటించి మరీ వెళ్లాడు. ఈ దృశ్యం సోషల్ మీడియా కంట పడగా.. వైరల్గా మారింది.

సహజంగా పండగల వేళ నగరాల నుంచి సొంతూళ్లకు పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్తుంటూరు. ఇదే అదనుగా భావించి దొంగలు రెచ్చిపోతుంటారు. ఇలాంటి దొంగలకే షాక్ ఇస్తూ ఓ ఇంటి యజమాని ఈ రకంగా సందేశం పెట్టడం అందరినీ ఆకర్షించింది. ఈయనెవరో దొంగలకే లెటర్ రాశారంటూ.. పలువురు కామెంట్లు పెడుతున్నారు

# కోడి పందెలలో డిష్యూం.. డిష్యూం

## చేతులెత్తేసిన కొత్తపేట పోలీసులు

విజయవాడవిజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధి పాములు కాలవద్ద కోడి కత్తి క్రీడల ఆర్గనైజర్ పరుచూరి ప్రసాదు బరిలో ఓ వ్యక్తిని అకారణంగా కొడుతున్న దృశ్యం మీడియా కంటపడింది. వాళ్లే కొట్టుకొని చస్తారులే అని కొత్తపేట పోలీసులు చేతులెత్తేశారని ఈ ప్రాంతంలో గుసగుసలు బలంగా వినపడుతున్నాయి.

గత సంవత్సరం కోడిపందాలు నిర్వహించడంతో ఓ వ్యక్తి కొత్తపేట పోలీసులు ఆర్టిఏ యాక్ట్ ద్వారా అడగగా కోడిపందాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని కొత్తపేట పోలీసులు వివరణఇచ్చారు..సోషల్ మాధ్యమాల్లో మరియు పత్రికల్లో వచ్చిన కథనాలను ఆధారాలుగా పెట్టుకుని మరల ఆర్టిఏ యాక్ట్ ద్వారా కోడిపందాలకు అనుమతులు ఏమైనా జారీ చేశారా లేదా అని వివరణ కోరి కొత్తపేట పోలీసులు సమాచారాన్ని బట్టి హైకోర్టును ఆశ్రయించేందుకు కొంతమంది సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# హర్యానా అధ్యక్షుడిపై ఆరోపణలు

ఛండీఘడ్, జనవరి 15, ( హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బడోలీపై ఓ మహిళ సంచలన ఆరోపణ చేసింది. ప్రముఖ గాయకుడు రాకీ మిట్టల్‌తో కలిసి తనపై అఘాయిత్యానికి పాల్పడ్డారని పేర్కొంది. ఈమేరకు హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలీ పోలీస్ స్టేషన్‌లో వారిద్దరిపై అత్యాచారం కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్ ప్రకారం, అత్యాచార ఘటన జూలై 7, 2023న జరగగా, ఎఫ్ఐఆర్ డిసెంబర్ 13, 2024న నమోదైంది.కసౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో, జూలై 3, 2023న ఇద్దరు స్నేహితులతో కలిసి హిమాచల్‌ను సందర్శించడానికి వచ్చినట్లు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఆమె బస చేసిన హోటల్‌లో మోహన్ లాల్ బడోలీ, రాకీ మిట్టల్ కూడా ఉన్నారు. సాయంత్రం 7 గంటలకు బయటకు వెళుతుండగా, మోహన్ లాల్ బడోలీ తనను తాను గొప్ప రాజకీయ నాయకుడిగా, రాకీ మిట్టల్ గొప్ప గాయకుడిగా పేర్కొన్నారు. అనంతరం మహిళలిద్దరినీ తన గదిలోకి తీసుకెళ్లి మద్యం తాగించారని మహిళ ఆరోపించింది.బడోలి, మిట్టల్ కూడా తన అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు తీశారని ఆ మహిళ ఆరోపించింది. అలాగే బయటకు వెళ్లేటప్పుడు నోరు విప్పితే చంపేస్తామని, ఈ ఫోటోలు, వీడియోలు వైరల్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని సదరు మహిళ పేర్కొంది. అనంతరం మద్యం తాగించి అఘాయిత్యానికి పాల్పడ్డట్లు తెలిపింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హిమాచల్ పోలీసులు మోహన్ లాల్ బడోలి, రాకీ మిట్టల్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ విషయంలో మోహన్ లాల్ బడోలీ, రాకీ మిట్టల్ స్పందించలేదు. కాగా, ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.మోహన్ లాల్ బడోలి హర్యానా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో సోనిపట్ జిల్లా రాయ్ స్థానం నుండి బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోహన్ లాల్ బడోలీకి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. అతని నాయకత్వంలో, ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, బీజేపీ మూడవసారి హర్యానాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత మోహన్ లాల్ బడోలీ కూడా చాలా ప్రశంసలు పొందారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మోహన్ లాల్ బడోలీ పదవీకాలం మరోసారి పొడిగిస్తారని భావించారు. కానీ అత్యాచారం వంటి తీవ్రమైన ఆరోపణలతో, అతని ఇమేజ్ ఇప్పుడు పెద్ద దెబ్బ తగిలింది. ఇక, రాకీ మిట్టల్ గాయకుడు, నటుడు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, రాకీ మిట్టల్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ తర్వాత హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో రాకీ మిట్టల్ కాంగ్రెస్ నేతల తరఫున ప్రచారం చేశారు.

# బీబీనగర్ ఎయిమ్స్ లో హెచ్ఎంపీవీ

## వైరల్ డయాగ్నస్టిక్ రీసెర్చ్ లాబోరేటరీ

హైదరాబాద్, జనవరి 15, : కొవిడ్ తర్వాత చైనాలో పుట్టుకొచ్చిన హెచ్ఎంపీవీ కేసులు.. అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. పొరుగునే ఉన్న భారత్ ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. కొవిడ్ సమయంలోని అనుభవాలతో ముందస్తు జాగ్రత్తగా వైద్యారోగ్య శాఖ అనేక ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా.. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అనుమానిత హెచ్ఎంపీవీ కేసుల్ని పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది ఇందులో భాగంగా తెలంగాణలోనూ హెచ్ఎంపీవీ పరీక్షలు జరిపేందుకు అవకాశం కల్పించిన కేంద్రం.. యాదాద్రి భువనగిరిలోని బీబీనగర్ ఎయిమ్స్ లో ఈ మేరకు ఏర్పాట్లు చేసింది.రాష్ట్రంలో హెచ్ఎంపీవీ అనుమానిత కేసులను గుర్తిస్తే బీబీనగర్ ఏయిమ్స్ ఆస్పత్రిలోని వైరల్ దయాగ్నస్టిక్ రీసెర్చ్ లాబోరేటరీలో పరీక్షించనున్నారు. కోవిడ్ తో పోలిస్తే హెచ్ఎంపీవీ వైరస్ కేసులు ప్రస్తుతానికి భారత్ లో తక్కువగానే నమోదవుతున్నాయి. అందులోనూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ కేసుల సంఖ్య మరీ తక్కువగా ఉంది. దీంతో.. ఊపిరి పీల్చుకుంటున్న రాష్ట్ర వైద్యాధికారులు.. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ప్రయోగశాల ఏర్పాటు కోసం కేంద్రాన్ని అభ్యర్థించారు. కాగా.. ఈ ప్రయోగశాలలో ఇప్పటి వరకు పది నమూనాలను పరీక్షించగా అన్ని నెగెటివ్ వచ్చినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి ఇటీవల దేశవ్యాప్తంగా అక్కడక్కడా నమోదవుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో కేసులు లేకపోవడం ఉపశమనం కలిగించే అంశమని అంటున్నారుహెచ్ఎంపీవీ పరీక్షల కోసం భారత వైద్య పరిశోధన మండలి ? ఐసిఎంఆర్ దేశవ్యాప్తంగా 41 వైరాలజీ ప్రయోగశాలలో నమూనాలను పరీక్షించేందుకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అందులో.. తెలంగాణ రాష్ట్రంలో హెచ్ఎంపీవీ అనుమానిత కేసులను




బీబీనగర్ ఎయిమ్స్ కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర వైద్యారోగ్య సూచించింది. వీఆర్డీఎల్ మోడల్ అధికారిగా డాక్టర్ రాహుల్ నారంగ నియమితులయ్యారు.జలుబు, దగ్గు, తుమ్ములు, గొంతు నొప్పి ఉన్న వారందరికీ హెచ్ఎంపీవీ వైద్య పరీక్షలు చేయటం వీలయ్యే పని కాదని అధికారులు అంటున్నారు. అందుకోసమే ఇన్‌ఫ్లూయంజా, ఆర్ఎస్‌వీ(రెస్పిరేటరీ సింక్రిటియల్ వైరస్), సార్స్ కోవ్-2 పరీక్షల్లో నెగెటివ్ వస్తేనే హెచ్ఎంపీవీ పరీక్ష నిర్వహించనున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అనుమానాలు ఉన్న నమూనాలను ఎయిమ్స్ తీసుకువచ్చి ఇక్కడ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో పాజిటివ్ వస్తే ఉన్నతాధికారులకు నివేదించి, బాధ్యతలకు వైద్య సహాయం అందించనున్నారు. ఈ మేరకు బీబీనగర్ ఎయిమ్స్ లో పరీక్షా కిట్లు, ఇతర సామాగ్రిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

# కుంభమేళలో పోటెత్తిన భక్తజనం

అలహాబాద్, జనవరి 15, ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు మూడో రోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది.ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే జనవరి 14నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది.అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు.మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహాభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది.మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద



సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మఠాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు.శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు.35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు. ఇది కాకుండా, జునా అఘోరా, ఆవాహన్ అఘోరా, పంచాగ్ని అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు కూడా అమృత్‌లో స్నానం చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి నేతృత్వంలోని కిన్నార్ అఘోరా సభ్యులు కూడా జునా అఘోరాతో పాటు పవిత్ర స్నానమాచరించారు. పెద్ద రథంలో ఘాట్ వద్దకు చేరుకున్న నాగ సాధువుల బృందం అనుసరించింది.నాగ సాధువులు ఈటెలు, త్రిశూలాలను ధరించి, వారి శరీరాలపై బూడిద పూసుకుని, కొన్ని గుర్రాలతో ఊరేగింపుగా రాజ స్నానానికి బయలుదేరారు. జుట్టులో పువ్వులు, మెడలో దండ, చేతిలో త్రిశూలంతో మహాకుంభానికి ఆధ్యాత్మిక వైభవాన్ని జోడించింది

# ఖాళీగా భాగ్యనగరం...

హైదరాబాద్, జనవరి 15, ( హైదరాబాద్ వీధులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. విద్య, ఉద్యోగ, వ్యాపారం కోసం భాగ్యనగరంలో నివాసం ఉంటున్నవారు సంక్రాంతి సందర్భాగా సొంతూళ్లకు వెళ్లారు. నిత్యం రద్దీగా ఉండే భాగ్యనగరం రోడ్లన్నీ ఖాళీగా మారాయి. సిటీ అంతా నిర్మానుష్యంగా మారింది. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి.హైదరాబాద్ వాసులు సొంతూళ్లు బాట పట్టారు. దీంతో నగరం నిర్మా నుష్యంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తెలియనవి కాదు. సంక్రాంతి పండుగ, వరుస సెలవుల నేపథ్యంలో ప్రజలంతా తమ సొంతూళ్ల బాట పట్టారు. ఫలితంగా రద్దీగా ఉండే నగరం బోసిపోయింది.

ఒక మోస్తరుగా జనసంచారం కనిపించినా ఆదివారం కావడంతో మిగిలిన వారు కూడా పల్లె బాట పట్టారు. నగరంలో నిత్యం కనిపించే ట్రాఫిక్ కష్టాలు.. ప్రస్తుతం విజయవాడకు వెళ్లే దారిలో టోల్ ప్లాజాల వద్ద కనిపిస్తున్నాయి. హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై సంక్రాంతి వాహనాల రద్దీ కొనసాగుతోంది. పంతంగి, కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. రవాణా అధికారుల అంచనా ప్రకారం.. ఒక్కరోజే 5 లక్షల మంది హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరారు.బస్సులు, ప్రైవేటు బస్సులు, రైళు__, విమానాల ద్వారా దాదాపు 2లక్షల మంది, మరో 2లక్షల మంది తమ సొంత వాహనాలు, క్యాబ్‌ల్లో వెళ్లారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల వద్ద భారీ సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. వరుస సెలవులు రావడంతో ఉద్యోగులు, పిల్లలు అందరూ పండుగ సంబురాలను సొంతూరులో జరుపుకోవడానికి పల్లె బాట పట్టారుతీరిన బస్సులు, కిక్కిరిసిన ప్రయాణికులతో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. ఎంజీబీఎస్, జూబ్లీ బస్‌స్టేషన్లలో అడుగుతీసి అడుగుపెట్టలేని పరిస్థితి కనిపించింది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఇక ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాల్లో పల్లెలకు పోయే ప్రయాణికులతో నగర శివార్లలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి.ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బి, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాలు నెమ్మదించాయి. ట్రాఫిక్ సాఫీగా సాగేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. చౌటుప్పల్, సూర్యాపేట పట్టణంలో ఎన్‌హెచ్-65పై ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది.ఏడాదితో పోల్చితే ఏపీ వైపు వెళ్లే వాహనాల సంఖ్య 30 శాతం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పండుగ సందర్భంగా సికింద్రాబాద్ పరిసరాల నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ 146 సీటీ బస్సులను నడుపుతోంది.

# ఆర్మూర్ లో పోస్టర్ల కలకలం

నిజామాబాద్ జనవరి 15,

అర్మూరు లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వాల్ పోస్టర్ల రూపంలో ఓటర్లు నిలదీసారు. ఆర్మూర్ తో పాటు నందిపేట్, మండల కేంద్రంలో పోస్టర్లు కనిపించాయి. రూపాయికి వైద్యం ఎక్కడ? యువతకు ఉపాధి ఎక్కడ? నియోజకవర్గంలోని ప్రతి నిరుపేదకు ఇల్లు ఎక్కడ? అంటూ నిలదీసారు. రాజకీయ వర్గాల్లో పోస్టర్ల వ్యవహారం చర్చనీయా అంశంగా మారాయి.

# కిడ్నాప్ అయిన యువకుడి మృతి

ఖమ్మం జనవరి 15,

ఖమ్మం రూరల్ రాజీవ్ గృహకల్పలో రెండు రోజుల క్రితం వాయిస్ రికార్డ్ పంపించిన యువకుడు సంజయ్ కుమార్ (22) మృతి చెందాడు. తనికెళ్ల వద్ద సాగర్ కాలువలో విగతజీవిగా సంజయ్ కుమార్ మృతదేహం లభ్యం అయింది. . తన అన్నను ఎక్కించుకొని వచ్చేందుకు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు తనను చంపేస్తున్నారంటూ తన అన్నకు కాల్ చేసి సంజయ్ కుమార్ చెప్పాడు. . అన్న జ్ఞాన సాయి తన తమ్ముడి చివరి మాటలను రికార్డు చేసి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. . గత రెండు రోజులుగా నాలుగు బృందాలుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులకు నిరాశే ఎదురైంది. సంజయ్ కుమార్ ను దుండగులు తీవ్రంగా గాయపరిచి చంపేశారిన కుటుంబ సభ్యులు అంటున్నారు. అయితే ఆటోలో సాయం కోరిన మహిళను ఏం చేశారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంజయ్ కుమార్ మృతి పట్ల తల్లి బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రెండు రోజుల్లో ఓ సాఫ్ట్వేర్ కంపెనీలో సంజయ్ కుమార్ కు ఉద్యోగం రానుండగా తల్లి కోరిక మేరకు పండుగకు ఇంటికి వచ్చిన సంజయ్ కుమార్ అనంత లోకానికి వెళ్ళాడు. సంజయ్ కుమార్ మృతి తో కాలనీ లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సంజయ్ కుమార్ ను అనవసరంగా పొట్టన పెట్టుకున్నారని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

==========================

# కౌశిక్ రెడ్డిని అలా వదిలేశారేంటీ...

కరీంనగర్, జనవరి 15,

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులు తెస్తున్నారు. హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి తొలి సారి ఎన్నికయిన పాడి కౌశిక్ రెడ్డి ఆది నుంచి తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు. వివాదాస్పద కామెంట్స్ చేయడమే కాకుండా దూకుడుగా వ్యవహరిస్తుండటం పార్టీకి ఒకరకంగా మైనస్ అనే చెప్పాలి. పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లోకి వచ్చారు. ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. మొన్నటి ఎన్నికల ప్రచారంలోనే పాడి కౌశిక్ రెడ్డి సంచలనం సృష్టించారు. తనను గెలిపించకుంటే కుటుంబ సభ్యులతో కలసి ఆత్మహత్యలు చేసుకుంటామని నియోజకవర్గ ప్రజలను ఎన్నికల సమయంలో బెదిరించారనే చెప్పాలి చివరకు ఎట్టకేలకు గెలిచినా బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ఆయన ఉత్త ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. అయితే గెలిచిన తర్వాత పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారినా పాడి కౌశిక్ రెడ్డి మాత్రం కారు పార్టీలోనే ప్రయాణిస్తున్నారు. అందరు ఎమ్మెల్యేల తీరు ఒకలా ఉంటే.. పాడి కౌశిక్ రెడ్డి తీరు మరొలా ఉంది. ఆయన ఎక్కడకు వెళ్లినా సమస్యే అవుతుంది. అసెంబ్లీ సమావేశాల్లోనూ పార్టీ తరుపున రెచ్చిపోవడం, స్పీకర్ తో చివాట్లు తినడం మామూలయిపోయింది. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యేలపై పాడి కౌశిక్ రెడ్డి చేసే వ్యాఖ్యలు వారిని వ్యక్తిగతంగా ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో వివాదం తీవ్రమై చివరకు కాంట్రవర్సీకి దారితీస్తుందనే చెప్పాలి. అనేక సార్లు వివాదాలకు కారణమైన పాడి కౌశిక్ రెడ్డిని మాత్రం కారు పార్టీ కంట్రోల్ చేయలేకపోతుందంటున్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కసారి గెలిస్తేనే ఇంత ఫైర్ చూపిస్తుంటే.. ఇక మరోసారి గెలిస్తే ఎలా ఉంటుందోనని ప్రజాప్రతినిధులు సయితం ముక్కున వేలేసుకుంటున్నారు. సొంత పార్టీ నేతలు కూడా పాడి కౌశిక్ రెడ్డి యాటిట్యూడ్ ను తప్పుపడుతున్నారు. కేవలం కేసీఆర్, కేటీఆర్ ల వద్ద మన్ననలను పొందేందుకే అలా వ్యవహరిస్తుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. తాజాగా కరీంనగర్ లోనూ హుజూరాబాద్ ఎమ్మెల్యే సంజయ్ పై ఆయన దూకుడుతో వ్యవహరించిన తీరుపై రాజకీయ నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఇప్పటికైనా కౌశిక్ రెడ్డిని కంట్రోల్ పెట్టకుంటే పార్టీకి నష్టమే తప్ప లాభమంటూ ఏమీ ఉండదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# దుర్గం చెరువు 4 నెలల్లో శాశ్వత పరిష్కారం

హైదరాబాద్, జనవరి 15,

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా 4 నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. హైడ్రా కార్యాలయంలో దుర్గం చెరువు పరిసరవాసులతో ఆయన సమావేశమయ్యారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా చూస్తామన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో సంబంధిత ప్రభుత్వ శాఖలతో పాటు.. ఐఐటీ, బిట్స్‌పిలానీ, జేఎన్‌టీయూ వంటి విద్యా సంస్థల ఇంజినీర్లను కూడా భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ ఆర్ ఎస్‌సీ), సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ, హెచ్ ఎండీఏ ఇలా అన్ని శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసి సమస్యకు పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. ఎన్ఆర్ఎస్సీ శాటిలైట్ ఇమేజీలను, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను శాస్త్రీయ పద్ధతుల్లో అధ్యయనం చేసిన తర్వాత తుది నివేదికను రూపొందిస్తామని రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి గతంలో హెచ్ ఎం డీఏ ఇచ్చిన ప్రిలిమనరీ నోటిఫికేషన్‌పై పరిసరప్రాంతాల నివాసితుల అభ్యంతరాలను రంగనాథ్ పరిశీలించారు. ఆ తర్వాత నివాసితుల వాదనలను రికార్డు చేశారుఈ కార్యక్రమంలో మొత్తం 6 కాలనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వారి వద్ద ఉన్న సమాచారాన్ని లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్ గా ఉన్న రంగనాథ్ కు అందజేశారు. ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి అభ్యంతరాలను అందజేశారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించి 25 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరారు. 25 ఏళ్ల కాలంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఏనాడూ తమ వాదనలు ఇలా బహిరంగంగా వినలేదని చెప్పుకొచ్చారు. తమను హైడ్రా ప్రధాన కార్యాలయానికి పిలిపించి ఎఫ్‌టీఎల్ అంశంలో తమ అభ్యంతరాలను విని పరిష్కార మార్గాలు కనుక్కొంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కాలంలో ఎఫ్‌టీఎల్ పైన ఒక్కో విభాగం ఒక్కో లెక్క చెబుతోంది. మిగతా చోట్ల చెరువులు మాయం అయితే.. ఇక్కడ ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పెరుగుతూ వస్తోంది. వాస్తవానికి 65.12 ఎకరాలు కాగా.. ఇప్పుడు ఒక్కో శాఖ ఒక్కో లెక్క చెబుతోంది. సామాజిక మాధ్యమాలు, కొన్ని మీడియా సంస్థలు తమను కబ్జాదారులుగా చూపెడుతున్నార?" అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఖాళీగా ఉన్న స్థలాల్లో ఇల్లు కట్టుకోలేకపోతున్నామని? అలాగే అవసరాలకు తమ ఇంటిని అమ్మలేకపోతున్నామని పలువురు ఫిర్యాదు చేశారు. "2000 సంవత్సరంలో భారీ వర్షాలకు చెరువు నిండి.. చుట్టు పరిసర ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది. దానిని పరిగణలోకి తీసుకునే ఎఫ్‌టీఎల్ అంటున్నార?. అప్పటి నుంచి వివాదం నెలకొంది. ఎఫ్‌టీఎల్ నిర్ధారించినప్పుడు తమ వాదనలను పరిగణలోకి తీసుకోవాలి" అని కాలనీ వాసులు కోరారు. అందరి వాదనలను పరిగణనలోకి తీసుకుంటామని రంగనాథ్ స్పష్టం చేశారు. శాస్త్రీయ పద్ధతులు పాటించి ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారిస్తామన్నారు. లేక్ మేమోయిస్, గ్రామ రికార్డులు సర్వే నంబర్ల ఆధారంగా ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# 150 శాతం పెరిగిన విమానయానం

అలహాబాద్, జనవరి15, ( ప్రయాగ్‌రాజ్ ఇప్పుడు ప్రత్యక్ష.. వన్-హాప్ విమానాల ద్వారా 20కి పైగా గమ్యస్థానాలకు కనెక్ట్ చేశారు. గత కుంభ్ సమయంలో కేవలం ఒక (ఢిల్లీ)తో పోలిస్తే, ఈ సంవత్సరం మేళాకు యాత్రికులు, ఇతర పర్యాటకులను చేర్చడంలో విమానయానం కీలక పాత్ర పోషిస్తోందని ఈక్సిగో గ్రూప్ సీఈవో అలోకే బాజ్‌పాయ్ చెప్పారు.. ఇక్సిగోలో విమాన బుకింగ్‌లలో నగరం సంవత్సరానికి 162 శాతం పెరుగుదల నమోదు చేయడంలో ఆశ్చర్యం లేదన్నారు. వారణాసి, లక్నో వంటి సమీప విమానాశ్రయాలు బుకింగ్‌లలో వరుసగా 127. 42 శాతం వృద్ధిని సాధించాయి. ఈ మహాకుంభ్ ప్రారంభ ? ముగింపు వారాల్లో ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని మేక్ మై ట్రిప్ సహ వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈవో రాజేష్ మాగో తెలిపారు. ప్రయాగ్‌రాజ్ కోసం శోధనలు సంవత్సరానికి 23 రెట్లు పెరిగినట్లు తెలిపారు. కోవిడ్ పూర్వ స్థాయిల కంటే తక్కువగా ఉన్న సమయంలో మహా కుంభ్ విదేశీ పర్యాటకుల రాకపోకలను పెంచుతుందని భావిస్తున్నారు. ఈ కుంభ్‌లో విదేశీ పర్యాటకుల సంఖ్య మునుపటి వాటి కంటే చాలా ఎక్కువగా ఉందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ టూరిజం శాఖ చేపట్టిన భారీ ప్రచార కార్యక్రమం సత్ఫలితానిస్తుందన్నారు. విమానాలతో పాటు రైళ్లు కూడా మహా కుంభానికి వెళ్లే పర్యాటకులతో రద్దీగా ఉన్నాయి. "ప్రయాగ్‌రాజ్ కోసం రైలు బుకింగ్‌లు సంవత్సరానికి 187 శాతం పెరిగాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, బుకింగ్‌లలో 57 శాతం సోలో ట్రావెలర్లు, 39 శాతం మహిళలు ఉన్నారు. గ్రూప్ బుకింగ్‌లు 43 శాతం ఉన్నాయి," అని ఇక్సిగో ట్రైన్స్,సీఈవో దినేష్ కుమార్ కోథా తెలిపారు. ప్రధాన మెట్రో నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్, చుట్టుపక్కల విమానాశ్రయాలకు వన్-వే విమాన ఛార్జీలు 30 రోజుల ముందుగా బుక్ చేసుకుంటే సగటున రూ. 7,000-10,000 మధ్య ఉంటుంది. అయితే, భోపాల్-ప్రయాగ్‌రాజ్ వంటి కొన్ని రూట్‌లలో అత్యధిక డిమాండ్.. పరిమిత విమాన లభ్యత కారణంగా ఛార్జీలు రూ. 17,000 వన్-వేకి పెరిగాయి. పవిత్ర స్నానం తేదీల కంటే ముందు ప్రయాణానికి ఛార్జీలు కూడా ఎక్కువగా ఉన్నాయి . ఉదాహరణకు, ఈక్సిగో ప్రకారం, ముంబై వంటి కీలకమైన మెట్రోల నుండి జనవరి 27న నాన్-స్టాప్ విమానాలకు వన్-వే రూ. 27,000. ప్లాట్‌ఫారమ్ మహా కుంభ్ కోసం మైక్రోసైట్‌ను కూడా ప్రారంభించింది.. ఇందులో ప్రయాణం, వసతి ఎంపికలు, భద్రతా చిట్కాలు, ఆచారాలు, కార్యకలాపాలు.. తదితర వివరాలు ఉన్నాయి. జైపూర్, బెంగళూరు, నాగ్‌పూర్, కొచ్చి, ముంబై వంటి నగరాల నుండి ప్రయాగ్‌రాజ్‌కి విమాన ఛార్జీలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 3 రెట్లు పెరిగాయని క్లియర్‌ట్రిప్ చీఫ్ బిజినెస్ అండ్ గ్రోత్ ఆఫీసర్ అనుజ్ రాఠీ తెలిపారు. ఢిల్లీ-ప్రయాగ్‌రాజ్, ముంబై-వారణాసి కీలకమైన ఫీడర్ రూట్‌లలో ట్రాఫిక్ పెరుగుతోందని కాక్స్ డ కింగ్స్ ప్రెసిడెంట్ రామలింగం ఎస్ అన్నారు. అహ్మదాబాద్, పూణే వంటి టైర్ 2 నగరాల నుండి ఉత్తరప్రదేశ్‌లోని గమ్యస్థానాలకు అనుసంధానించే విమానాలు కూడా అధిక డిమాండ్ తో ధరలు పెరిగాయి. విమాన ఛార్జీలు మహా కుంభ తేదీలలో 70 శాతం



పెరిగాయి. ఈ మహా కుంభ్ లో 2,000 టెంట్‌లతో కూడిన మినీ సిటీకి బలమైన డిమాండ్ కనిపిస్తోందని, భక్తులు పవిత్ర స్థలంలో దగ్గరగా లీనమయ్యే అనుభూతిని కోరుకుంటున్నారని మాగో చెప్పారు. గుడారాల విషయానికొస్తే, లగ్జరీ నుండి డార్మిటరీ వరకు విస్తృత ఎంపిక ఉంది. ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్లచే నిర్వహించబడే గుడారాలు, ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్) వంటి మతపరమైన సంస్థలు కూడా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముందే.. రోజుకు 1.5 నుండి 2 కోట్ల మంది సందర్శకులు వస్తారని అంచనా వేయడంతో, అనేక రకాల వసతి ఎంపికలను అందుబాటులోకి తెచ్చినట్లు పిట్టీ తెలిపారు. ఒక టెంట్‌కి రాత్రికి 12,500 నుంచి 50,000 రూపాయల వరకు ఖర్చవుతుందని కులకర్ణి సూచించారు. అల్టిమేట్ ట్రావెలింగ్ క్యాంప్ విలాసవంతమైన గుడారాల వంటి ప్రీమియం డిగ్‌లు, ఒక రాత్రికి రూ. 1 లక్ష ధరతో, రాచరికపు స్నానపు రోజులతో సహా కీలక తేదీల కోసం ఇప్పటికే పూర్తిగా బుక్ అయ్యాయి.. ఐఆర్‌సీటీసీ మహాకుంభ్ గ్రామ్, యూపిఎస్‌టీడీసీ టెంట్ కాలనీ వంటి ఇతర ఎంపికలు బేసిక్ నుండి డీలక్స్ వరకు వివిధ రకాల గదులను అందిస్తున్నాయి.. వీటి ధరలు రాత్రికి రూ. 1,500 నుండి రూ. 35,000 వరకు ఉంటాయని పిట్టీ చెప్పారు. ఈ ప్రాంతంలోని లగ్జరీ హోటళ్లు రాత్రికి రూ. 11,000 నుండి రూ. 30,000 వరకు వసూలు చేస్తున్నాయి.. కొన్ని ప్రీమియం సంస్థలు రూ. 40,000 వరకు ఉన్నాయి. ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ప్రయాగ్‌రాజ్ హోటల్ బుకింగ్‌లలో 10 రెట్లు పెరిగింది.. ఇక జనవరి ? ఫిబ్రవరిలో జరిగే మహా కుంభ తేదీల సమయంలో హోటళ్లు ఇప్పటికే 85 శాతానికి పైగా బుక్ అయ్యాయి.. జనవరి 13న ప్రారంభమైన మహా కుంభం ఫిబ్రవరి 26 వరకు కొనసాగుతుంది. ప్రీమియం ? మిడ్-రేంజ్ హోటళ్లు నెలల ముందే పూర్తిగా బుక్ అయ్యాయి. మిగిలిన వసతి గృహాలు కుంభం కాని నెలలతో పోలిస్తే 50-60 శాతం ధరలను పెంచుతున్నాయి. సమీప నగరాలు, వారణాసి, లక్నోలకు డిమాండ్ పెరుగుతోంది. అక్కడ, హోటళ్ల బుకింగ్‌లు 40-50 శాతం పెరిగాయి.. 45 రోజుల్లో సుమారు 40 కోట్ల మంది భక్తులు ప్రయాగ్రాజ్కు వస్తారని ప్రభుత్వ అంచనా వేసింది.. ఈ నేపథ్యంలో పర్యాటక రంగం వృద్ధి మరింత పెరగనుంది.

# వ్యూహాలు... ప్రతి వ్యూహాలు

హైదరాబాద్, జనవరి 15, ( తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆధిపత్య పోరు ఆగడం లేదు. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడినా.. ఆ పార్టీ వ్యూహాల ముందు.. అధికార కాంగ్రెస్ ప్లాన్స్ ఫెయిల్ అవుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును జైలుకు పంపాలన్న రేవంత్‌రెడ్డి ఎత్తులు ఫలించకపోగా, చోటామోటా నాయకులను కూడా జైల్లో పెట్టలేకపోతున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ ఎత్తులు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాల ముందు చిత్తవుతున్నాయి. తెలంగాణను పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. సీఎంగా ఉన్నారు. కానీ, గత పాలకులు చేసిన ఒక్క అవినీతిని కూడా నిరూపించలేకపోతున్నారు. కాళేశ్వరం, విద్యుత్‌కొనుగోళ్ల ఒప్పందాలపై వేసిన కమిషన్ల విచారణ కొనసా?.గుతోంది. ఇక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కొలిక్కి రాలేదు. ఫార్ములా ఈ కార్ రేసులో అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధులు కేటాయించడం వ్యవహారంలో కేసు నమోదు.. ధరణిలో అక్రమాలు, గొర్రెల పంపిణీ పథకం, మిషన్ భగీరథలో అక్రమాలు ఇలా చాలా అంశాలు ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకు ఒక్క అవినీతిని కూడా రేవంత్ సర్కార్ నిరూపించలేకపోయిందిఇదిలా ఉంటే.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా.. బీఆర్ఎస్ నేతలు తామే అధికారంలో ఉన్నట్లు ప్రభుత్వంపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, ఆయన క్యాబినెట్‌లోని 10 మందిని ముప్పు తిప్పలు పెడుతున్నారు. బీఆర్ఎస్ విమర్శలు, ఆరోపణలను మంత్రులు, ఎమ్మెల్యేలు తిప్పికొట్టడంలో విఫలమవుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతల దూకుడు కొనసాగుతోంది. కేటీఆర్, హరీశ్‌రావులకు తోడు.. ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ తోడవడంతో అధికార పార్టీపై విమర్శల దాడి కొనసాగుతోంది. ఇక సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కనీసం సీఎంగా చూడడం లేదు. నోటికి ఎంత వస్తే అంత మాట అనేస్తున్నారు. అయినా ఏమి చేయలేని పరిస్థితిలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. అప్పుడప్పుడు కేసులు పెడుతున్నా.. అరెస్టులు చేస్తున్నా.. అవన్నీ మొక్కుబడిగానే మారుతున్నాయి. బీఆర్ఎస్ నేతలను కంట్రోల్ చేయలేకపోతున్నాయి. లగచర్ల కేసులో పట్నం మహేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన 20 రోజులకే బెయిల్ వచ్చింది. ఇక పాడి కౌశిక్‌రెడ్డిపై ఇప్పటికే పలు కేసులు పెట్టారు. అరెస్టు చేసిన ఒకటి రెండు రోజులకు మించి జైల్లో పెట్టలేకపోతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై అధికారిక కార్యక్రమంలో కొట్టేంత పని చేసినా.. అధికార పార్టీ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంది. మూడు కేసులు పెట్టి అరెస్టు చేసినా.. వెంటనే బెయిల్ వచ్చేసింది. కౌశిక్‌రెడ్డిని ఈసారి ఎలాగైనా జైల్లో పెట్టాలని రేవంత్ సర్కార్ ప్లాన్ చేసింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుల ఎదుటే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యేను కొట్టినంత పనిచేశాడు. అయినా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. మంత్రులు ముగ్గురితో కేసులు పెట్టించినా.. సెలవు రోజు చూసి అరెస్టు చేసినా.. కనీసం ఒక్క రోజు కూడా జైల్లో ఉంచలేకపోయారు. దీంతో అధికార పార్టీలో సమన్వయలోపం.. అధికారులు అధికారులు, పోలీసులు అధికార పార్టీకి సహకరించడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# వేడెక్కిన ఉత్తర తెలంగాణ రాజకీయాలు

అదిలాబాద్, జనవరి 15, (న్యూస్ పల్స్)

ఉత్తర తెలంగాణలో త్వరలో పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసింది. అభ్యర్థుల ఖరారుపై కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించింది. ఉత్తర తెలంగాణలో విజయంపై బీజేపీ ధీమా వ్యక్తం చేస్తుంది. ఉత్తర తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయ హీటెక్కుతుంది. బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తుంది. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా అని మల్లగుల్లాలు పడుతుంది. కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఉమ్మడి నాలుగు జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీల పదవీకాలం మార్చితో ముగుస్తుంది. అయితే మార్చిలోగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ బీఆర్ఎస్ కు సవాల్ విసిరింది. బీజేపీ అభ్యర్థుల ప్రకటనతో కమలనాథులతో పాటు కాంగ్రెస్ బీఆర్ఎస్ లో కదలిక మొదలై ఎన్నికల రాజకీయంపై ఆసక్తికరమైన చర్చ సాగుతుంది. ఉత్తర తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల, టీచర్ ల ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసింది. గత కొంతకాలంగా సుదీర్ఘ కసరత్తు చేస్తూ వచ్చిన బీజేపీ నాయకత్వం ఎట్టకేలకు అభ్యర్థిత్వాలను ప్రకటించింది. కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నేత అంజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అలాగే టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి పెద్దపల్లి జిల్లాకు చెందిన విద్యాసంస్థ అధినేత మల్క కొమురయ్య అభ్యర్థిత్వం ఖరారు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. పండుగ ముందే అభ్యర్థులను ఖరారు చేసి పార్టీ శ్రేణుల్లో జోష్ ను నింపే ప్రయత్నం చేసింది. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో రెండు స్థానాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. ఇక్కడ అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల్లో బీజేపీకి గట్టి పట్టు ఉండటం.. పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటం తమకు కలిసివస్తుందని బీజేపీ భావిస్తున్నది. ఈ క్రమంలోనూ వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. రెడ్డి సామాజికవర్గం నుంచి ఒకరికి... బీసీ సామాజికవర్గం నుంచి మరొకరికి అవకాశం కల్పించడం ద్వారా సమతూకం పాటించేలా బీజేపీ నిర్ణయం తీసుకున్నదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2019 నుంచి రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణలో బీజేపీ పట్టును పెంచుకుంటూ వస్తుంది. కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ లోక్ సభ నియోజకవర్గాల్లో ప్రస్తుతం బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తుంది. బీజేపీ ఎమ్మెల్యే స్థానాలు కూడా అధికంగా ఈ ప్రాంతంలో ఉండటం తమకు అనుకూలమని బీజేపీ అంచనా వేస్తూ అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరించి ప్రకటన చేసిందని తెలుస్తోంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మెదక్ జిల్లా సీనియర్ నేత సి. అంజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మెదక్ జిల్లా రామచంద్రపురం ప్రాంతానికి చెందిన అంజిరెడ్డి వ్యాపారవేత్త, ఉమ్మడి మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షునిగా పని చేశారు. అంజిరెడ్డి సతీమణి శ్రీమతి గోదావరి ప్రస్తుతం బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. అంజిరెడ్డి గత దశాబ్దాలుగా ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. పేదలకు విద్యావకాశాలను పెంపొందించడంతో పాటు గ్రామాల్లో తాగునీటిని అందించడానికి తన ట్రస్ట్ ద్వారా అంజిరెడ్డి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సుపరిచితులైన అంజిరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు తమకు కలిసి వస్తుందనే ఆలోచనతోనే బీజేపీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా నేత రఘునాథరావు, కరీంనగర్ జిల్లా సీనియర్ నేత పొల్సాని సుగుణాకర్ రావు కూడా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే అంజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే విషయంలో పార్టీ నాయకత్వం అన్ని కోణాల్లో ఆలోచన చేసి నిర్ణయం తీసుకున్నదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిత్వం ఖరారులో బీజేపీ నాయకత్వం అనూహ్య నిర్ణయం తీసుకున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దపల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, వ్యాపారవేత్త మల్క కొమురయ్యను ఎంపిక చేయడం వెనుక బీసీ సామాజిక వర్గమే కారణమని చెబుతున్నారు. మల్క కొమరయ్య స్వస్థలం పెద్దపల్లి, విద్యారంగ అభివృద్ధి కోసం తనవంతు కృషిగా పాఠశాలలను స్థాపించారు. నాణ్యమైన విద్యను ప్రోత్సహించడంలో గణనీయమైన కృషి చేశారని పార్టీ భావిస్తోంది. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్ లో విద్యాసంస్థలను స్థాపించారు. ప్రస్తుతం పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ హైదరాబాద్ చైర్మన్ గా ఉన్నారు. అకడమిక్ అడ్మినిస్ట్రేటర్, అధ్యాపకుడిగా గుర్తింపు ఉన్నది. తనకున్న అపారమైన అనుభవంతో తెలంగాణలో విద్యా నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో ఉన్నారు. గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి టికెట్టు ఆశించగా ఈటెల రాజేందర్ కు కేటా మయించడంతో ఆయన విజయం కోసం తనవంతుగా కృషి చేశారు. పార్టీ పెద్దల వద్ద కూడా పరిచయాలు ఉండటం.. విద్యావేత్తగా ముద్రపడి ఉన్న నేపథ్యంలో బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన వారు కూడా. అధిష్టానవర్గం కొమురయ్య అభ్యర్థిత్వానికి సానుకూలంగా స్పందించిందని తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థులను ఎంపిక చేయడంతో టిక్కెట్ ఆశించి భంగపడ్డ కమలనాధులు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. టికెట్ తమకే వస్తుందని కరీంనగర్ చెందిన బీజేపీ సీనియర్ నేత పొల్సాని సుగుణాకర్ రావు, మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ ప్రచారం కూడా సాగించారు. తీరా టైమ్ కు టికెట్ రాకపోవడంతో సుకుణాకర్ రావు పార్టీ పెద్దల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. 45 ఏళ్లుగా బీజేపీ పార్టీలో కొనసాగుతున్న తనకు బహుమానం ఇదేనా అని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. బిజేపి లో ఉండడంతో ప్రాణహాని ఉన్నపటికీ భయపడకుండా వెనుకడు వేయకుండా కార్యకర్తలకు తోడుగా ముందుకెళ్ళానని, పార్టీ ఇచ్చిన ఏ కార్యక్రమానైనా విజయవంతంగా చేపట్టానని తెలిపారు. ఇతర పార్టీల నుంచి అవకాశాలు వచ్చిన సైద్దాంతిక నిబద్ధతతో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇలాంటి సమయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎప్పటినుంచో ప్రయత్నం చేస్తున్నానని పేర్కొన్నారు. తనలాంటి వారిని విస్మరించి, పార్టీ బలోపేతమైన తర్వాత చేరిన వారికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ కేటాయించడం బాధాకరమని సుగుణాకర్ రావు నిర్వేదం వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లోను ఇదే వైఖరి అవలంబించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అదే సంస్కృతిని మళ్లీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సైతం అవలంబించడం దురదృష్టకరమని వాపోయారు. ఈ విధమైన సంస్కృతి పార్టీ శ్రేయస్సు దృష్ట్యా మంచిది కాదని సూచించారు. ఈ విషయంలో అధిష్టానం పునర్ ఆలోచించి తనకు టికెట్ కేటాయించాలని సుగుణాకర్ రావు విజ్ఞప్తి చేశారు. తిరిగి తనకు టికెట్ కేటాయిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి వస్తానని సుగుణాకర్ రావు స్పష్టం చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ముందే ప్రకటించాయి. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికలకు కమలం పార్టీ ముందుగా అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్, బీఆర్ఎస్ కు సవాల్ విసిరింది. కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసే కసరత్తు చేస్తోంది. పట్టభద్రుల అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందరావు, ప్రసన్న హరికృష్ణ టికెట్ ఆశిస్తుండగా సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మరోమారు తమ అభ్యర్థిగా ఖరారు చేసి పార్టీ అధిష్టాన వర్గానికి నివేదించింది. అయితే కాంగ్రెస్ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోవడంతో జీవన్ రెడ్డి పోటీలో ఉంటారా లేదా అన్నది అనుమానమేనని ప్రచారం జరుగుతోందిపరిణామాలతో బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం మరింత ఒత్తిడిలో పడింది. బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, డాక్టర్ బీఎన్.రావు, ట్రస్మా నాయకుడు యాదగిరి శేఖర్ రావు టికెట్ ఆశిస్తు ప్రచారం సాగిస్తున్నారు. బిఆర్ఎస్ అధిష్టానం మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎటువంటి ఆలోచన చేస్తున్నదో ఇటు పార్టీ నేతలకుగాని.. అటు కార్యకర్తలకు గాని అంతుబట్టడం లేదు. అసలు పోటీలో ఉంటామో లేదో కూడా తెలియకపోవడం పార్టీ వర్గాలను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. పార్టీ ముఖ్య నేత కేటీఆర్ కేసుల్లో ఇరుక్కోవడం.. కేసీఆర్ బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించి ప్రచార బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందా అనే దానిపై కూడా ఆ పార్టీలో ఇప్పుడు చర్చ జరుగుతోంది. కేవలం పోటీకి బీఆర్ఎస్ విముఖత ప్రదర్శిస్తే పార్టీ మనుగడ ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతున్నది. పార్టీ క్యాడర్ కూడా ఇటు కాంగ్రెస్.. అటు బీజేపీ వైపు చీలిపోయే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై బీఆర్ఎస్ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

# రైతులను అగ్రభాగాన ఉంచేందుకు కృషి

ఆలేరు రూరల్, జనవరి 15

: రైతులను అన్ని రకాలుగా ప్రోత్సహించి అగ్రభాగాన నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం మండలంలోని బైరాంనగర్‌లో రూ.3.45కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యాం, రూ.20లక్షలతో కొలనుపాక గుండ్లగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, ఆలేరులో రూ.50లక్షలతో మహిళా శక్తి భవనానికి, టంగుటూరు, శారాజీపేటలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. చెక్‌డ్యాంల



నిర్మాణంతో బైరాంనగర్, కొలనుపాక రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మరో 15 రోజుల పాటు గోదావరి జలాలతో మండలంలోని అన్ని గ్రామాల చెరువులు నింపుతామన్నారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, తుమ్మల సహకారంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు. సంక్రాంతిలోగా రుణమాఫీ పూర్తిచేస్తామని, రైతు భరోసాను ఇస్తామన్నారు.

ఆలేరు): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని బీర్ల అయిలయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రూ.50లక్షలతో మహిళాశక్తి భవనం, ఇందిరమ్మ డెమో ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, మార్కెట్ చైర్మన్ చైతన్యారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య, నీలం పద్మ, ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గాదె సోమిరెడ్డి, అశోక్, యుగేంధర్‌రెడ్డి, ఎంఎ.ఎజాజ్, బాబా, అయిలయ్య, తుంగ కుమార్, అశోక్, పచిమట్టల మదార్, నీలం పద్మ, చింతలపని సునీతా శ్రీనివాసరెడ్డి, శమంతరెడ్డి, వెంకటస్వామి, విజయ్‌కుమార్, ఉప్పలయ్య, చింతలపని శ్రీనివాస్, కూళ్ల నర్సింహులు, భాస్కర్, ముదికొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్, సంతోష్, సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉడకని అన్నం..నీళ్ల చారు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి15

యాదగిరిగుట్ట పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలోని హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్‌గౌడ్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కర్రె ప్రవీణ్, గుంటిపల్లి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కాదూరి



అచ్చయ్య డిమాండ్ చేశారు. బుధవారం వారు ప్రిన్సిపాల్ అనుమతితో కళాశాలలోని హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్, వార్డెన్ కుమ్మక్కై విద్యార్థులకు ఉడకని అన్నం, నీళ్లచారుతో భోజనం పెడుతున్నారని అన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థిని, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలతో సతమతం అవుతున్న విద్యార్థుల్లో ఒక విద్యార్థి తమ నాయకుల వద్దకు వచ్చి వారి సమస్యలను వివరించారని తెలిపారు. నెలకు ప్రతి విద్యార్థి నుంచి రూ.2800 వసూలు చేసి ఇలా భోజనం పెట్టడం ఏమిటని వార్డెన్, ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం లేదని పేర్కొన్నారు. హాస్టల్‌ను ఇప్పటికి మూడు సార్లు సందర్శించి అధికారులు దృష్టికి తీసుకవెళ్లినప్పటికీ వారిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కడుపులు కొడుతున్న సంబంధిత కాంట్రాక్టర్, వార్డెన్, సంబంధిత అ?ధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బేజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, గజం సంతోషగౌడ్, మందోజు నరేష్, బోడ బుచ్చిబాబు, ఆలేటి కర్ణ, ఆకుల దేవేందర్ ఉన్నారు.

# 'సాగర్'లో రెండో నెంబర్ టర్బైన సిద్ధం

నాగార్జునసాగర్, జనవరి 15: నల్లగొండ జిల్లా జిల్లా నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత కేంద్రంలోని రెండో నెంబరు టర్బైన మరమ్మతులు పూర్తయ్యాయి. జలవిద్యుత కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, గత ఏడాది రెండో నంబరు టర్బైనలోని రూటర్ స్పైడర్ మరమ్మతులకు లోనైంది. గత ఏడాది ఆగస్టులో సాగర్ ప్రాజెక్టుకు భారీ వరదలు రావడంతో ప్రాజెక్టు వారం రోజుల్లో పూర్తిస్థాయికి చేరుకుంది. నిండా నీళ్లున్నా రెండో నెంబర్ టర్బైన విద్యుదుత్పత్తికి వినియోగించకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనాలు ప్రచురితమయ్యాయి.

# భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

వేములవాడ కల్చరల్, జనవరి 15

: భక్తులకు ఇబ్బందులు కలగకుండా మహాశివరాత్రి జాతరను నిర్వహించాలని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబందిత అధికారులను ఆదేశించారు. పభుత్వ



విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తో కలిసి మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మూడు రోజులు పాటు జరిగే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాలని, నిర్ధేశించిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సన్వయంతో పనిచేయాలన్నారు. రాజన్న సన్నిదికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు నీడ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం పెంపోందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆలయానికి వచ్చే వీఐపీలను ప్రత్యేక లైన్‌లో తీసుకుని వెళ్లాలని అన్నారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట పటిష్ఠ భద్రత వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. గతం కంటే ఎక్కువగా వేములవాడకు 30 శాతం బస్సులను అధికంగా నడపాలని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రూట్‌లో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు.

అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకుని పకడ్బందీగా మహాశివరాత్రి జాతర నిర్వహించేందుకు ముందుకు సాగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబందిత అధికారులను ఆదేశించారు. వేములవాడ ఆలయానికి సమీపంలో అందుబాటులో వున్న ఖాళీ స్థలాలు, పొలాలను రైతులు సంపూర్ణ సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, పట్టణానికి వచ్చే అన్ని ప్రధాన రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని సూచించారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండు, జాగిత్యాల రోడ్డు, పార్కింగ్ దగ్గర అవసరమైన హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నోడల్ అధికారుల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా ఆంక్షలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ప్రసాదం కౌంటర్లను మరిన్ని చోట్ల ఏర్పాటు చేయాలని అన్నారు. గతం కంటే అధికంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. బద్దిపోచమ్మ ఆలయం వద్ద రోడ్డు ఆక్రమణలు కాకుండా డ్రైవ్ నిర్వహించాలని అన్నారు.

మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు భీమాశంకర్ శర్మ వివరించారు. ఫిబ్రవరి 25న రాత్రి 7 గంటలకు ప్రభుత్వం, రాత్రి 7.30 గంటలకు తిరుమల, తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 26 తెల్లవారు జామున 12 గంటల నుంచి 2.30 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం, తెల్లవారుజామున 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులకు దర్శనం ఉంటుందని అన్నారు. ఉదయం 3.30 నుంచి 3.40 గంటల వరకు మంగళవాయిద్యాల ప్రదర్శన, ఉదయం 3.40 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాత సేవ, ఆలయ శుద్ధి, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం ఉంటుందని తెలిపారు. మహాశివరాత్రి ఫిబ్రవరి 26వ తేదిన సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భావకాలం నందు శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావే?శంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఈవో వినోద్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతీ ఎకరాకు నీరందిస్తాం

భువనగిరి రూరల్, జనవరి 15

ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపోచమ్మ నుంచి భువనగిరి మండలంలోని ప లు చెరువులను



నింపేందుకు కాళేశ్వరం ఫీడర్ ఛానల్ కాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. గత పాలకుల హయాంలో రైతులు పదేళ్లపాటు నష్టపోయారని అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేసి 5కిలోమీటర్లు అసంపూర్తిగా నిలిచిన కాల్వను 10రోజుల్లో పూర్తిచేశారన్నారు. అదేవిధంగా వడపర్తి నుంచి అనంతారం, తాజ్‌పూర్, హన్మాపురం, భువనగిరి చెరువులతో పాటు బీబీనగర్ పెద్దచెరువును కూడా ఈ నీటితో నింపుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, ము నిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ ఎండి.అవైసచిస్తీ, కనుకుంట్ల రేఖ బాబురావు, నాయకులు పక్కీరు కొండల్‌రెడ్డి, పాశం శివానంద్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, తుమ్మే టి వెంకటేశం, చిక్కుల వెంకటేశ్, ఎల్లారెడ్డి, నా నం కృష్ణ, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాని కి కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ అధ్యక్షతన జరిగిన 47వ వార్షిక మహాసభలో ఆయన మాట్లాడారు. గత పాలకులు చేనేతరంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టగానే త్రిఫ్ట్ స్కీం కింద రూ.270కోట్లు మంజూరు చేశారన్నా రు. దీంతో పోచంపల్లి నేతన్నలకు రూ.30కోట్ల మేర లబ్ధి జరిగిందన్నారు. పోచంపల్లిని పర్యాటకులు సందర్శించేలా టూరిజంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయిస్తానని, మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నా రు. జలాల్‌పూర్ చెరువుకట్ట వద్ద ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యల నిమిత్తం రూ.20లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు తడక వెంకటేష్, కర్నాటి ధనుంజయ, బడుగు దానయ్య, తడక కర్నాటి బాలరాజు, ముస్కూరి నర్సింహతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకత కోసం

భువనగిరి టౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ కవళికల గుర్తింపు) ద్వారా లబ్ధిదారుల గుర్తింపునకు దశలవారీగా అడుగులుపడుతున్నాయి. ఇప్పటికే పోషణ్ అభియాన్ ట్రాకర్ అమలవుతుండగా, ఇందులో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతల ఫొటో తీయడం చేస్తున్నారు. అయితే టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్) తీసుకెళ్తున్న వారికి మాత్రం ఈ విధానం లేదు. ఈ నేపథ్యంలో టీహెచ్‌ఆర్ లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం దశలవారీగా అందరికీ దీన్ని వర్తింపజేయనున్నారు.

గర్భిణులు, బాలింతలు, పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్ఠికాహారం పంపిణీతో పాటు ప్రీస్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. లబ్ధిదారులందరికీ మెనూ ప్రకారం ప్రతి రోజూ ఇక్కడ ఆహార పదార్థాలు అందిస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసంతో పాటు ఆటపాటలతో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, మూడేళ్లు పైబడిన పిల్ల లు ప్రతీ రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుండగా, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్) విధానంలో అంగన్‌వాడీ టీచర్లు ఆహార పదార్థాలు ఇంటికి ఇస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ, పౌష్ఠికాహారం పంపిణీలో నిర్లక్ష్యంతో పాటు అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం నుంచి ప్రతీ రోజూ ఆయా కేంద్రాలకు హాజరైన పిల్లలు, ఆహార పదార్థాలను తినేందుకు వచ్చే బాలింతలు, గర్భిణుల ఫొటోలను సెల్ ఫోన్ ద్వారా పోషన్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో క్యాప్చర్ చేస్తున్నారు.అయితే టీహెచ్‌ఆర్ లబ్ధిదారులకుమాత్రం క్యాప్చ ర్ విధానం లేదు. అంతేగాక పిల్లల్లో శారీరక ఎదుగుదల లోపిస్తున్నట్టు ఇటీవలి రికార్డులు, సర్వేలు పేర్కొనడంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని అమల్లో కి తెచ్చింది. ఈమేరకు తొలి దశలో టీహెచ్‌ఆర్ లబ్ధిదారుల జాబితాకు వారి ఫొటోలను ఎ లక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ–కేవైసీ) విధానంలో జత చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఈ–కేవైసీ నమోదు ప్రారంభమైంది.

ఈ–కేవైసీతో ...

పోషన్ అభియాణ్ ట్రాకర్‌లో అదనపు ఆప్షన్‌గా ప్రవేశపెట్టిన ఈ–కేవైసీతో లబ్ధిదారులకు సక్రమంగా పౌష్ఠికాహారం అంది వారి ఆరోగ్యానికి దోహదపడడంతో పాటు అవకతవకలకు అడ్డుకట్టపడుతుందని అధికారులు భావిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని ఏడు నెలల వయసు నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు, కేంద్రాలకు రాలేని శారీరక పరిస్థితులు ఉన్న గర్భిణులు, బాలింతలకు ప్రతీ 25 రోజులకు ఒకసారి కోడిగుడ్లు, బాలామృతం, ఇతర ఆహార పదార్థాలు ఇంటికి ఇస్తారు. మిగతా లబ్ధిదారులందరూ పని రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి అన్నంతో పాటు గుడ్లు ఇతర ఆహార పదార్థాలను తినాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే అందరి లబ్ధిదారుల ఆధార్ నెంబర్, ఫొటోలు, ఇతర వివరాలను పోషణ అభియాన్ ట్రాకర్‌లో ఫీడ్ చేశారు. తాజాగా, అమలు చేస్తున్న ఈ–కేవైసీలో టీహెచ్‌ఆర్ లబ్ధిదారుల ఫొటోలను అంగన్‌వాడీ టీచర్లు క్యాప్చర్ చేసిన వెంటనే లబ్ధిదారుడి సెల్ ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. ఓటీపీని ధ్రువీకరించగానే ఈ–కేవైసీ నమోదు పూర్తవుతుంది. త్వరలోనే ఈ–కేవైసీ నమోదైన వారికి టీహెచ్‌ఆర్ ఇవ్వనున్నారు. ఈ విధానంతో టీహెచ్‌ఆర్ పంపిణీ పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహనా లోపం

పోషణ్ అభియాన్ ట్రాకర్ ప్రారంభంలోనే అంగన్‌వాడీ టీచర్లందరికీ ప్రభుత్వం స్మార్ట్ ఫోన్, ప్రత్యేక సిమ్ కార్డు అందజేసింది. అంగన్‌వాడీ కేంద్రం సమగ్ర వివరాలను సెల్ ఫోన్‌లోనే నమో దు చేస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ టీచర్లు 14 రికార్డులను రాయాల్సి ఉండే ది. ఇప్పుడు ఆఫ్‌లైన్ పని గణనీయంగా తగ్గి ఆన్‌లైన్ నమోదు పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ–కేవైసీని అమలులోకి తేవడంతో టీహెచ్‌ఆర్ లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్‌ను అంగన్‌వాడీ టీచర్లు ప్రారంభించారు. కానీ, వారికి సూచనలు, సలహాలు మినహా శిక్షణ, అవగాహన కల్పించకపోవడంతో ఈ–కేవైసీ నమోదు ఇబ్బందికరంగా మారుతోంది.అలాగే పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య కూడా ఎదురవుతోంది. కానీ, ఈ–కేవైసీ డాటాపై పర్యవేక్షణ పేరుతో అధికారులు చేస్తున్న ఒత్తిడితో అంగన్‌టీచర్లు సతమతమవుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఈ–కేవైసీ నమోదుపై శిక్షణ ఇవ్వాలని టీచర్లు కోరుతున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ–కేవైసీ నమోదు ప్రారంభమైంది. ఇప్పటికే ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, టీచర్లకు నమోదుపై అవగాహన కల్పించాం. త్వరలోనే టీచర్లందరికీ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తాం. ఈ–కేవైసీతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పారదర్శకంగా ఉంటుంది. లబ్ధిదారులకు సక్రమంగా పౌష్ఠికాహారం అందుతుంది.

# ప్రాంతాలు వేరైనా సంకల్పం ఒక్కటే


డింది) భారతదేశం మొత్తాన్ని సైకిల్‌పై చుట్టి రావాలని యువకులు సంకల్పించారు. ముగ్గురు యువకులు వేర్వేరు చోట్ల వేర్వేరు సమయాల్లో సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టినప్పటికీ అనుహ్యంగా ముగ్గురు కేరళలోని కొచ్చిలో కలిసి చేయి, చేయి కలిపి ఒక్కటిగా యాత్రకు సాగుతున్నారు. భాషలు, ప్రాంతాలు వేరైనా సమైక్యత, సౌభ్రాతృత్వమే తమ అభిమతం అంటూ ఆ యువకులు ముందుకు సాగుతున్నారు. సిక్కిం రాష్ట్రానికి చెందిన మిలానసుబ్బు, నేపాల్ దేశానికి చెందిన డానియెల్, బిహార్ రాష్ట్రానికి చెందిన సురజ్ సుమన బుధవారం ఉదయం సైకిల్‌పై జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ అల్పాహారం కోసం నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో కొద్దిసేపు ఆగారు.

ఇప్పటికే 16 రాష్ట్రాల్లో పర్యటించా

మాది సిక్కిం రాష్ట్రం. సైకిల్‌పై దేశయాత్రను 11 జూలై 2024న పశ్చిమబెంగాల్ రాష్ట్రం సిల్‌గుడి నుంచి బయలుదేరా. సిక్కింలో కొండలు, గుట్టలు ఉండడం వల్ల సరిహద్దులోని సిల్‌గుడి నుంచి యాత్రచేపట్టా. ఇప్పటివరకు సిక్కిం రాష్ట్రం నుంచి దేశంలోని 28 రాష్ట్రాల్లో పర్యటించినవారులేరు. ఆ రికార్డును సొంతం చేసుకునేందుకే సైకిల్‌పై యాత్ర ప్రారంభించా. ప్రస్తుతం సిక్కిం అవాజ్ అనే దినపత్రికలో పనిచేస్తున్నా. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో 900 కిలోమీటర్లు ప్రయాణించి ఛత్తీసఘడ్ మీదుగా ఇక్కడికి వచ్చా. సిక్కిం రాష్ట్రంలో వ్యవసాయమంతా ఆర్గానిక్ పద్ధతిలో చేస్తాం. ప్రభుత్వం కూడా ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తోంది.

సైకిల్‌యాత్ర అంటే నాకు సరదా. ఈ యాత్ర రికార్డు నెలకొల్పేందుకే చేస్తున్నాను. నేపాల్ దేశంలోని పర్నాలి రాష్ట్రంలోని సురకేత నుంచి 2024 సెప్టెంబరు 2న సైకిల్ యాత్ర మొదలుపెట్టా. ఇప్పటివరకు భారతదేశంలోని 12 రాష్ట్రాల్లో 6,400 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నా. ఈరోజు హైదరాబాద్‌కు చేరుకొని విశ్రాంతి తీసుకుంటా.

బిహర్‌లోని సింహరి నుంచి 2024 జూన 13న సైకిల్ యాత్ర



ప్రారంభించా. సేవ్ ఎర్త్, సేవ్ హెల్త్ అనే నినాదంతో సైకిల్‌యాత్ర ద్వారా ప్రచారం చేసేందుకు శ్రీకారం చుట్టా. ప్రకృతిని కాపాడుకోవాలి. 16 రాష్ట్రాల్లో 9వేల కిలోమీటర్లు ప్రయాణించి డిండి మీదుగా హైదరాబాద్‌కు వెళుతున్నా.

## విద్యుత్ కార్మికులకు ఐ ఎన్ టి యు సి అండగా ఉంటుంది : ఐఎన్ టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 15:హుజూర్ నగర్ పట్టణంలో బుధవారం ఐఎన్ టియూసి అనుబంధ సంఘమైన టి జి ఈఈ 327 డివిజన్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ డైరీ ని ఐఎన్ టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ జాతీయ ఐఎన్ టీయుసి అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి చొరవతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన తెలిపారు. టీజీ ఈ ఈ యూనియన్ సంఘ డివిజన్ అధ్యక్షుడు సురేష్, గురవయ్య నాగరాజు, బాబురావు, మట్టపల్లి, నరసింహారావు, రామకృష్ణ, శ్రీమన్ ,రాజు వెంకట్ పాల్గొన్నారు.



## ఉమ్రాయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగిరావాలి: ముఫ్తి మహమ్మద్ గౌసుద్దీన్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 15: హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని మస్జీద్ - ఎ - ఉస్మానియాలో ఉమ్రాకు బయలుదేరుతున్న సుమారు 25 మంది యాత్రికుల బృందానికి ముఫ్తి మహమ్మద్ గౌసుద్దీన్ ఆధ్వర్యంలో ఉమ్రా ట్రైనింగ్ క్లాసులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఫ్తి గౌసుద్దీన్ మాట్లాడుతూ అరబ్బీ భాషలో ఉమ్రా అనగా పవిత్ర కాబాను సందర్శించడమని ఉమ్రా అంటే 15 రోజుల ఇస్లామిక్ తీర్థయాత్ర అని తెలిపారు. ఈ 15 రోజులలో మక్కా మరియు మదీనాలలో ఉన్న పవిత్ర మస్జీద్ లను సందర్శించుకుని ఉమ్రాయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగిరావాలని ఆకాంక్షిస్తూ దువా చేశారు.పవిత్ర దైవ గృహం కాబా వద్ద రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం దువా చేయాలని కోరారు. ఉమ్రా యాత్రకు బయలు దేరుతున్న ఇస్లామిక్ యాత్రికులను పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లింలు,మత పెద్దలు పాల్గొన్నారు.

## తిడుగు గ్రామంలో వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి వేయి రూపాయల నగదు బహుమతి అందజేసిన గోపు ప్రభాకర్,రంగు సురేష్ కుమార్

భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, జనవరి 15 :జనగామ జిల్లా జఫర్ ఘడ్ మండలం తిడుగు గ్రామంలో జరిగిన వాలీబాల్ ఆటల పోటీలో గెలుపొందిన వారికి వేయి రూపాయల నగదు బహుమతిని గొప్ప ప్రభాకర్,రంగు సురేష్ కుమార్ అందజేశారు.క్రీడాస్ఫూర్తితో మొదటి బహుమతీ గెలిచినా పిన్నింటి సంతోష్ అండ్ కదరి నరేష్ టీం సభ్యులు ఈ బహుమతిని మన పాఠశాల వాలీబాల్ టీం క్రీడాకారులకు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం గా నిర్వర్తించిన పాఠశాల పిఈటీ గోపు నరేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తీగల నాగరాజు,రంగు రవి, బండి శ్రీకాంత్,చేరిపెల్లి సుధాకర్,కలకోటి ప్రభాకర్, రఘు,శ్యామ్,రాకేష్,పవన్,మణి,క్రీడాకారులు,గ్రామ యువకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ సైదారావ్.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 15: నిర్మల్ జిల్లా ఖానాపూర్ సీఐ సైదారావ్ ఉట్నూర్ లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీస్ అధికారులు అన్ని విధాల ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్ట ప్రకారం వారికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉత్తమ్, తదితరులు ఉన్నారు.

## గ్రామసభలు జవాబుదారీతనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)జనవరి15:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేసేందుకుగాను నిర్వహించే గ్రామ సభలు జవాబుదారీతనంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అధికారులను



ఆదేశించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో మండల్ స్థాయి ఆఫీసర్స్ ( పంచాయతీ సెక్రెటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్ తో నిర్వహించిన అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం, గ్రామస్థాయి బృందాలు మరియు క్లస్టర్ స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించే గ్రామసభలు ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై నిర్దేశించిన భూములను, మైనింగ్ భూములను వివరాలు ఖచ్చితంగా సేకరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల వివరాలు సూచించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి సేకరించిన వివరాలను గ్రామపంచాయతీ నోటీసు బోర్డుపై వివరాలు ఉంచి అభ్యంతరాలను స్వీకరించాలని, సేకరించిన వివరాలను మండల స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. లేఅవుట్ మినహా, పడావున్న భూములను కూడా రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆదాయ వివరాలను సేకరించి అర్హులైన రేషన్ కార్డుల జాబితాలు లబ్ధిదారులు మధ్య దళారులను ఆశ్రయించకుండా సరియైన రీతిలో అర్హులైన వారి జాబితాలు గ్రామ సభలో ప్రజలకు నివేదించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలకు ముందే ఒకరోజు ప్రజలను వచ్చి అభ్యంతరాలను సేకరించి, ఉన్నతాధికారుల సలహా మేరకు తుది జాబితాను తయారుచేసి గ్రామ సభలలో జాబితాను ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామసభలలో స్థానిక లబ్ధిదారులతోపాటు గ్రామస్థాయి ఇందిరమ్మ కమిటీలను కూడా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు.పెండింగ్ సర్వేలు ఉన్న యెడల రేపటి లోగా పూర్తి చేయాలని సేకరించిన డేటాను పూర్తిస్థాయిలో భద్రంగా ఉంచి కంప్యూటర్ రీజన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయి కమిటీలు, సబ్ కమిటీలు వారికి నిర్దేశించిన విధంగా పూర్తిస్థాయిలో సమర్ధవంతంగా పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవో కె.నారాయణ, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏవో శ్రీనివాస్, ఎం పి ఓ విమల , గ్రామపంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ అధికారులు ఏఈఓ లు, ఏఈవోలు, ఆర్ ఐ లు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లో సిరులు నిండాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, జనవరి 15(భారత శక్తి ) : ప్రతి గుమ్మంలో సంక్రాంతి లక్ష్మీ కొలువై.. ప్రతి కుటుంబంలో సంతోషాల సిరులను నింపి.. భోగభాగ్యాలను ప్రసాదించాలని.. జిల్లా కలెక్టర్ డి.. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు.మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో భాగంగా మకర సంక్రాంతి సందర్బంగా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కుటుంబ సభ్యులతో కలిసి మకర సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. హరిదాసుల సందళ్ళతో బంగ్లాలోకి వచ్చిన గంగిరెద్దుకు.. జిల్లా కలెక్టర్ దంపతులు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి.. గంగిరెద్దుల యజమానికి సంక్రాంతి కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "సంక్రాంతి పండుగ మన సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ.

వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చే ఈ పండుగలో గంగిరెద్దులు, వాటి యజమానులు కూడ కీలక పాత్ర పోషిస్తున్నారు. వారిని గౌరవించడం మనందరి బాధ్యత." అని అన్నారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని, కొత్త పంటలు చేతికందిన రైతులు, ఇంటినిండా ధాన్య సిరుల సంపదల మధ్య ఆనందంగా జరుపుకునే పండుగే ఈ సంక్రాంతి అన్నారు. సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చి, అల్లుళ్ళు, బంధుమిత్రులతో సరదాగా చేసుకునే పండుగే సంక్రాంతి అన్నారు. ఈ ఏడాది ప్రకృతి అన్నివిధాలా కరుణించి.. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. సిరుల పంటలు పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్ల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీల నిర్వహణ

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 15:హుజూర్ నగర్ పట్టణంలోని సీతారాం నగర్ 25 వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి- చంద్రశేఖర్ లచే ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించగా ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా హుజూర్ నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతిసంపత్ రెడ్డి హాజరై గెలుపొందిన మహిళా మణులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున దాదాపు 100 మందికి పైగా మహిళలు ముందుకు వచ్చి ముగ్గుల పోటీలో పాల్గొన్నందుకు వారికి అభినందనలు తెలియజేస్తూ, పల్లెల్లో కనపడే పండగ వాతావరణం ముగ్గులతో ప్రతిబింబించే విధంగా తీర్చిదిద్దారని,రకరకాల రంగులతో సీతారాం నగర్ నిండిపోయిందని,పోటీ లు నిర్వహించిన సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్ లను కమిటీ సభ్యులనూ అభినందించారు. సంక్రాంతి ముగ్గుల పోటీల జడ్జ్ మెంట్ ఎస్వీ చారిటబుల్ ట్రస్ట్ చైర్పర్సన్ కోతి సంపత్ శరణీరెడ్డి, 18 వ వార్డు కౌన్సిలర్ కుంట ఉపేంద్ర సైదులు వ్యవహరించారు మొదటి బహుమతి - పల్లె శిల్ప (బీరువా), రెండవ బహుమతి - పండగ అనూష (డ్రెస్సింగ్ టేబుల్),మూడవ బహుమతి- నలమద కృష్ణవేణి (గ్రైండర్), నాలుగో బహుమతి శ్రీలత (గ్యాస్ స్టవ్), ఐదవ బహుమతి ఉషారాణి (మిక్సీ), ఆరో బహుమతి శీలం శిరీష (మిక్సీ), ఏడవ బహుమతి పి జ్యోతి (రైస్ కుక్కర్), స్పెషల్ ప్రైజు లు సిరం శెట్టి నాగమణి, నోముల స్వప్న లింగనబోయిన సుధాలకు ప్రెషర్ కుక్కర్లు దక్కించుకున్నారు. పోటీలో



పాల్గొన్న వందమందికి పైగా మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందరికీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చలకూరి బాబు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రామారావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు జక్కుల మల్లయ్య, కౌన్సిలర్లు కారంగుల విజయ వెంకటేశ్వర్లు, కుంట ఉపేంద్ర సైదులు, జక్కుల వీరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నందిగామ శ్రీను, వల్లపు దాస్ కృష్ణ గౌడ్, సైదా మేస్త్రి అబ్దుల్ రజాక్ బాబా, ఆవుల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు దగ్గుపాటి బాబురావు ,రెడపంగు రాము, కస్తాల సైదులు, కస్తాల రవీందర్, పగిడి నాగేంద్రబాబు,ముగ్గుల పోటీ నిర్వాహక కమిటీ సభ్యులు దగ్గుబాటి రమేష్ ,పిల్లి శివ, పట్టేటి శ్రీకాంత్, గొట్టేముక్కల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పొన్నారం గ్రామంలో ముగ్గుల పోటీలు. విజేతలకు బహుమతలు అందజేసిన రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్.



మందమర్రి రూరల్ , జనవరి 15,(భారత శక్తి ):సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామంలో దొండ సంపత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో 52 మంది ఆడపడుచులు పాల్గొనడం జరిగిందనీ నిర్వాహకులు దొండ సంపత్ తెలిపారు. ఈ ముగ్గుల పోటీల లో మొదటి బహుమతి ప్రవల్లిక, రెండవ బహుమతి రజీత, మూడవ బహుమతి అంజలి విజేతలుగా నిలిచారు. విజేతలుకు ఎన్ఐ రాజశేఖర్ బహుమతులు అందజేశారు.

## ముంగిట్లో మహా ముగ్గు దర్శనం... చూసేందుకు రెండు కళ్ళు చాలని వైనం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 15 :సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీ గాయత్రీ నివాసం అపార్ట్మెంట్లో మహా ముగ్గు అందర్నీ ఆకర్షిస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా అపార్ట్మెంట్లోని మహిళలు యువతులు చిన్నారులు కలిసి ఈ మహా ముగ్గును వివిధ రంగులతో వేశారు. తెలుగు వారి సాంప్రదాయబద్ధంగా వేసిన మహా ముగ్గుని చూసేందుకు రెండు కళ్ళు సరిపోవని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకోవడం విశేషం.



## అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేత జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, జనవరి 15,(భారత శక్తి):జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన



అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్ధేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని, నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా త్వరగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోహిత్ గొప్ప ప్లేయరే..
# టెస్టుల్లోకి రావడం కష్టమే: బ్రెట్ లీ



ఆస్ట్రేలియా పర్యటనలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ పేలవ ప్రదర్శనతో నిరాశపరిచాడు. మూడు టెస్టుల్లో కేవలం 31 పరుగులు మాత్రమే చేసిన అతడు.. ఒక్కసారి మాత్రమే రెండంకెల స్కోరు చేయడం గమనార్హం. అతడు టెస్టులకు వీడ్కోలు పలికేస్తాడని అంతా భావించారు. కానీ, తాను ఆ నిర్ణయం తీసుకోవట్లేదని అప్పుడే చెప్పేశాడు. తాజాగా బీసీసీఐ సమీక్ష సమావేశంలోనూ కొంతకాలం సారథిగా తానే ఉంటానని తెలిపినట్లు వార్తలూ వచ్చాయి. వాటిని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కొట్టిపడేశారు. అలాంటి వ్యాఖ్యలేమీ చేయలేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆసీస్ మాజీ పేసర్ బ్రెట్ లీ (%దీతీవ్ ూవవ%) కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ అద్భుతమైన ఆటగాడంటూనే.. టెస్టుల్లో అతడిని చూడటం కష్టమేనని పేర్కొన్నాడు. ప్రస్తుతం రోహిత్ దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.

"ఇప్పుడు భారత క్రికెట్‌లో ఇద్దరిపైనే ప్రధాన చర్చ సాగుతోంది. కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి. ఎవరి టెస్టు కెరీర్ ముగిసిందనేది ఇక్కడి ప్రశ్న. నేను మాత్రం రోహిత్ ఇక టెస్టు క్రికెట్ ఆడటం కష్టమేనని చెబుతా. ఎందుకంటే సుదీర్ఘ ఫార్మాట్‌లో కమ్‌బ్యాక్ రావడం చాలా కష్టం. ఆసీస్‌తో సిరీస్‌లో అతడి ఆటను చూశాక.. ఎవరైనా ఇదే మాట చెబుతారు. పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. విరాట్ కోహ్లి పరిస్థితి ఇందుకు భిన్నమేమీ కాదు. వీరిద్దరిని కట్టడి చేసేందుకు ఆసీస్ పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగింది. అందులో సక్సెస్ అయింది. కనీసం విరాట్ ఒక్క సెంచరీ అయినా చేయగలిగాడు. రోహిత్ మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు. అందుకే, హిట్‌మ్యాన్‌ను మళ్లీ టెస్టుల్లో చూడటం కష్టమేనని గట్టిగా చెప్పగలను.

ఆస్ట్రేలియా పర్యటనలో () రోహిత్ షాట్ సెలక్షన్ కూడా బాగోలేదు. బంతి కోసం కనీసం వేచి చూడకుండా ఆడేందుకు ప్రయత్నించాడు. అందుకే, అతడు అనుకున్న విధంగా పరుగులు చేయలేకపోయాడు. చివరి టెస్టుకు వైదొలగాల్సిన పరిస్థితి ఎదురైంది. రోహిత్ గొప్ప ప్లేయర్ అనడంలో సందేహం లేదు. కానీ, ప్రతి ఒక్కరికీ ముగింపు దశ వస్తుంది. సిడ్నీ టెస్టు నుంచి రోహిత్ వైదొలగడమే నన్ను షాక్‌కు గురి చేసింది. అది సరైన నిర్ణయంగా అనిపించలేదు. కెప్టెన్‌గా బెంచ్‌పై కూర్చోవడం చాలా కష్టంగా ఉంటుంది. కానీ, తన కంటే జట్టే ప్రథమ ప్రాధాన్యంగా భావించి పక్కకు వైదొలగడం మాత్రం అభినందనీయమే'' అని బ్రెట్ లీ వ్యాఖ్యానించాడు.



# ప్రతీక, స్మృతి మంధాన సెంచరీలు..
# భారత వన్డే చరిత్రలో రికార్డు స్కోరు

ˉ: భారత్ - ఐర్లాండ్ మహిళా జట్ల మధ్య జరుగుతోన్న మూడో వన్డే రికార్డులకు వేదికగా మారింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ఇండియా తొలిసారి వన్డేల్లో 400కిపైగా పరుగులు చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (135: 80 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్స్‌లు), మరో ఓపెనర్ ప్రతీకా రావల్ (154: 129 బంతుల్లో 20 ఫోర్లు, ఒక సిక్స్) శతకాలతో చెలరేగారు. వన్‌డౌన్‌లో వచ్చిన రిచా ఘోష్ (59: 10 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా ఆడేసింది. దీంతో టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 435 పరుగులు చేసింది. ఇప్పటి వరకు భారత మహిళా జట్టు అత్యధిక స్కోరు 370/5. ఐర్లాండ్‌పైనే జనవరి 12న చేయడం విశేషం. ఇప్పుడు మరోసారి ఆ రికార్డును అధిగమించింది. ఓవరాల్‌గా మహిళా క్రికెట్ చరిత్రలో ఇది నాలుగో అత్యధిక స్కోరు. ఐర్లాండ్‌పై న్యూజిలాండ్ 2018లో 491/4 స్కోరు చేసింది.

పదో సెంచరీ.. అత్యంత వేగంగా..

తొలి బంతి నుంచే దూకుడుగా ఆడిన స్మృతి మంధాన కెరీర్‌లో పదో సెంచరీని పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో భారత్ తరఫున అత్యంత వేగవంతమైన శతకం బాదిన బ్యాటర్‌గా నిలిచింది. కేవలం 70 బంతుల్లోనే ఈ మార్క్‌ను అందుకొంది. మంధానకిది వరుసగా రెండో సెంచరీ కావడం విశేషం. రెండో వన్డేలోనూ ఆమె శతకం చేసింది. మరోవైపు ప్రతీకా రావల్ తొలి సెంచరీని 100 బంతుల్లో సాధించింది. తొలి వికెట్‌కు మంధాన - ప్రతీకా రావల్ జోడీ 233 పరుగులు రాబట్టారు. మహిళల వన్డే చరిత్రలో ఆరో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యంగా నిలిచింది.

బాదుడే బాదుడు..

స్మృతి మంధాన సెంచరీ చేసిన తర్వాత మరింత దూకుడుగా ఆడింది. మొత్తం 80 బంతుల్లో 135 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరింది. సెంచరీ అనంతరం మరో 10 బంతుల్లోనే 35 పరుగులు రాబట్టింది. ఇక కెరీర్‌లో మొదటి శతకం చేసిన ప్రతీకా రావల్ కూడా ఏమాత్రం తగ్గలేదు. సెంచరీ చేయడానికి ఎక్కువ బంతులు తీసుకున్న ఆమె.. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడేసింది. మరో 27 బంతుల్లోనే ఇంకో అర్ధశతకం చేయడం విశేషం. ఇక రిచా ఘోష్ (%తీఱఎష్ట్ఘ +ష్ట్రశీంష్ట్ర%) కూడా బాదుడే లక్ష్యంగా ఆడింది. ఐర్లాండ్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయారు. ప్రతీకా - రిచా జోడీ కేవలం 12 ఓవర్లలోనే 104 పరుగులను జోడించారు. రిచా ఔటైన తర్వాత.. తేజల్ హసబ్నిస్ (28)తో కలిసి ప్రతీకా మరో యాభై పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. టాప్ -3 బ్యాటర్లు పెవిలియన్‌కు చేరినప్పటికీ.. తేజల్, హర్లీన్ డియోల్ (15) కూడా బ్యాట్‌ను ఝుళిపించడంతో భారత్ స్కోరు బోర్డు 400ం పరుగులు దాటిపోయింది. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా 2.. కెల్లీ, ఫ్రేయా, డెంప్సీ తలో వికెట్ తీశారు.

# ఇండియా బౌలింగ్ కోచ్‌తో
# గంభీర్‌కు విభేదాలు..?



: తాను పట్టుబట్టి మరీ బౌలింగ్ కోచ్‌గా తెచ్చుకొన్న మోర్నీ మోర్కల్‌తో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విభేదాలు పొడసూపినట్లు ప్రచారం జరుగుతోంది. ఫలితంగా బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సమయంలో అతడు జట్టుతో అంటీముట్టనట్లు వ్యవహరించాడట. దీనిపై బీసీసీఐ సీరియస్‌గా స్పందించినట్లు తెలుస్తోంది.

"ఆసీస్ టూర్‌లో ఓ ప్రాక్టీస్ సెషన్‌కు మోర్కల్ ఆలస్యంగా రావడం గంభీర్‌కు నచ్చలేదట. దీంతో అతడిని మైదానంలోనే మందలించాడట. దీంతో నొచ్చుకొన్న అతడు మిగిలిన సిరీస్‌లలో టీమ్‌తో అంటీముట్టనట్లు వ్యవహరించాడు" అని బీసీసీఐ వర్గాలు ఓ ఆంగ్ల పత్రికకు వెల్లడించాయి. జట్టుతో కలిసి పనిచేయడానికి వీలుగా ఈ అంశాన్ని పరిష్కరించుకోవడం వారిద్దరి విషయమని పేర్కొన్నాయి.

మరోవైపు టీమ్ ఇండియా సహాయ సిబ్బంది పనితీరుపై బీసీసీఐ దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. గంభీర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆడిన 10 టెస్టుల్లో ఆరు చోట్ల ఓటమి పాలైంది. దీంతో బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జట్టు ఆటగాళ్ల నుంచి నాయర్ కోచింగ్‌పై మేనేజ్‌మెంట్ అభిప్రాయాలు తీసుకొంటున్నట్లు సమాచారం. "గంభీరే స్వయంగా మంచి బ్యాటర్. ఈ నేపథ్యంలో నాయర్ ఇంకేమైన సృజనాత్మక విధానాలను ప్రవేశపెట్టాడా అని ఆటగాళ్లను బోర్డు అడిగింది. సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోస్‌చేట్‌కు జట్టులో పాత్ర ఏమిటో కూడా తెలుసుకొనే ప్రయత్నం చేస్తోంది. అతడికి అంతర్జాతీయ అనుభవం లేకపోయినా.. ఇంటర్నేషనల్ ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వడం ప్రశ్నార్థకంగా మారింది" అని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

గంభీర్‌కు కపిల్ మద్దతు..

టీమ్ ఇండియా కోచ్‌పై విమర్శలు చెలరేగుతున్న వేళ.. మాజీ ఆల్‌రౌండర్ కపిల్ నుంచి అతడికి మద్దతు లభించింది. "అంచనాలు భారీగా ఉన్నాయి. కోచ్‌లు మైదానంలో ఉండరు. కానీ, కెప్టెన్లు, టీమ్ మైదానంలో ఉంటారు. ఒక కొత్త కోచ్ నూతన ఐడియాలతో బాధ్యతలు చేపట్టాడు. అవి కచ్చితంగా దేశ క్రికెట్‌ను మెరుగైన స్థితికి చేరుస్తాయని నమ్ముతున్నాను. కానీ, అలా జరగకపోతే అందరూ వేలెత్తి చూపిస్తారు.

గంభీర్‌కి కాస్త దూకుడు స్వభావం ఉంది. అతడు రవిశాస్త్రి, రాహుల్ ద్రవిడ్‌కు పూర్తిగా భిన్నమైనవాడు. ప్రతి కోచ్‌కి తన సొంత పనిశైలి ఉంటుంది. దేశ క్రికెట్‌ను మరింత మెరుగుపరుస్తాడని ఆశిద్దాం" అని పేర్కొన్నాడు.



# టీమ్ ఇండియాకు 'ఇంగ్లిష్' పరీక్ష..
# ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే పుంజుకొనేనా..

టీమ్ ఇండియాకు పొట్టి ప్రపంచకప్ గెలిచిన ఆనందం ఏడాది కూడా నిలవలేదు. ఆ టోర్నీ ముగిసిన నాటి నుంచి వరుస ఓటములను చవిచూస్తూ వస్తోంది. డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు అలవోకగా వెళ్లడం ఖాయమనుకొన్న వేళ.. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీసుల ఫలితాలతో జట్టు చతికిలపడింది. దీనికి తోడు డ్రెస్సింగ్ రూమ్ విషయాలూ అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ దశలోనే బజ్‌బాల్‌తో క్రికెట్‌ను సమూలంగా మార్చేస్తామంటూ దూసుకెళ్తున్న ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు వస్తోంది. మరో వారంలో మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

వన్డేలే కీలకం..

తొలుత టీమ్ ఇండియా ఐదు టీ20ల్లో ఇంగ్లండ్ జట్టుతో తలపడనుంది. హారీ బ్రూక్, జోస్ బట్లర్, లివింగ్ స్టోన్, ఫిల్ సాల్ట్ వంటి అనుభవజ్ఞులతో ఆ టీమ్ బలంగా ఉంది. మరోవైపు భారత్‌కు కీలక అస్త్రమైన జస్‌ప్రీత్ బుమ్రా గాయం బారిన పడి విశ్రాంతిలో ఉన్నాడు. దీంతో పొట్టి సిరీస్‌లో భారం మొత్తం మహ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్ పైనే పడనుంది. ఈ సిరీస్‌లో షమీ సత్తా చూపిస్తే ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి బౌలింగ్ విషయంలో భారత్ చింత కొంచెం దూరం కానుంది. బ్యాటింగ్‌లో సూర్య కుమార్, హార్దిక్ మినహా మిగిలిన వారంతా కుర్రాళ్లే. సంజు శాంసన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, రింకూ సింగ్ ఇలా అందరూ తమదైన రోజున మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్నవారే. ఎటొచ్చి.. వన్డేలే భారత్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2023 ప్రపంచకప్ తర్వాత భారత్ సరిగ్గా వన్డేలు ఆడలేదు. గతేడాది శ్రీలంకతో మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. 27 ఏళ్ల తర్వాత లంకకు సిరీస్ కోల్పోయి ఓ చెత్త రికార్డును మూటగట్టుకొంది. మూడు మ్యాచ్‌ల్లో 27 వికెట్లను లంక స్పిన్నర్లు కూల్చారు. ఇప్పుడు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్‌లోని పిచ్‌లపై జరగనుంది. ఆదిల్ రషీద్ వంటి నాణ్యమైన స్పిన్నర్ ఆ జట్టులో ఉన్నాడు. అతడికి అండగా లివింగ్ స్టోన్ వంటి వారు భుజం కాసే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత మ్యాచ్‌లకు వేదికైన యూఏఈ పిచ్‌లు స్పిన్నర్లకు సహకరించే అవకాశాలుండటంతో ఈ సిరీస్ భారత్‌కు వార్మప్‌గా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

విమర్శల జడివానలో తడిసి ముద్దయిన స్టార్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మకు ఈ సిరీస్ కీలకం. ఇందులో రాణించకుండా ఛాంపియన్స్ ట్రోఫీకి వెళ్లి.. అక్కడా విఫలమైతే కెరీర్ కష్టాల్లో పడ్డట్లే. కాకపోతే కొన్ని నెలల క్రితం ఆడిన లంక సిరీస్‌లో రోహిత్ రాణించడం ఒక్కటే ఊరట. ఇక ఇప్పటివరకు కోచ్‌గా ఎలాంటి వండర్లు చూపని గంభీర్‌కు ఈ సిరీస్ అగ్ని పరీక్షే. బుమ్రా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నాటికి కోలుకుంటే షమీతో కలసి పేస్ దళాన్ని నడిపిస్తాడు.

# ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డు గల్లంతు..
# నొవాక్ జకోవిచ్ అరుదైన ఘనత



సెర్బియా ఆటగాడు నొవాక్ జకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడో రౌండ్‌కు చేరుకొన్నాడు. రెండో రౌండ్‌లో పోర్చుగల్ ఆటగాడు జైమీ ఫరియాపై 6-1, 6-7 (4), 6-3, 6-2 తేడాతో జకోవిచ్ విజయం సాధించాడు. ఈక్రమంలో ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అద్భుతమైన ఘనత సాధించాడు. ఇప్పటివరకు టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ పేరిట (%ూజూవఅ జుత్థీ%)) ఉన్న అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రికార్డును జకోవిచ్ బద్దలు కొట్టాడు. ఫెదరర్ 429 ఆడగా.. జకోవిచ్ 430 మ్యాచ్‌లు పూర్తి చేసుకొన్నాడు. ఇప్పటివరకు జకోవిచ్ 24 గ్రాండ్‌స్లామ్‌లను సాధించాడు. ఇందులో 10 ఆస్ట్రేలియన్ ఓపెన్, 3 ఫ్రెంచ్ ఓపెన్, 7 వింబుల్డెన్, 4 యూఎస్ ఓపెన్‌లు ఉన్నాయి.

"టెన్నిస్ ఆడటాన్ని ప్రేమిస్తా. పోటీని మరింత ఆస్వాదిస్తా. ప్రతిసారీ వందశాతం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తా. గత 20 ఏళ్లుగా గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకొనేందుకు కష్టపడ్డా. గెలిచినా.. ఓడినా మనస్ఫూర్తిగా ఆడేందుకు ప్రయత్నించా. గ్రాండ్‌స్లామ్‌లను గెలవడం ఎప్పుడూ అద్భుతంగానే ఉంటుంది.

# పన్ను ఆదాకు... ఇవీ పథకాలు




కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టేశాం. మరికొన్ని రోజులు ఆగితే కొత్త ఆర్థిక సంవత్సరం కూడా ప్రారంభమైపోతుంది. కొత్త ఏడాదిలో పన్ను ఆదా చేసుకునే మార్గాలను చాలా మంది అన్వేషిస్తుంటారు. అప్పటికప్పుడు హడావుడిగా ఏదో ఒక నిర్ణయం తీసుకునే బదులు.. ఆచితూచి సరైన పథకాన్ని ఎంచుకుంటే పన్ను మినహాయింపుతో పాటు బంగారు భవితకు బాటలు వేసుకోవచ్చు. కాబట్టి ఇప్పటి నుంచే ఆ ప్రయత్నాలు ప్రారంభించండి. అందుబాటులో ఉన్న పథకాలేంటో చూసేయండి.

పరిమితికి మించి ఆదాయం ఉన్నప్పుడు వర్తించే శ్లాబుల ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం, 1961 ప్రకారం పన్ను తగ్గించుకునేందుకు కొన్ని మార్గాలూ ఉన్నాయి. కొత్త పన్ను విధానంలో రిటర్నులు దాఖలు చేసే వారికి మినహాయింపులు వర్తించవు కాబట్టి పెద్దగా ఇబ్బంది లేదు. పాత పన్ను విధానంలో ముందుకెళ్లాలనుకునే వారు మాత్రం పన్ను ఆదాకు ముందుగానే ఆలోచన చేయాలి. కాబట్టి అందుబాటులో ఉన్న పథకాల గురించి తెలుసుకోవాల్సిందే. ముఖ్యంగా ఐటీ చట్టంలోని సెక్షన్ 80సి ద్వారా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1,50,000 వరకూ వివిధ పథకాల్లో మదుపు చేయడం ద్వారా పన్ను మొత్తాన్ని తగ్గించుకోవచ్చు. ఈపీఎఫ్, పీపీఎఫ్, ఎస్ఎస్సీ, సుకన్య సమృద్ధి యోజన వంటి ప్రభుత్వ మద్దతు కలిగిన పథకాలతో పాటు.. మార్కెట్‌తో అనుసంధానమైన ఈఎల్ఎస్ఎస్, ఎన్‌పీఎస్, యులిప్స్ వంటి పథకాలూ ఎంచుకోవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన

%ఆడ పిల్లల తల్లిదండ్రులకు కేంద్రం అందిస్తున్న పాపులర్ పథకం సుకన్య సమృద్ధి యోజన ఈ పథకానికి వడ్డీ రేటు ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 2025 జనవరి-మార్చి త్రైమాసికానికి 8.2 శాతంగా వడ్డీ నిర్ణయించారు. 10 ఏళ్లలోపు బాలికల కోసం వారి తల్లిదండ్రులు ఈ పథకంలో ఒక సంవత్సరంలో కనీస మొత్తం రూ.1000, గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఇద్దరు ఆడపిల్లలున్నా ఇద్దరి పేరుమీద వారి ఖాతాలు తెరవొచ్చు. గరిష్ఠంగా రూ.1.50 లక్షలు మాత్రమే చూపించుకోవచ్చు. 21 ఏళ్లు పూర్తయితే ఈ ఖాతా మెచ్యూర్ అవుతుంది. ముందస్తుగా క్లోజ్ చేయాలంటే బాలికకు 18 ఏళ్లు నిండాలి.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

%ప్రభుత్వ మద్దతు కలిగి పన్ను మినహాయింపు అందించే మరో పథకం పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే వారు ఈ పథకాన్ని ఎంచుకోవచ్చు. వడ్డీపై కూడా పన్ను ఉండదు. దీని వడ్డీ రేట్లను కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. జనవరి-మార్చి త్రైమాసికానికి 7.1 శాతంగా నిర్ణయించారు. దీని లాక్-ఇన్ పీరియడ్ 15 ఏళ్లు. పోస్టాఫీసుల్లో గానీ, బ్యాంకుల్లో గానీ ప్రారంభించొచ్చు. బ్యాంకుల్లో అందించే డిపాజిట్లతో పోలిస్తే దీర్ఘకాలంలో ఈ పథకం ద్వారా మంచి ప్రతిఫలం లభిస్తుంది

ఉద్యోగుల భవిష్య నిధి

ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు అందించడంతో పాటు పన్ను ఆదా చేసుకోవడానికి ఈపీఎఫ్ (%జూఖీ%) ఒక మార్గం. ఈ పథకంలో వచ్చే వడ్డీ ఆదాయంపై ఇంతకు ముందు పూర్తి పన్ను మినహాయింపు వర్తించేది. 2021లో దీన్ని సవరించారు. ఉద్యోగులు ఈపీఎఫ్‌కి కాంట్రిబ్యూట్ మొత్తం ఒక ఏడాదిలో రూ.2.50 లక్షల వరకు ఉంటే వడ్డీపై పూర్తి పన్ను మినహాయింపు వర్తిస్తుంది. ఆ పరిమితి దాటితే ఆ మొత్తంపై పన్ను వర్తిస్తుంది. దీన్ని లెక్కించేటప్పుడు ఈపీఎఫ్, వీపీఎఫ్ కాంట్రిబ్యూషన్ రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటారు. భవిష్యత్ కోసం మంచి నిధిని సమకూర్చుకోవాలంటే ఉద్యోగి వాటాతో పాటు వీపీఎఫ్ ద్వారా మరింత మొత్తం ఈపీఎఫ్ ఖాతాకు జమ చేయొచ్చు.

ట్యాక్స్ సేవింగ్ డిపాజిట్లు (

%సురక్షితమైన పథకాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా పన్ను మినహాయింపు పొందేందుకు ఉన్న మార్గం బ్యాంకులు అందించే ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు. వీటి లాక్-ఇన్ పీరియడ్ 5 ఏళ్లు ఉంటుంది. రాబడికి హామీతో పాటు దాదాపు 7 నుంచి 7.25 శాతం వడ్డీ లభిస్తుంది. పన్ను ఆదా చేసుకోవాలనుకునే వారూ వీటిని పరిశీలించవచ్చు. సెక్షన్ 80సి ప్రకారం ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేసినప్పుడు రూ.1,50,000 వరకూ మినహాయింపు లభిస్తుంది. ఈ డిపాజిట్లపై వచ్చిన వడ్డీని మొత్తం ఆదాయంలో కలిపి చూపించాల్సి ఉంటుంది. వర్తించే శ్లాబు ఆధారంగా వడ్డీ చెల్లించాలి. ఈ డిపాజిట్లపై వడ్డీ రేటు బ్యాంకులను బట్టి మారుతూ ఉంటుంది.

ఈఎల్ఎస్ఎస్

స్థిరమైన రాబడిని అందించే పథకాలతో పోలిస్తే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు ) దీర్ఘకాలంలో ఎక్కువ రాబడిని అందిస్తాయి. అదే సమయంలో నష్టభయం కూడా ఉంటుంది. ఈ ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోలో 80 శాతం ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పథకాల్లో పెట్టుబడి పెడతాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలమైన పథకాలివి. రూ.1,50,000 పరిమితికి లోబడి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇవి సాధారణ మ్యూచువల్ ఫండ్ పథకాలను పోలి ఉన్నప్పటికీ.. మదుపును కనీసం మూడేళ్లపాటు కొనసాగించాలనే నిబంధన ఉండటం, పెట్టిన పెట్టుబడికి పన్ను మినహాయింపు లభించడం వీటి ప్రత్యేకం. ఒకేసారి పెట్టుబడి పెట్టేందుకూ, క్రమానుగత విధానంలో మదుపు చేసేందుకూ అవకాశం ఉంది. వచ్చిన రాబడిపైనా పన్ను భారం పెద్దగా ఉండదు.

ఎన్‌పీఎస్

పన్ను ఆదాతో పాటు, పదవీ విరమణ తర్వాతా ఉపయోగపడాలి అనుకున్నప్పుడు జాతీయ పింఛను పథకం మంచి ఎంపిక. ఈ పథకాన్ని పీఎఫ్ఆర్‌డీఏ నియంత్రిస్తుంది. ఈ పథకంలో పెట్టుబడి పెడితే పదవీ విరమణ తర్వాత పింఛను తీసుకునేందుకు వీలవుతుంది. ఎంత పింఛను వస్తుందనేది పెట్టుబడి మొత్తంపై ఆధారపడి ఉంటుంది. ఇది ఒక రకంగా మార్కెట్ ఆధారిత పథకమే. కాబట్టి, రాబడికి కచ్చితమైన హామీ ఉండదు. పదవీ విరమణ వరకూ జమ చేసిన మొత్తంలో నుంచి 60 శాతం వెనక్కి తీసుకోవచ్చు. మిగతా 40 శాతంతో యాన్యుటీ పథకాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇవే పింఛనును చెల్లిస్తాయి. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80సితో పాటు సెక్షన్ 80 సీసీడీ (1బీ) కింద రూ.50వేల వరకూ ప్రత్యేక మినహాయింపు పొందేందుకు వీలుంటుంది.



# వారెన్ బఫెట్ వారసుడిగా హువర్డ్..

## ప్రకటించిన దిగ్గజ ఇన్వెస్టర్

ప్రపంచంలో దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ ఎట్టకేలకు తన బెర్క్‌షైర్ హాత్‌వే కంపెనీకి వారసుడిని ప్రకటించారు. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని ప్రకటించారు. ప్రస్తుతం బెర్క్‌షైర్ వ్యాపార సామ్రాజ్యం విలువ ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.86 లక్షల కోట్లు).

ప్రస్తుతం వారెన్ బఫెట్‌కు 94 ఏళ్లు. తాజాగా ఆయన వాల్‌స్ట్రీట్‌జర్నల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ తన సంపదలో అత్యధిక మొత్తం కొత్తగా ఏర్పాటు చేసిన ఛారిటబుల్ ట్రస్ట్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. తన ముగ్గురు పిల్లలకు అతితక్కువ సంపద మాత్రమే ఇస్తున్నట్లు వెల్లడించారు. కాకపోతే.. వారే 140 బిలియన్ డాలర్ల ట్రస్ట్ దాతృత్వ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు. ఇక కుమారుడు హువర్డ్‌ను వారసుడిగా ఎంపిక చేయడంపై మాట్లాడుతూ.. తన ముగ్గురు బిడ్డలను బలంగా విశ్వసిస్తానని చెప్పారు. హువర్డ్ కూడా నా బిడ్డే కాబట్టి అవకాశం లభించిందన్నారు.

గతంలో హువర్డ్ బెర్క్‌షైర్ బోర్డులో దాదాపు 30 ఏళ్ల పనిచేశారు. తాజాగా వారెన్ నిర్ణయంపై ఆయన స్పందిస్తూ.. "నేను బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు భావిస్తున్నాను. ఎందుకంటే.. నాన్న నన్ను ఇన్నేళ్లపాటు సిద్ధం చేశారు. చాలా ఏళ్లుగా ఆయన నేర్పించిన పాఠాలు, ప్రభావం నాపై ఉన్నాయి" అని పేర్కొన్నారు.

ఎవరీ హువర్డ్..?

హువర్డ్ బఫెట్‌ను హువీ అని కూడా పిలుస్తారు. కాలేజీ విద్య ముగిసిన వెంటనే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వ్యాపార రంగంలోకి వచ్చాడు. బెర్క్‌షైర్‌కు లాస్ ఏంజెలెస్‌లో ఉన్న క్యాండీ తయారీ కంపెనీ బాధ్యతలను ఆయన చూసుకొన్నారు. అక్కడే కీలకమైన వ్యాపార మెలకువలు నేర్చుకొన్నారు.

హువర్డ్ కోసం వారెన్ బఫెట్ ఓ పొలాన్ని కొనుగోలు చేసి ఇచ్చాడు. దానిని వాడుకొన్నందుకు తండ్రికి అద్దె చెల్లించాలన్నది కండీషన్. కాల క్రమంలో భూమిని దున్నకుండా సాగుచేయడాన్ని హువర్డ్ బలంగా నమ్మేవారు. దీంతోపాటు భూమి వినియోగం, సుస్థిర వ్యవసాయ విధానాలపై దృష్టిపెట్టారు.

1989లో హువీ కౌంటీ బోర్డు కమిషనర్లలో ఒకరిగా చేరారు. తర్వాత దానిలో సభ్యుడిగా.. ఆపై ఛైర్మన్‌గా పని చేశారు. 2017-18లో ఆయన ఇల్లినాయ్ మాకాన్ కౌంటీ షరీఫ్‌గా విధులు నిర్వహించారు.

1993 నుంచి ఆయన చాలా ప్రముఖ కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. వీటిల్లో బెర్క్‌షైర్, కోక కోలా ఎంటర్‌ప్రైజెస్, లిండ్సే కార్పొరేషన్, స్లోన్ ఇంప్లిమెంట్, కోన్ ఆగ్రో ఫుడ్స్ వంటి ప్రముఖ సంస్థలున్నాయి. ఎనిమిది పుస్తకాలను కూడా ఆయన రచించారు.

# రెండో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు.. 23,200ఎగువన నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. ప్రధాన షేరల్లో కొనుగోళ్ల మద్దతుతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా అదే బాటలో పయనించాయి. రిలయన్స్, జొమాటో, ఎన్టీపీసీ షేర్లలో కొనుగోళ్ల సూచీలకు కలిసొచ్చాయి. దీంతో సెన్సెక్స్ 224 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 23,200 ఎగువన ముగిసింది.



సెన్సెక్స్ ఉదయం 76,900.14 (క్రితం ముగింపు 76,499.63) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,991.05 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 224 పాయింట్ల లాభంతో 76,724.08 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 23,293.65 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 37 పాయింట్ల లాభంతో 23,213 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ లాభపడ్డాయి. ఎంఅండ్ఎం, బజాజ్‌ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.12 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,707.70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.37 వద్ద స్థిరపడింది.

# రూపాయి పతనానికి చెక్..

# బడ్జెట్‌లో దిగుమతులపై సుంకాల పెంపు

గత కొన్ని నెలలుగా రూపాయి విలువ గణనీయంగా క్షీణిస్తోంది. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో దిగుమతులపై అధిక సుంకాలను విధించే అవకాశాన్ని పరిశీలించవచ్చని యర్నెస్ట్ అండ్ యంగ్ చీఫ్ పాలసీ అడ్వైజర్ ( డీకే శ్రీవాస్తవ తెలిపారు. దిగుమతిపై అధిక సుంకాలతో డాలర్ల డిమాండ్‌ను అరికట్టగలదని ఆయన అన్నారు. తాజాగా పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈయన 15వ ఆర్థికసంఘం సలహామండలి సభ్యుడిగా ఉన్నారు.

అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అకస్మాత్తుగా క్షీణించడంతో బడ్జెట్ రూపొందించే వారికి, ద్రవ్య విధానపరంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%)కి సవాలుగా మారుతుందని శ్రీవాస్తవ అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని అంచనాలు పెరగడంతో.. ప్రపంచంలోని ఆర్థిక వనరులు అక్కడికే తరలిపోతున్నాయని తెలిపారు. రూపాయి మాత్రమే కాదు.. ఇతర యూరోపియన్ కరెన్సీలు కూడా ఇలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. "రానున్న బడ్జెట్‌లో సుంకం రేట్లను పరిశీలించే అవకాశం ఉంది. దిగుమతులపై సుంకాలు విధించడం భారత్ ఆర్థికవ్యవస్థకు ఊతం అందిస్తుంది. ఫలితంగా దిగుమతి సుంకం ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుంది. డాలర్(కు డిమాండ్ తగ్గుతుంది" అని ఆయన అన్నారు.




ఇదిలాఉండగా.. జనవరి 13న అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్క రోజులోనే 66 పాయింట్లు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 86.70 కనిష్ఠ స్థాయికి చేరింది. గత రెండు వారాల్లో దీని విలువ ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పతనమైంది. దీంతో మన కరెన్సీ పతనాన్ని అదుపుచేయడంలో ఈ సుంకాల పెంపు చర్య సాయపడుతుందని శ్రీవాస్తవ అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌తో పాటు దిగుమతి సుంకాలపై కొన్ని సవరణలు ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు.

# సమాచారానికే కాదు.. చాట్‌జీపీటీని ఇలానూ వాడొచ్చు

: చాట్‌జీపీటీ..చాట్‌జీపీటీ.. ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న పేరు ఇదే. కృత్రిమ మేధ సాంకేతికతో ఓపెన్ ఏఐ తీసుకొచ్చిన ఈ చాట్‌బాట్‌పై ఆధారపడటం పెరిగింది. సందేహాలు, సమాచారం కోసం దీన్ని ఎక్కువగా వాడుతుంటారు. చిక్కు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమే కాదు.. సుదీర్ఘ వ్యాసాల సారాంశాన్ని నాలుగు ముక్కల్లో ఈ చాట్‌జీపీటీ చెప్పగలదు. అంతటి సామర్థ్యం కలిగిన చాట్‌జీపీటీని సరిగా వాడుకోవాలే గానీ మీ జీవితాన్ని మరింత సులభతరం చేసుకోవచ్చంటున్నారు టెక్ నిపుణులు.

నైపుణ్యం పెంచుకొనేందుకు

ఏ ప్రశ్న అడిగినా చిటికెలో సమాధానం అందించగలదు చాట్‌జీపీటీ. ఈ చాట్‌బాట్ సాయంతో మీ ప్రశ్నలకు వివరంగా సమాధానాలు రాబట్టొచ్చు. మీ ఆలోచనలు దాని ముందుంచి 'వినూత్నంగా రాసేందుకు సాయపడు' అనేలా ప్రాంప్ట్ ఇవ్వగలిగితే చాలు.. చకచక ఇట్టే స్క్రీన్‌పై మీకు కావాల్సిన సమాచారాన్ని అందిస్తుంది. కొత్త భాషలు నేర్చుకోవాలన్నా, కోడింగ్ సమయంలో ఏదైనా సమస్య ఎదురైనా మీకొక సహాయకుడిగా పనిచేస్తుంది.

మార్నింగ్ మోటివేషన్

ఉదయం లేవగానే ఓ మంచి మోటివేషన్ అందించే కోట్ వినాలనిపిస్తే వెంటనే చాట్‌జీపీటీని అడిగేయండి. మీ కోసం స్వయంగా ఓ ప్రేరణ కలిగించే వాక్యాన్ని చెబుతుంది. ఆదర్శవంతమైన కథలు, వ్యక్తుల జీవితాల గురించి చెబుతుంది. ఎప్పుడూ పాజిటివ్‌గా, లక్ష్యంపై మనసు కేంద్రీకరించేలా మిమ్మల్ని ప్రేరేపిస్తుంది. లక్ష్యం వైపు పయనించే వారు చాట్‌జీపీటీని ఇలా తెలివిగా వాడుకోవచ్చు.

సంక్లిష్టమైన వాటికీ..

మనవేదైనా అంశం గురించి చదువుతున్నప్పుడు అది అర్థం కాకపోతే.. చాట్‌జీపీటీని అడగొచ్చు. అందుకు తగిన ప్రాంప్ట్ ఇస్తే ఆ అంశం గురించి పూర్తిగా వివరిస్తుంది.

# : అజిత్‌పై ప్రముఖుల ప్రశంసలు.. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉందంటూ పోస్ట్‌లు




"అజిత్ కుమార్, ఆయన టీమ్‌కు హృదయపూర్వక అభినందనలు. గొప్ప సంకల్పంతో సవాళ్లను అధిగమించి ప్రపంచ వేదికపై భారతీయ జెండాను ఎగురవేయడం నిజంగా స్ఫూర్తిదాయకం. మీరు, మీ టీమ్ మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా"– పవన్‌కల్యాణ్

'మీరు ఇప్పటివరకు సాధించిన విజయాలతో ఆగిపోకుండా.. మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ ముందుకుసాగుతున్నారు. కష్టపడితే ఏదైనా సాధించొచ్చు అనే దానికి మీరే ప్రత్యక్ష ఉదాహరణ' – సమంత (%ఝుఝుత్ష్మ)

%'తొలి రేసులో అజిత్ కుమార్ రేసింగ్ టీమ్ అసాధారణమైన విజయాన్ని సాధించింది. నా స్నేహితుడు అజిత్ వైవిధ్యమైన అభిరుచుల్లో సత్తా చాటుతున్నారు. ఇవి గర్వకారణమైన క్షణాలు' – కమల్ హాసన్

'అజిత్ సర్.. ఇది అద్భుతమైన విజయం. మీ టీమ్ అందరికీ శుభాకాంక్షలు. మీ విజయాన్ని చూసి నేను థ్రిల్ అయ్యాను. మన దేశానికి, తమిళనాడుకు మరింత కీర్తిని తీసుకురావాలని కోరుకుంటున్నా' – ఉదయనిధి స్టాలిన్

షాలినికి థాంక్స్ చెప్పిన అజిత్..

రేసులో గెలిచిన ఆనందాన్ని అజిత్ తన కుటుంబసభ్యులతో పంచుకున్నారు. తన భార్య షాలినికి థాంక్స్ చెప్పారు. ఆమెను ఆప్యాయంగా హత్తుకున్నారు. 'షాలు నన్ను ఈ రేసులో పాల్గొనడానికి అనుమతించినందుకు నీకు ధన్యవాదాలు' అని చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.


# ఆ అనుభూతి ఎప్పుడూ ప్రత్యేకమే.. ప్రియాంక చోప్రా ఇంట్రెస్టింగ్ కామెంట్స్



బాలీవుడ్ నుండి హాలీవుడ్‌కు చెక్కేసిన అందాల తార ప్రియాంక చోప్రా ( ప్రజెంట్ అక్కడ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. అంతే కాకుండా ఈ బ్యూటీ మహేశ్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న ' లో కూడా హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ దీనిపై అధికారిక ప్రకటన లేదు. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక చోప్రా ఓటీటీ, థియేటర్ల గురించి చెప్పుకొచ్చింది.

'థియేటర్స్ ( ఓటీటీ ప్లాట్ ఫామ్స్ రెండూ కూడా ఆడియన్స్‌ను ఎంతో ఎంటర్‌టైన్ చేస్తున్నాయి. 24 గంటలు ఎన్నో విధాలుగా ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతున్నాయి. అయితే.. బిగ్ స్క్రీన్‌పై సినిమా చూడడం అనేది ఎప్పుడూ ప్రత్యేకమైన ఫీల్‌ను కలిగిస్తుంది. చీకటిగా ఉండే ప్రదేశంలో స్నేహితులు, కుటుంబ సభ్యులతోపాటు తెలియని ఎంతో మంది వ్యక్తుల మధ్యలో కూర్చొని చూస్తే సినిమా అద్భుతమైన అనుభూతినిస్తుంది. అంత పెద్ద స్క్రీన్, డిజిటల్ సౌండ్, థియేటర్ వాతావరణం అవి ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. అందుకే ఓటీటీలు వచ్చినప్పటికీ థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఎప్పటికీ స్పెషల్‌గానే ఉంటుంది. త్రీడీ, ఐమాక్స్‌లలో కొత్త టెక్నాలజీలు వస్తున్నాయి. ఇవి ప్రేక్షకులకు సినిమాపై మరింత ఇంట్రెస్ట్‌ను పెంచేందుకు యూస్ అవుతున్నాయి' అని చెప్పుకొచ్చింది.

# 'నాగబంధం' నుంచి విరాట్ కర్ణ ఫస్ట్ లుక్ రివీల్ చేసిన రానా దగ్గుబాటి.



'పెదకాపు' ఫేమ్ విరాట్ కర్ణ( అభిషేక్ నామా(కాంబోలో వస్తున్న సినిమా 'నాగబంధం' అభిషేక్ పిక్చర్స్, ఎన్ ఐ కే స్టూడియోస్() బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డిఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక నభా నటేష్, ఐశ్వర్య మీనన్( హీరోయిన్లుగా నటిస్తున్న ఆ సినిమాలో 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్( అఘోర పాత్రలో, జగపతి బాబు( జయ ప్రకాష్(, మురళీ శర్మ(%వీబతీఖశ్రీఅ రాష్ట్రుతీఝ%) వంటి ప్రముఖులు కీలక పాత్రలో కనిపించనున్నారు. అయితే రీసెంట్‌గా ఈ మూవీ ప్రీ– లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమాపై హైప్ పెంచిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి విరాట్ కర్ణ ఫస్ట్ లుక్‌ని టాలీవుడ్ స్టార్ హీరో రానా దగ్గుబాటి( చేతుల మీదుగా లాంచ్ చేయించారు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట ఆకట్టుకుంటుంది. ఇక పోస్టర్‌ను గమనించినట్లయితే.. హీరో నీళ్లలో ఉన్న ఓ భారీ మొసలితో పోరాడుతున్నాడు. ఆ మొసలిను అడ్డుకునేందుకు గాలిలో ఎగురుతూ దాని మెడ కింద హీరో మోకాలు పెట్టి గంభీరంగా అరుస్తూ తాడుతో మొసలి ఫేస్‌ని కట్టేదయానికి ట్రై చేస్తున్నాడు. ఫైనల్‌గా విరాట్ కర్ణ ఫస్ట్ లుక్ అదిరిపోయిందనే చెప్పుకోవచ్చు. దీంతో ఈ సినిమాపై మరింత క్యూరియాసిటీ పెరిగిపోయింది.

# నేను ఇంకా బతికి ఉన్నానంటే అదే కారణం: గౌతమ్ వాసుదేవ్ మేనన్



: అవసరమైనప్పుడు ఇండస్ట్రీలో ఎవరూ సహకరించరని ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ అసహనం వ్యక్తంచేశారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన పరిశ్రమలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి పంచుకున్నారు.

''ఈ విషయం గురించి మాట్లాడుతున్నందుకు ఎంతో బాధగా ఉంది. ఇండస్ట్రీలో నాకు సాయం చేయడానికి ఎవరూ లేరు. నమ్మడానికి కష్టంగా ఉన్నా ఇదే నిజం. నేను తీసిన 'ధ్రువ నక్షత్రం' విడుదల విషయంలో సమస్యల గురించి ఎవరూ స్పందించలేదు. కనీసం ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి కూడా ప్రయత్నంచలేదు. ఇండస్ట్రీ ఆ చిత్రాన్ని పట్టించుకోలేదు. ఆ సినిమా గురించి కూడా ఎవరికీ తెలియదు. ధనుష్, లింగుస్వామి మాత్రమే దీని గురించి అడిగారు. విడుదల చేయడానికి ప్రయత్నించారు. కొన్ని స్టూడియోల వారికి ఈ సినిమాను చూపించాను. కానీ, కొన్ని సమస్యలు ఉన్నందున ఎవరూ దాన్ని స్వీకరించలేదు. విడుదల చేయడానికి ముందుకురాలేదు. ప్రేక్షకులు ఇంకా నా సినిమాలను చూడాలని కోరుకుంటున్నారు కాబట్టే నేను బతికి ఉన్నాను" అని అన్నారు.

విక్రమ్ హీరోగా దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ తెరకెక్కించిన చిత్రం 'ధ్రువ నక్షత్రం' . ఏడేళ్ల క్రితమే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆర్థిక సమస్యల కారణంగా విడుదల కాలేదు. దీనిపై ఇప్పటికే పలుమార్లు గౌతమ్ వాసుదేవ్ మేనన్ అసహనం వ్యక్తంచేశారు. ఇది వాయిదా పడడం ఎంతో బాధగా ఉందన్నారు. 'ఇది చాలా హృదయవిదారకంగా ఉంది. చిత్రం వాయిదా విషయంలో ఎన్నో రోజులుగా మనశ్శాంతి లేదు. నా కుటుంబం ఆందోళన చెందుతోంది. నా భార్య నెల రోజులుగా ఈవిషయమే ఆలోచిస్తోంది. నాకు ఎటైనా వెళ్లిపోవాలనిపిస్తోంది. కానీ, పెట్టుబడిదారులకు సమాధానం చెప్పాలని ఉంటున్నా' అని ఓ సందర్భంలో తెలిపారు.





# నటిపై దర్శకుడు త్రినాథరావు అనుచిత వ్యాఖ్యలు..

నటి అన్షు )పై దర్శకుడు త్రినాథరావు నక్కిన ( చేసిన వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. సంబంధిత వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తన కొత్త సినిమా టీజర్ విడుదల వేడుకలో ఆయన మాట్లాడుతూ.. సినిమా కోసం ఎలా సన్నద్ధమవ్వాలని చెప్పానో ఆమె అలా చేసిందంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. మరోవైపు, 'సెకండ్ హీరోయిన్ పేరు..' (మర్చిపోయినట్టుగా) అంటూ తాగడానికి నీళ్లు అడగడం సైతం చర్చనీయాంశమైంది. సందీప్ కిషన్ ( హీరోగా త్రినాథరావు తెరకెక్కిస్తున్న చిత్రం 'మజాకా'. రీతూ వర్మ హీరోయిన్. రావు రమేశ్, 'మన్మథుడు' ఫేమ్ అన్షు కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఫిబ్రవరి 21న సినిమా విడుదల కానుంది.

# గల్లీ బాయ్ 2 సన్నాహాలు?



%ముంబయి మురికివాడల్లో నివసిస్తూ ర్యాప్ సింగర్ కావాలని కలలు కనే మురాద్ అనే అబ్బాయి జీవితం చుట్టూ తిరిగే చిత్రం 'గల్లీ బాయ్'. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్, అలియా భట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జోయా అక్తర్ తెరకెక్కించారు. ఇందులో ఏదో రోజు మనకి కూడా సమయం వస్తుందని నమ్మే గల్లీ బాయ్‌గా అదరగొట్టారు రణ్‌వీర్. 2019లో విడుదలైన ఈ సినిమాకు కొనసాగింపుగా 'గల్లీ బాయ్ 2'ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో అందాల తార అనన్య పాండే, విక్కీ కౌశల్ నాయకానాయికలుగా కనిపించనున్నట్లు సమాచారం. "ఖో గయే హమ్ కహాన్' ఫేమ్ అర్జున్ వరైన్ సింగ్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఇందులో నటించడానికి విక్కీ, అనన్య ఉత్సాహంగా ఉన్నారు. వీరిద్దరి జోడీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా కనిపిస్తుంది. మునుపెన్నడూ పోషించని శక్తిమంతమైన పాత్రల్లో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని మొదలు పెట్టింది చిత్రబృందం" అని విక్కీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# మలేరియా కట్టడిలో కొత్త ఆశ

%మలేరియా పరాన్నజీవిలో ఇప్పటివరకూ తెలియని భాగం మీద దాడి చేసే కొత్త రకం యాంటీ బాడీలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు గుర్తించారు. మలేరియా నివారణ కోసం వినూత్న మార్గాల ఆవిష్కరణకిది దారితీయగలదని భావిస్తున్నారు. మలేరియా కారక ప్లాస్మోడియం పరాన్నజీవులు దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. కొన్నిదేశాల్లో మలేరియా ఇప్పటికీ ఎంతోమందిని బలి తీసుకుంటోంది. దీన్ని అరికట్టటానికి ఇటీవల కొత్త విధానాలెన్నో అందుబాటులోకి వస్తున్నాయి. మలేరియా ఎక్కువగా ప్రబలే ప్రాంతాల్లో ప్రస్తుతం పిల్లలకు టీకాలు ఇవ్వటం ఆరంభించారు. మలేరియాను ఎదుర్కొనే మోనోక్లోనల్ యాంటీబాడీలు కూడా మెరుగైన ఫలితాలు చూపిస్తున్నాయి. ఇవి పరాన్నజీవి దోమల నుంచి మనుషులకు వ్యాపించే దశలో (స్పోరోజైటిస్) వాటికి అంటుకొని నిర్వీర్యం చేస్తాయి.

ఇలా కాలేయంలో ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా నివారిస్తాయి. లేకపోతే పరాన్నజీవులు రక్తం దశకు చేరుకొని, మనుషుల్లో రక్త కణాలను ఇన్‌ఫెక్షన్‌కు గురిచేస్తాయి. ప్రాణాంతకంగానూ పరిణమిస్తాయి. సాధారణంగా ఈ మోనోక్లోనల్ యాంటీబాడీలు పరాన్నజీవుల ఉపరితలం మీద ఒక చోట అంటుకుంటాయి. ఇవి అంటుకునే ఇతర భాగాలనూ ఇప్పుడు పరిశోధకులు గుర్తించారు. పరాన్నజీవికి సంబంధించిన ఏదో ఒక భాగానికి కాకుండా మొత్తం స్పోరోజైట్‌కు ప్రతిస్పందనలను పుట్టించగల మోనోక్లోనల్ యాంటీబాడీలను శాస్త్రవేత్తలు వేరు చేశారు. ముఖ్యంగా మ్యాడ్21-101 అనే మోనోక్లోనల్

## మలేరియా కట్టడిలో కొత్త ఆశ

%మలేరియా పరాన్నజీవిలో ఇప్పటివరకూ తెలియని భాగం మీద దాడి చేసే కొత్త రకం యాంటీ బాడీలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు గుర్తించారు. మలేరియా నివారణ కోసం వినూత్న మార్గాల ఆవిష్కరణకిది దారితీయగలదని భావిస్తున్నారు. మలేరియా కారక ప్లాస్మోడియం పరాన్నజీవులు దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. కొన్నిదేశాల్లో మలేరియా ఇప్పటికీ ఎంతోమందిని బలి తీసుకుంటోంది. దీన్ని అరికట్టటానికి ఇటీవల కొత్త విధానాలెన్నో అందుబాటులోకి వస్తున్నాయి. మలేరియా ఎక్కువగా ప్రబలే ప్రాంతాల్లో ప్రస్తుతం పిల్లలకు టీకాలు ఇవ్వటం ఆరంభించారు. మలేరియాను ఎదుర్కొనే మోనోక్లోనల్ యాంటీబాడీలు కూడా మెరుగైన ఫలితాలు చూపిస్తున్నాయి. ఇవి పరాన్నజీవి దోమల నుంచి మనుషులకు వ్యాపించే దశలో (స్పోరోజైటిస్) వాటికి అంటుకొని నిర్వీర్యం చేస్తాయి.

ఇలా కాలేయంలో ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా నివారిస్తాయి. లేకపోతే పరాన్నజీవులు రక్తం దశకు చేరుకొని, మనుషుల్లో రక్త కణాలను ఇన్‌ఫెక్షన్‌కు గురిచేస్తాయి. ప్రాణాంతకంగానూ పరిణమిస్తాయి. సాధారణంగా ఈ మోనోక్లోనల్ యాంటీబాడీలు పరాన్నజీవుల ఉపరితలం మీద ఒక చోట అంటుకుంటాయి. ఇవి అంటుకునే ఇతర భాగాలనూ ఇప్పుడు పరిశోధకులు గుర్తించారు. పరాన్నజీవికి సంబంధించిన ఏదో ఒక భాగానికి కాకుండా మొత్తం స్పోరోజైట్‌కు ప్రతిస్పందనలను పుట్టించగల మోనోక్లోనల్ యాంటీబాడీలను శాస్త్రవేత్తలు వేరు చేశారు. ముఖ్యంగా మ్యాడ్21-101 అనే మోనోక్లోనల్ యాంటీబాడీ మరింత శక్తిమంతంగా పనిచేస్తున్నట్టు, ప్లాస్మోడియం ఫాల్సిఫారమ్ నుంచి రక్షణ కల్పిస్తున్నట్టు తేలింది. దీన్ని టీకాల్లో వాడుకుంటే మెరుగైన రోగనిరోధక ప్రతిస్పందన సాధ్యమవుతుందని ఆశిస్తున్నారు.


# ఐస్ ప్యాక్ 20 నిమిషాల్లోపే

%బెణికినప్పుడో, దెబ్బ (చర్మం చీరుకుపోని) తగిలినప్పుడో ఐస్‌ను బ్యాగులో వేసి అద్దితే మంచి ఫలితం కనిపిస్తుంది. దీంతో అక్కడ మొద్దుబారి నట్టయి, నాడులకు నొప్పి



సమాచారాన్ని చేరవేసే సంకేతాలు తగ్గుతాయి. ఫలితంగా నొప్పి తగ్గినట్టు అనిపిస్తుంది. రక్త ప్రసరణను తగ్గించటం వల్ల వాపు కారకాలు అక్కడికి అంతగా చేరుకోవు కూడా. మరి ఎంతసేపు ఐస్ ప్యాక్‌ను పెట్టుకోవాలి? చాలామందికి 10-15 నిమిషాలు సరిపోతుంది. గరిష్ఠంగా 20 నిమిషాల కన్నా మించనీయొద్దు. మరీ ఎక్కువసేపు ఐస్ ప్యాక్‌ను పెడితే నయమయ్యే ప్రక్రియ మందగిస్తుంది. దీంతో లాభం కన్నా నష్టమే ఎక్కువ.

# సూర్య శక్తి ప్రాప్తిరస్తు



సూర్యుడిని ప్రత్యక్ష దైవంగా కొలుస్తాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మనం ఆయన నీడలోనే గడుపుతాం. కాల గమనానికైనా, ఆహార చక్రానికైనా, ఆరోగ్య చక్రానికైనా ఆయనే ఆధారం. మన ప్రాచీన ఆయుర్వేదం దీన్ని ఏనాడో గుర్తించింది. ఆధునిక వైద్యరంగం కూడా నిద్ర, మెలకువలు, హుషారు, ఉత్సాహం వంటివన్నీ భానుడి వెలుగులతోనే ముడిపడి ఉంటున్నాయని అధ్యయన పూర్వకంగా పేర్కొంటోంది. ఆయన గొప్పతనాన్ని మరోసారి తలచుకుందాం. ఆయన అందించే ఆరోగ్యం గురించి మరోసారి తెలుసుకుందాం. సంక్రాంతి పర్వదినం సందర్భంగా 'సూర్య శక్తి ప్రాప్తిరస్తు' అని మనకు మనమే దీవించుకుందాం.

ఓజస్సు బలంగా ఉంటే ధాతువులు బలంగా ఉంటాయి. ధాతువులు బలంగా ఉంటే వ్యాధి క్షమత్వం స్థిరంగా ఉంటుంది. వ్యాధులు దరిజేరవు. వచ్చినా అంతగా బాధించవు. మన శరీరంలో ఓజస్సు రెండు రకాలుగా కనిపిస్తుంది.

1. పర ఓజస్సు 2. అపర ఓజస్సు. పర ఓజస్సు ఉత్కృష్టమైంది. ఇది మన హృదయంలో ఎనిమిది చుక్కల పరిమాణంలో ఉంటుంది. ఇది ఏమాత్రం తగ్గినా శరీరం చతికిల పడుతుంది. అపర ఓజస్సేమో ఏడుగా విడిపోయి, ధాతువులతో కలిసి శరీరమంతటా వ్యాపిస్తుంది. ఇది సగం దోసెడు (అర్థాంజలి) ప్రమాణంలో ఉంటుంది. ఇది హృదయ ధమనుల ద్వారా మిగతా ధాతువులకు చేరుకొని వాటికి అవసరమైన శక్తిని అందిస్తుంది.

'ఓమ్ భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్'. పవిత్రమైన ఈ గాయత్రి మంత్రంలోని 'సవితుర్' అనేది సూర్య భగవానుడి వర్ణనే. భూమ్మీద జీవులన్నింటికీ శక్తి కేంద్రం, ప్రాణాధారం సూర్యుడే. ఆయన కిరణాల నుంచి ప్రసరించే శక్తితోనే చెట్లు, జీవులు మనుగడ సాగిస్తున్నాయి. భౌతిక, దైవిక ప్రపంచాల మధ్య సూర్యుడిని అంతరిక్ష వారధిగా పురాతన నాగరికతలు ఏనాడో అర్థం చేసుకున్నాయి. మన మనుగడను అన్ని విధాలుగా ప్రభావితం చేస్తున్నదీ ఆయనేనని గుర్తించాయి. ప్రాణానికి, శక్తికి తొలి ఆధారం సూర్యుడే. ప్రాణమనేది శక్తి యొక్క భౌతిక రూపమే. సూర్యుడు లేకపోతే వేడి లేదు. వేడి లేకపోతే ప్రాణం లేదు. మనం జీవించి ఉన్నామో, మరణించామో అనేది తెలిపేది శరీరం వెచ్చగా ఉందా? చల్లగా ఉందా? అనేవే. జీవకోటి మనుగడ, అభివృద్ధికి సంబంధించి అన్ని పార్శ్వాల్లోనూ సూర్యుడి ప్రభావం అద్వితీయమైందని వేదాలు (ఆయుర్వేదం కూడా వీటిల్లో భాగమే) ఏనాడో నొక్కి చెప్పాయి.

### సంపూర్ణ ఆరోగ్య సూత్రం

బలమైన శరీరం, స్పష్టమైన మనసు, ఆధ్యాత్మిక ఉన్నతితోనే మన సంపూర్ణ ఆరోగ్యం ముడిపడి ఉందని.. దీనికి సూర్య శక్తి మూలమని శాస్త్రం పేర్కొంటోంది. సూర్యుడు వాతావరణాన్ని ప్రాణంతో నింపాడని, దీన్ని మనుషులు సూర్యరశ్మి, ఆహారం, నీరు, గాలి ద్వారా గ్రహించుకుంటారని చెబుతోంది. శారీరక బలం, సామర్థ్యం, రోగనిరోధక శక్తి పెంపొందటానికి ఒంటికి ఎండ తాకటం అత్యవసరం. అలాగే రజస్సు (పనితీరు) నియంత్రణలో ఉండటానికి, మనసులో సత్వ (నైర్మల్యం, సామరస్యం) గుణం పెరగటానికీ సూర్యరశ్మి తోడ్పడుతుంది. ఇలా మానసిక ఆరోగ్యానికి దన్నుగా నిలుస్తుంది. సూర్య ఉపాసన వంటి విధానాలు అలౌకిక శక్తులతో అనుసంధానం చేసి ఆధ్యాత్మిక ఉన్నతికి దారితీస్తాయి. అందుకే సూర్యోదయంతో మొదలు పెట్టి మధ్యాహ్నం, సాయంత్రం వరకూ ఆయా సమయాల్లో వర్తించాల్సిన తీరును ఆయుర్వేదం దినచర్య రూపంలో స్పష్టంగా వివరించింది. ఉదయం ఎండ జీవక్రియలను, మానసిక స్థితిని ఉత్తేజితం చేస్తే.. మధ్యాహ్న ఎండ జీర్ణక్రియకు, శరీరం పోషకాలను గ్రహించుకోవటానికి తోడ్పడుతుంది.

### శరీరం బలోపేతం

జీవశక్తిని గ్రహించుకోవటం, దాన్ని వినియోగించటంతోనే శరీర బలం ముడిపడి ఉంటుంది. ప్రాణానికి ఆధారమైన సూర్యుడితోనే ఈ ప్రక్రియ ఉత్తేజితమవుతుంది.

ప్రాణశక్తి ఉద్దీపన: అన్నింటిలోనూ నిగూఢంగా ప్రవహించే ప్రాణ శక్తికి సూర్యరశ్మి కీలక వనరు. ముఖ్యంగా ఉదయం ఎండ తాకితే శరీరం జీవశక్తిని బాగా గ్రహించుకుంటుంది. సూర్య ఉపాసన, సూర్య స్నానం వంటి పద్ధతులు ఇందుకు తోడ్పడేవే.

ఎముక, కండర పటుత్వం: విటమిన్ డి సంయోజనానికి ఎండ తోడ్పడుతుంది. ఈ విషయాన్ని ప్రాచీన ఆయుర్వేదం పరోక్షంగా ఏనాడో అర్థం చేసుకుంది. ఎముకలు, కండరాలు, కండర బంధనాలు బలోపేతం కావటానికి విటమిన్ డి అత్యవసరం. ఎముక పటుత్వమే శారీరక బలానికి పునాది వేస్తుంది. శారీరక సామర్థ్యం పెంపొందటానికి కండరాల సంకోచ, వ్యాకోచాలు కీలకం. దీనికి క్యాల్షియం తప్పనిసరి. దీన్ని శరీరం గ్రహించుకోవటానికీ విటమిన్ డి తోడ్పడుతుంది.

ప్రాణవాయువు సంగ్రహణ: ఎండ ప్రభావంతో రక్త ప్రసరణ పుంజుకుంటుందనీ శాస్త్రం చెబుతుంది. చర్మానికి ఎండ తగిలినప్పుడు నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి పెరుగుతుందని, దీంతో రక్తనాళాలు విప్పారతాయనే ఆధునిక వైద్యం అవగాహనతోనూ ఇది సరిపోలటం విశేషం. దీంతో కండరాలకు మరింత ఎక్కువగా ఆక్సిజన్ అందుతుంది. రక్త ప్రసరణ పుంజుకోవటం, తగినంత ఆక్సిజన్ అందటం వల్ల గుండె కూడా బలోపేతమవుతుంది.

### సామర్థ్యం పెంపు

శారీరకంగా, మానసికంగా సమర్థంగా ఉంటేనే ఆయా పనులను స్థిరంగా కొనసాగించటానికి వీలవుతుంది. ఈ సామర్థ్యం పెంపొందటానికి ఎండ సాయం చేస్తుంది.

జీవక్రియ ఉత్తేజం: తిన్న ఆహారాన్ని శక్తిగా మార్చే అగ్ని (జీర్ణ శక్తి)ని ఎండ ప్రేరేపిస్తుంది. ఇలా జీవక్రియలు సజావుగా సాగటానికి తోడ్పడుతుంది. శక్తి నిరంతరాయంగా అందటం వల్ల ఎక్కువసేపు శారీరక శ్రమ చేయటం సాధ్యమవుతుంది.

జీవక్రియల నియంత్రణ: రాత్రి, పగలు ఆధారంగా పనిచేసే, సహజ జీవక్రియలను పర్యవేక్షించే జీవగడియారాన్ని నియంత్రించేది సూర్యుడే. పగటి పూట వీలైనంత అధిక శక్తిని ఇదే సమకూరుస్తుంది. ఉదయం పూట శరీరానికి ఎండ తగిలితే జీవగడియారం సజావుగా పనిచేస్తుంది. చురుకుదనం పెరుగుతుంది.

### రోగనిరోధక శక్తికి ఊతం

ప్రాచీన వైద్య పద్ధతుల్లో రోగ నిరోధకశక్తికీ, సూర్యరశ్మికీ విడదీయరాని బంధం కనిపిస్తుంది. ఎండను శరీరాన్ని, మనసును శుద్ధి చేసే దినుసుగా, బలమైన రోగ నిరోధక వ్యవస్థకు నేరుగా దోహదం చేసేదిగానే భావించారు.

ఓజస్సు ఉత్తేజితం: ఆయుర్వేదంలో రోగనిరోధకశక్తి, జీవశక్తి సారం ఓజస్సే. సరైన జీర్ణక్రియ, శక్తి సమీకరణంతోనే ఇది పుట్టుకొస్తుంది. సూర్యరశ్మి జీర్ణశక్తిని బలోపేతం చేయటం ద్వారా ఓజస్సు ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది.

విటమిన్ డి సంశ్లేషణ: విటమిన్ డి మరో ముఖ్యమైన పని రోగనిరోధకశక్తిని ఇనుమడింపజేయటం, దాన్ని సజావుగా పనిచేయించటం. ఇది హానికారకాల పనిపట్టే టి కణాలను ప్రేరేపిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, స్వీయరోగనిరోధక జబ్బులను ఎదుర్కొనే రోగనిరోధక ప్రతిస్పందనను బలోపేతం చేస్తుంది.

విషతుల్యాల నిర్మూలన: రక్త ప్రసరణ, చెమట పట్టటాన్ని ప్రేరేపించటం ద్వారా ఎండ శరీరంలోంచి విషతుల్యాలు (ఆమం) బయటకు వెళ్లగొడుతుది. దీంతో శరీరం జబ్బులను సమర్థంగా ఎదుర్కొనేలా తయారవుతుంది.

సూక్ష్మక్రిముల నాశనం: పర్యావరణం, శరీరం శుభ్రపడటానికి ఎండ తోడ్పడుతుందని ప్రాచీన వైద్యులు ఏనాడో గుర్తించి, ఆచరణలో పెట్టారు. అతినీలలోహిత కిరణాలు చర్మం మీద హానికారక సూక్ష్మక్రిములను చంపుతాయంటూ ప్రస్తుత అధ్యయనాల్లో తేలటం ఈ భావనను మరింత బలోపేతం చేస్తోంది.

యాంటీఆక్సిడెంట్ల ఉత్పత్తి పెంపు: చర్మానికి ఎండ తగలినప్పుడు మెలటోనిన్ వంటి యాంటీఆక్సిడెంట్ల ఉత్పత్తి ప్రేరేపితమవుతాయి. విశృంఖల కణాల పనిపట్టే ఇవి కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. రోగనిరోధశక్తికి దన్నుగా నిలుస్తాయి.

### మితిమీరొద్దుజి

ఆరోగ్యానికి ఎండ అత్యవసరవే అయినా మితిమీరకుండా చూసుకోవటం తప్పనిసరి. మరీ ఎక్కువగా ఎండ ప్రభావానికి గురైతే చర్మం దెబ్బతినే ప్రమాదముంది. ఒంట్లో నీటిశాతం తగ్గుతుంది. పిత్త దోషం ప్రకోపించి దద్దు, వాపు, వేడి సంబంధ సమస్యలు తలెత్తొచ్చు. కాబట్టి బాగా తీక్షణంగా ఉండే మధ్యాహ్నం ఎండ తగలకుండా చూసుకోవటం, తేలికైన దుస్తులు ధరించటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. చలువ కళ్లద్దాలు ధరించాలి.

### ఇలా దక్కించుకోవాలి

సూర్య స్నానం, సూర్య ఉపాసన, సూర్య నమస్కారాలతో ఎండ ప్రయోజనాలను బాగా పొందొచ్చని ఆయుర్వేదం పేర్కొంటోంది. ఉదయం పూట లేత ఎండ ఒంటికి తగిలేలా చూసుకుంటే సూర్య స్నానం చేసినట్టే. గాయత్రి మంత్రాన్ని పఠించటం, సంధ్యావందనం, అర్ఘ్యం ఇవ్వటం వంటి ఆచారాలు అటు ఆధ్యాత్మిక ఆరోగ్యంతో పాటు ఇటు శారీరక ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. సూర్యుడికి అభిముఖంగా క్రమబద్ధమైన ఆసనాలతో చేసే సూర్య నమస్కారాలు సైతం ఎండ ప్రయోజనాలు పొందటానికి, సూర్య శక్తితో అనుసంధానం కావటానికి తోడ్పడతాయి.


### ఆధునిక వైద్య సూచనలు

రోజూ కనీసం 10-30 నిమిషాల సేపు ఒంటికి ఎండ తగిలేలా చూసుకోవాలన్నది నిపుణుల సూచన. అయితే ఎండతో విటమిన్ డి మోతాదులు పెరగటమనేది ఆయా వ్యక్తుల చర్మం రకం, నివసించే ప్రాంతాలను బట్టి ఉంటుంది.

ఉదయం పూట అతి నీలలోహిత కిరణాలు అంత తీవ్రంగా ఉండవు. కాబట్టి ఎండ దుష్ప్రభావాలు తలెత్తకుండా చూసుకోవటానికి ఈ సమయం అనువుగా ఉంటుంది.

# పిక్కలకు కె2 రక్ష

మంచి నిద్రలో ఉండగా హఠాత్తుగా పిక్కలు పట్టేయటం చాలామందికి అనుభవమే. కొద్దిసేపు అయినా తీవ్రమైన నొప్పితో వేధిస్తుంది. పెద్దవారిలో సుమారు 50-60% మంది జీవితంలో ఎప్పుడో అప్పుడు దీని బారినపడ్డవారే అన్నా అతిశయోక్తి కాదు. ఇది దాదాపు 20% మందిని చాలా అసౌకర్యానికి, నిద్రలేమికి గురి చేస్తుంది. ఈ సమస్య తగ్గటానికి విటమిన్ కె2 తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. దీంతో పిక్కలు పట్టేసే సందర్భాలు, సమయం మాత్రమే కాకుండా తీవ్రతా తగ్గుతున్నట్టు తేలింది. అదీ ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy